బీజేపీ ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకంగా తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్. కిషన్, కృష్ణ, గౌస్‌లు డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట జోన్ సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల కోర్కెల దినం సందర్భంగా నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న 4లేబర్ కోర్డ్ రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు పెంచి, పండుగ, ఆదివారం సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని యెడల కార్మికులతో మమేకమై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్‌లు తదితరులున్నారు.



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మెహిదీపట్నంలో డిమాండ్స్ డే సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు సి.మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నవతెలంగాణ మెహిదీపట్నం

ఆ మూడు ప్రమాణాలు ఉన్న కళాశాలలనే ఎంచుకోండి

ఓయూ ఇంజనీరింగ్ కళాశాల
ప్రిన్సిపాల్ పైడిమర్రి చంద్రశేఖర్



ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులు యూజీసీ అటానామి, న్యాక్ గ్రేడ్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్ గుర్తింపు పొందిన కళాశాలల్లో చేరాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.పైడిమర్రి. చంద్రశేఖర్ సూచించారు. వాటికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అక్కడ ప్రమాణాలతో పాటు అధ్యాపకురాలు, లేబరేటరీ సదుపాయాలు ఉంటాయన్నారు.



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.పైడిమర్రి. చంద్రశేఖర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ..

నవతెలంగాణ : ఎలాంటి గ్రూప్ ఎన్నుకుంటే బాగుంటుంది?

ప్రిన్సిపాల్ : విద్యార్థులు గ్రూప్ ఎంపిక కంటే కళాశాలలో సౌకర్యాలు, అధ్యాపకులు, ఇంటెన్సిప్ సదుపాయాలు ఉన్న గ్రూప్స్‌ను ఎంచుకోవాలి. ఇంజనీరింగ్ గ్రూప్స్ అన్ని కోర్సుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. విషయ పరిజ్ఞానం ఉంటే అదే స్థాయిలో వేతనాలు ఉన్నాయి.

నవతెలంగాణ : నేడు కంప్యూటర్ సైన్స్‌కు డిమాండ్, ఆదరణ లభిస్తోంది, దానికి గల కారణాలు ఏమిటి?

ప్రిన్సిపాల్ : ఐటీ విప్లవం వల్ల ఉపాధి అవకాశాలు నేషనల్ మల్టీనేషనల్ కంపెనీల్లో అవకాశాలు సంవృద్ధిగా లభిస్తున్నాయి. విద్యార్థుల్లో ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు ఉంటే త్వరలోనే ఉద్యోగాలు వస్తాయి. దీనిలో ఉపాధి అవకాశాలు రెట్టింపు స్థాయిలో ఉండటం వల్ల విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపడంతో పాటుగా ప్రోత్సాహం ఇస్తున్నారు.

నవతెలంగాణ : ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలాంటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి?

ప్రిన్సిపాల్ : కంప్యూటర్ సైన్స్, ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు దొరుకుతాయి. మ్యానిఫ్యాక్చరింగ్, డిజైనింగ్ కంపెనీల్లో ఉద్యోగా లు సంవృద్ధిగా లభిస్తున్నాయి. అదనంగా కంప్యూటర్ మైనర్ ప్రోగ్రాం చేసుకోవచ్చు. కొత్తగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, అండ్ ఇన్సరెన్స్‌లో మైనర్ ప్రోగ్రాంను 2024 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నాం. దీని వలన పేరు ప్రఖ్యాతులు కలిగిన బ్యాంకింగ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ మైనర్ ప్రోగ్రాం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ఇంజనీరింగ్ కళాశాలలో ఆఫర్ చేస్తున్నాం. దీని వలన బ్యాంకింగ్ సంస్థల్లో విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో కోర్సులు అభ్యసించి గేట్ అర్హత ఉంటే ప్రభుత్వ అండ్ ప్రయివేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయి. వీటికి ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా లాంటి దేశాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

నవతెలంగాణ : ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవలే 2023సం. నుండి ప్రారంభించిన బీఈ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ వివరాలు చెప్పగలరు?

ప్రిన్సిపాల్ : ఏఐసీటీఈ 2023 నుండి బీఈ ప్రోగ్రాం ఫర్ వర్కింగ్ ప్రొపెషనల్స్ ప్రారంభించడానికి అనుమతి ఇచ్చింది. ఇది 4 ప్రోగ్రాం, సివిల్ ఇంజనీరింగ్, మెకానిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్‌తో పాటుగా ఏఐయంఎల్ ప్రోగ్రాం ఆఫర్ చేస్తున్నారు. డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగాలు చేస్తున్న ఎంతో మంది అభ్యర్థుల నుండిఅనూహ్యంగా స్పందన వస్తుంది.

నవతెలంగాణ : కన్వెన్షనల్ బ్రాంచ్‌లలో అవకాశాలు ఎలా ఉన్నాయి?

ప్రిన్సిపాల్ : అన్ని ప్రముఖ కళాశాలలో కన్వెన్షనల్ బ్రాంచ్‌లలో సివిల్ ఇంజనీరింగ్, మెకానిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అభ్యర్థులు గేట్ అర్హత ఉంటే పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు తప్పనిసరి దొరుకుతున్నాయి. ఏఐసీటీఈ ఇటీవలే ఈ బ్రాంచ్‌లలో చేరే విద్యార్థులకు ప్రోత్సాహంగా స్కాలర్ షిప్స్ ఇస్తుందన్నారు. కోర్ సెక్టార్‌లలో ఉద్యోగ అవకాశాలతో పాటుగా కోడింగ్ అండ్ ఏనాటికల్ స్కిల్స్ ఇంప్రూమెంట్ చేసుకుంటే లేదా మైనర్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్సు, ఐఓటీ, లేదా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సరెన్స్‌లో చేసుకుంటే ఐటీ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

యువ ఇంజినీర్లను తీర్చిదిద్దుతున్న సెయింట్ పీటర్స్





టి.వి. రెడ్డి
సెయింట్ పీటర్స్ కళాశాల సెక్రటరీ

- యూజీసీ అటానమస్‌గా గుర్తింపు
- క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో అగ్రగామి
- సువిశాలమైన క్యాంపస్
- ఈ ఏడాది అత్యధిక ప్యాకేజీ రూ. 11 లక్షలు
- కళాశాలలోని 95.63 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్
- వన్ ఆఫ్ ది టాప్ రేటెడ్ ఇంజనీరింగ్ కాలేజీ
- సెయింట్ పీటర్స్ ఎంసెట్ కోడ్ SPEC

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజనీరింగ్ విద్యలో అగ్రగామిగా నిలుస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల. దూలపల్లి మైసమ్మగూడలో ఉన్న ఈ క్యాంపస్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఉజ్వల భవితకు కేరాఫ్‌గా నిలుస్తోంది. కళాశాల యూజీసీ అటానమస్ కళాశాలగా అవతరిం చింది. ఈ కళాశాలకు సెక్రటరీగా టి.వి. రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్‌గా సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా అనురాగ్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ప్రిన్సిపాల్‌గా డా. కే. శ్రీలత ఉన్నారు.

కార్పొరేట్ ప్రపంచానికి అనుగుణంగా అవకాశాల కల్పనకు మార్గంగా సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల నిలుస్తోంది. హైలీ క్వాలిఫైడ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ ఫ్యాకల్టీ ఉన్నారు.10 ఎకరాలలో కళాశాల నిర్మితమైంది. వైఫై సౌకర్యం, ఆధునిక సాంకేతికతకు నిలయంగా ఉంది. ప్రపంచవ్యాప్త ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. డిజిటలైజ్డ్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీ ఉన్నాయి. ఆర్అండ్‌డీ ఇంక్యుబేషన్ సెంటర్ ఉంది. ఈ కళాశాల ఎన్‌బీఏ, న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు పొందింది. 80 కేవీ సోలార్ ప్లాంట్ సౌకర్యం కలిగి ఉంది. కాగా తాజాగా కళాశాలలో 95.63 శాతం విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ లభించాయి.

కళాశాల అందిస్తున్న కోర్సులు

బీటెక్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సీఎస్ఈ (ఆర్టీఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ సీఎస్ఈ(డేటా సైన్స్), సివిల్ ఇంజనీరింగ్, సీఎస్ఈ(సైబర్ సెక్యూరిటీ) ,

ఎంటెక్

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్

ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా జంగా రాఘవరెడ్డి బాధ్యతల స్వీకరణ

- హాజరైన మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా జంగా రాఘవరెడ్డి బుధవారం హైదరాబాద్, బషీర్ బాగ్ లోని పరిశ్రమ భవన్‌లో అట్టహాసంగా అభిమానుల మధ్య ఆయన బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రేవూరి ఆయనను కుర్చీలో కూర్చోబెట్టి అభినందన లు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో పరిశ్రమ భవన్ కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడారు ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గా జిల్లాలోని రైతులందరికీ న్యాయం చేశానని, అదే విధంగా బ్యాంకు అభివృద్ధికి కృషి చేశానన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి



- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. చిక్కడపల్లిలోని అంజయ్య భవన్ కార్మిక శాఖ కార్యాలయంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కనీస వేతనాల మండలి బోర్డు చైర్మెన్‌గా జనక్ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ వారి కష్టనష్టాలు తెలిసిన నాయకునికి ఈ పదవి దక్కడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఆయన ప్రభుత్వానికి, కార్మికులకు వారధిగా ఉంటూ.. ప్రభుత్వానికి మంచి పేరుతో, కార్మికులకు మేలు చేసే విధంగా పని చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకులు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ , మల్లికార్జున ఖర్గే , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నూతనంగా చైర్మెన్ పదవులు స్వీకరిస్తున్న అందరికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కార్మికులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్ర మానసిక క్షోభ అనుభవించారన్నారు. వారి అభ్యున్నతికి కృషిచేసిన నాయకుడే కరువయ్యాడని తెలిపారు. పదేళ్లుగా కార్మికుల వేతనాలు పెరగలేదు అన్నారు. తనపై నమ్మకంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ పదవి కేటాయించడం సంతోషకరంగా ఉందన్నారు కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని కార్మికులకు కనీస వేతనాలు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మానవ సేవే మాధవ సేవ

- మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా



నవతెలంగాణ-అంబర్‌పేట

మానవ సేవయే మాధవ సేవ అని మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు. వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగ రాజు గుప్త జన్మదినం సందర్భంగా బుధవారం నగరంలోని కాచిగూడతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పేద ప్రజల కోసం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వీబీజీ ఫౌండేషన్ టీమ్ సభ్యులు ఐకమత్యంతో చేస్తున్న సామాజిక సేవాల కార్యక్రమాలు బేషుగ్గా ఉన్నాయని అభినందించారు. ఈ సందర్భంగా లక్షల విలువ చేసే వికలాంగులకు వీల్ చైర్లు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లు, నిరుపేదలకు బట్ట లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పుస్తకాలు, స్కూల్ ఫీజులు, పేద మహిళలు వ్యాపారం చేసుకోవడానికి గ్రైండర్స్ అందజేశారు. వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత చీకోటి ప్రవీణ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, బండారు సుబ్బారావు, టిఎస్పి ప్రసాద్, ఇమ్మడి రమేష్, రాజేష్, బొగ్గరి శివ, తెలంగాణ, ఏపీ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వీబీజీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించడం తగదు

- నిరసనలో సీఐటీయు సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించడం ప్రభుత్వాలకు తగదని సీఐటీయు సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్ అన్నారు. లేబర్ డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయు గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్, సంతోష్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... కేంద్రంలో మూడోసారి మోడీ ప్రభుత్వం వచ్చి కార్మికులకు నష్టదాయకమైనటువంటి నాలుగు చట్టాలు సరికాదన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే చట్టాలను హరించే ప్రక్రియలకు పాల్పడటాన్ని ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలు కావొస్తున్నా ఇప్పటికీ కార్మికుల కోసం ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టింది లేదన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సౌత్ జిల్లాలోని చాంద్రాయణగుట్ట, చార్మినార్, యాకుత్‌పూర, మలక్‌పేట్, గోషామాల్ తదితర నియోజకవర్గాలలో జీహెచ్ఎంసీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, హమాలీ కార్మికులు, ఇతర ప్రతి కార్మిక రంగంలోనూ నిరసన కార్యక్రమాలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు, జి.కిషన్, జీహెచ్ఎంసీ వర్కర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షురాలు జి.యాదమ్మ, కిష్టమ్మ, లాలమ్మ, లక్ష్మయ్య వివిధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

'చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'



- కేంద్రం చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలి
- బీసీ మేధో మదన సదస్సులో ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పార్లమెంట్ లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్య సభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంత రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 28 బీసీ, 36 కుల, 48 ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'బీసీ మేధో మదన సదస్సు'ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కుల గణన చేపట్టాలని, పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుండి 52 శాతానికి పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, అసెంబ్లీ-పార్లమెంట్ సీట్లను 100 శాతం పెంచాలని, ఇలా పెంచిన సీట్లను ఇంత వరకు అసెంబ్లీ-పార్లమెంట్ గడప తొక్కని బీసీ కులాల వారికి నామినేటెడ్ పద్ధతిపై ఆంగ్లో-ఇండియన్లకు ఇచ్చిన మాదిరిగా నామినేట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు.

ప్రత్యేకంగా కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్ మెంట్, ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాల ని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి 'బీసీ యాక్టు'ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం, కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతానికి పెంచాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర స్థాయిలో రెండు లక్షల కోట్ల బడ్జెట్ తో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాం డ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు అనంతయ్య, రాందేవ్, జిల్లపల్లి అంజి, రామ కృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గొరిగె మల్లేష్, ఎర్ర సత్యనారాయణ, మట్ట జయంతి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయు గోషామహల్ జోన్ కన్వీనర్ కె. జంగయ్య



నవతెలంగాణ-ధూల్‌పేట్

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు గోషామహల్ జోన్ కన్వీనర్ కె. జంగయ్య డిమాండ్ చేశారు. జూలై 10న కార్మికుల డిమాండ్స్ డే, కోర్కెల దినం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముక్తార్ గంజ్ మహరాజ్ గంజ్, హమాలీ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై ఆయన మాట్లాడుతూ.. 55 ఏండ్లు నిండిన హమాలీ కార్మికులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముక్తార్ గంజ్ మహరాజ్ గంజ్ దాల్ మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చెన్నయ్య, ఆర్.సాయిలు, ఉపాధ్యక్షులు పి. కుర్మయ్య, కమిటీ సభ్యులు సంతోష్ , సిద్దులు, బాల్ రాజు, ట్రాన్స్ పోర్ట్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయ కులు హన్మంతు, డి.భీమయ్య, తాయప్ప, మోహన్, వెంకటేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ధూల్‌పేట్

జూలై 10 కార్మికుల డిమాండ్స్ డే కార్మికుల కోర్కెల దినం సందర్భంగా హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓకు సీఐటీయు గోషామహల్ జోన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె. జంగయ్య, పి.చెన్నయ్య, ఆర్.సాయిలు, పి.కుర్మయ్య, డి. భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 11-07-2024
సంపుటి : 10 | సంచిక : 192 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 18 పేజీలు | వెల : 6.50



భరణానికి అర్హులే
సుప్రీం తీర్పు

భరణం దాతృత్వం కాదు...
దానికి మతంతో సంబంధం లేదు
మహిళలందరికీ సీఆర్‌పీసీ సెక్షన్ 125 వర్తింపు

వివరాలు 17లో..



పార్టీ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

సంకీర్ణమైనా
సరళీకరణ విధానాలే
చంద్రబాబు, నితీశ్ వాటికి అనుకూలమే

- కార్పొరేట్ శక్తుల సేవకుడిగా మోడీ
- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి శృంగభంగం
- ప్రజల్లో భరోసా కల్పించిన ఇండియా బ్లాక్
- దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడమే మా లక్ష్యం
- ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్న కేంద్రం
- సెస్ వసూళ్లలో రాష్ట్రాలకూ వాటా ఇవ్వాలి
- రేవంత్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఉద్యమిస్తాం
- అవకాశవాద రాజకీయాలను బీఆర్ఎస్ వీడాలి
- మతోన్మాదంపై విశాల ప్రాతిపదికన పోరాడాలి : విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పిలుపు

వివరాలు 18లో

బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం



ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 18లో

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...



విభజన అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలి : రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన

వివరాలు 18లో

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు
ఆస్ట్రియా చాన్సలర్‌తో మోడీ భేటీ

ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలపై సుదీర్ఘంగా చర్చ
యుద్ధానికి సమయం కాదంటూ మోడీ పునరుద్ఘాటన



వియన్నా : భారత్, ఆస్ట్రియాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు గల కొత్త అవకాశాలను గుర్తించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. రాబోయే దశాబ్ద కాలంలో సహకారానికి బ్లూ ప్రింట్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సంబంధాలకు వ్యూహాత్మక దిశా నిర్దేశాన్ని ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోడీ, ఆస్ట్రియా ఛాన్సలర్ కర్ల్ నెహమర్‌తో చర్చలు జరిపారు. అనంతరం నెహమర్‌తో కలిసి మోడీ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తమ చర్చలు అర్థవంతంగా సాగాయని మోడీ చెప్పారు. ఉక్రెయిన్‌లో యుద్ధం, పశ్చిమాసియాలో పరిస్థితులతో సహా ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న వివాదాలన్నింటిపై సవివరంగా చర్చించినట్లు చెప్పారు. యుద్ధానికి ఇది సమయం...17లో

రైతులతో నేరుగా మాట్లాడండి
భూసేకరణలో మానవీయత ఉండాలి

ట్రిబుల్ ఆర్ అంతటికీ ఒకే నెంబర్
అటవీ భూములకు ప్రత్యామ్నాయం : కలెక్టర్లకు సీఎం ఆదేశాలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ రహదారులకు భూసేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో ఆమేరకు రైతులకు దక్కేలా చూడాలని చెప్పారు. బుధవారం రాష్ట్రంలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా, భూసేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని సీఎం ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువగా ఉండడం, మార్కెట్‌లో ధరలు అధికం కావడంతోనే భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని సీఎం ప్రశ్నకు కలెక్టర్లు బదులిచ్చారు. ఇందుకు స్పందించిన సీఎం తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులను పిలిచి నేరుగా మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దనీ, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్టు సీఎం తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ఎన్‌హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూసేకరణలో ఉన్న ఆటంకాలపై సీఎం ఆరా తీశారు. అలైన్‌మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారనీ, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి-భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు, సీఎం సూచించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని సీఎం అడిగారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందనీ, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ ...8లో

డీజీపీగా జితేందర్
హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా రవిగుప్తా

బాధ్యతలు స్వీకరించిన ఇరువురు అధికారులు
నేర రహిత రాష్ట్రమే లక్ష్యం : డీజీపీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ)గా జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ప్రస్తుత డీజీపీ డాక్టర్ రవిగుప్తాను రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. రాష్ట్ర డీజీపీగా ఆరు నెలల కిందట రవిగుప్తాను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి డీజీపీ అంజన్‌కుమార్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయన్ను ఆ పదవి నుంచి ఈసీ తప్పించిన సంగతి విదితమే. ఆయన స్థానంలో రవిగుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడు ఆయన స్థానంలో జితేందర్ డీజీపీగా నియమితు లయ్యారు. ఆయన బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో డీజీపీ కార్యాలయానికి చేరుకుని డాక్టర్ రవిగుప్తా నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన డీజీపీ జితేందర్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారులు సంజయ్‌కుమార్ జైన్, షికాగోయల్, శివధర్‌రెడ్డి, వి.వి.శ్రీనివాసరావు, అభిలాష బిస్త్, స్వాతిలక్రా, సుమతితో పాటు నగర పోలీసు కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి, తదితర అధికారులు అభినందనలు తెలిపారు. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జితేందర్ పంజాబ్ రాష్ట్రం జలంధర్‌కు చెందిన వారు. ఐపీఎస్ శిక్షణ పూర్తయ్యాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. నిర్మల్...17లో



8లో..

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు
శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

సాగుదారులకే భరోసా
రైతుభరోసా అమలుపై మెజార్టీ అభిప్రాయం

ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా విస్తృత సమావేశం
క్యాబినెట్ సబ్‌కమిటీ నేతృత్వంలో అభిప్రాయ సేకరణ
హాజరైన కన్వీనర్, డిప్యూటీ సీఎం భట్టి, సభ్యులు తుమ్మల, పొంగులేటి
రైతులు, రైతు సంఘాల నాయకులు వందలాది మంది అభిప్రాయాలు వెల్లడి
పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో విధివిధానాలు : భట్టి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, వేదికపై మంత్రులు తుమ్మల,పొంగులేటి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎవరైతే భూమి సాగు చేస్తున్నారో.. ఎన్ని ఎకరాలు సేద్యం చేస్తున్నారో.. అంత మొత్తానికి రైతుభరోసా' ఇవ్వాలని.. కౌలు రైతా? పట్టేదారా? అనేదానితో నిమిత్తం లేకుండా పంట పెట్టుబడి సహాయం చేయాలని మెజార్టీ అభిప్రాయం ...8లో



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి
ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి


సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్
డిమాండ్స్ డేలో పాల్గొన్న కార్మికులు.. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

నవతెలంగాణ - ముషీరాబాద్/విలేకరులు

కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, మున్సిపల్, భవన నిర్మాణ రంగం తదితర రంగాల కార్మికులు తమ హక్కులు, సమస్యలపై ధర్నాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ...8లో

లీకు వీరుడు బేడీ రామ్
నీట్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ రద్దు నేపథ్యంలో వినిపిస్తున్న పేరు

- ఈయన యూపీలో బీజేపీ మిత్రపక్షం ఎస్‌బీఎస్‌పీ ఎమ్మెల్యే
- గతంలో రైల్వే నుంచి రాష్ట్ర రిక్రూట్‌మెంట్ల వరకు హస్తం
- బేడీ రామ్‌పై అనేక పరీక్షా పత్రాల లీక్ ఆరోపణలు
- పలు రాష్ట్రాల్లో కేసులు.. కొట్టి పారేసిన ఎస్‌బీఎస్‌పీ



దేశంలో నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు, నీట్-పీజీ, యూజీసీ-నెట్ వంటి పరీక్షల రద్దు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. 'నీట్-(అండర్ గ్రాడ్యుయేట్)యూజీ' లీక్‌కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో గతంలోనూ జరిగిన పలు పరీక్షలకు సంబంధించిన లీక్ ఆరోపణలు దేశంలో చర్చకు వస్తున్నాయి ఇందులో భాగంగా యూపీలో బీజేపీ మిత్రపక్షం సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ)కి చెందిన ఎమ్మెల్యే బేడీ రామ్ పేరు మళ్లీ తెర పైకి వచ్చింది.



న్యూఢిల్లీ : "నేను వివిధ రాష్ట్రాలలో 40-50 మందిని రిక్రూట్ చేయిస్తాను. నేను ఇతర రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, బీహార్, తెలంగాణ, ఎంపీలో రిక్రూట్‌మెంట్‌లను పూర్తి చేస్తున్నాను. దాని(పేపర్) రద్దుతో సంబంధం లేకుండా ఫలితాలు వచ్చే వరకు మాత్రమే నా బాధ్యత" అని బేడీ రామ్ చెప్పిన మాటలకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బేడీ రామ్.. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో ఉన్న జఖానియన్ ఎమ్మెల్యే. ఆయన బీజేపీ మిత్రపక్షమైన ఎస్‌బిఎస్‌పీ సభ్యుడు. ఆ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఎస్‌బీఎస్‌పీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్.. యోగి తొలి క్యాబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. నీట్-యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్ష రద్దుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలోనే బేడీ రామ్‌కు సంబంధించిన ఈ వీడియో బయటకు వచ్చింది. అయితే బేడీరామ్ 2009 నుంచి వ్యాపారంలో ఉన్నట్టు తెలుస్తున్నది. రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలతో పాటు మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్సీ) నియామకాల్లో ప్రశ్న పత్రాలను లీక్ చేయటం, అక్రమమైన పద్ధతులను అభ్యసించినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కొన్ని వార్త కథనాల ప్రకారం.. మోసం చేయటం, ప్రశ్నపత్రాలను లీక్ చేయటం వంటి ఇతర ఆరోపణలతో ఆయనపై తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇంతకీ బేడీ రామ్ ఎవరు? ఆయనపై ఉన్న అభియోగాలు ఏమిటి? నిశితంగా పరిశీలిద్దాం.

మూడు రాష్ట్రాల్లో తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు

యూపీలోని జౌన్‌పూర్‌వాసి అయిన బేడీ రామ్(62) ఓం ప్రకాష్ రాజ్‌భర్ పార్టీ ఎస్‌బీఎస్‌పీలో ప్రముఖ దళిత నాయకుడు. ఆయన మాట్లాడుతున్నట్టుగా చెప్పబడుతున్న వీడియో వైరలైన తర్వాత.. యోగితో పాటు యూపీ ఉపముఖ్యమంత్రులు ...17లో

నాట్కో పరిశ్రమలో ప్రమాదం
ఒకరు మృతి, మరొకరికి గాయాలు



నవతెలంగాణ కొత్తూరు

నాట్కో పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేక గూడా గ్రామ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంజర్ల గ్రామానికి చెందిన రవి (19) అదే గ్రామానికి చెందిన అర్బాజ్ అనే కాంట్రాక్టర్ వద్ద రెండు నెలలుగా నాట్కో పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా బూమ్ లైట్ యంత్రంలో ఆయిల్ లీకేజీ ఉండటంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మరమ్మత్తులు చేయిస్తుండగా ఒక్కసారిగా యంత్రం పై నుంచి అతనిపై పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రవి మృతిచెందాడు. గాయాలైన మరో వ్యక్తి.. మహేష్ ప్రస్తుతం స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని తల్లి వీర్లపల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంపాదకీయం

రష్యా పర్యటనపై పశ్చిమ దేశాల అక్కసు!

ప్రధాని నరేంద్రమోడీ సోమ, మంగళవారాల రష్యా పర్యటన ముగిసింది. రక్షణ ఒప్పందంతో సహా పూర్వపు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనా నాడు ఏర్పడిన బంధం తరువాత రష్యాతో కూడా జయప్రదంగా కొనసాగుతున్నది. పాకిస్థాన్‌కు ఆధునిక ఆయుధాలు ఇచ్చి మన మీద ఉసికొల్పిన అమెరికాకు పోటీగా మనకు అవసరమైన మిలిటరీ సాయంతో పాటు అంతరిక్ష ప్రయోగాలలో కీలకమైన క్రయోజెనిక్ ఇంజన్ల పరిజ్ఞానంతో సహా అనేక రంగాలలో రష్యాతో మన అనుబంధం కొనసాగుతోంది. ఉక్కు, ఔషధ, ఇతర రంగాలలో మనం పొందిన సాయం కూడా తక్కువేమీ కాదు. ఇప్పటికీ మిలిటరీ ఆయుధాలు, పరికరాల అంశంలో రష్యాపైనే ప్రధానంగా ఆధారపడుతున్నాము. ప్రపంచ శ్రేణి క్షిపణి బ్రహ్మోస్ తయారీలో రష్యా భాగస్వామిగా ఉంది. ఎకె రకం మరతు పాకుల తయారీలో భాగస్వామ్యం గురించి... ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద గ్రంథమే అవుతుంది. ఇంతగా పెనవేసుకుపోయిన రెండు దేశాలనూ విడదీయాలని, తన ఆయుధాలను మనకు అంటగట్టాలని గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా చేయని ప్రయత్నం లేదు. ఈ పూర్వరంగంలో మోడీ పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ పర్యటన ద్వారా పశ్చిమ దేశాల పాటలకు అనుగుణంగా భారత్ నృత్యం చేసేందుకు సిద్ధంగా లేదన్న సందేశం పంపినట్లుగా చెప్పవచ్చు. దీని అర్థం వాటి నుంచి దూరంగా జరిగిందని భావించకూడదు.

> నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే.



గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రను చూసినపుడు కొన్ని సందర్భాలలో ఏదో ఒక శిబిరం వైపు మొగ్గుచూపినట్లు కనిపించినా, ఆమేరకు కొన్ని చర్యలున్నా భారత పాలకవర్గాలు అలీన విధానం పాటిస్తూ అటు సోషలిస్టు శిబిరం, ఇటు పెట్టుబడిదారీ కూటమి నుంచి కూడా లబ్ధిపొందేందుకు చూడటం తెలిసిందే. ఉదాహరణకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా మనలను తన వైపు లాగేందుకు చూస్తున్నది. దానిలో భాగంగానే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన కూటమి, క్వాడ్ (చతుష్టయం)లో భారత్‌ను కూడా చేర్చుకున్నారు. అయితే 2020లో గాల్వన్ సరిహద్దు ఘర్షణ తరువాత చైనాతో శాశ్వత శత్రుత్వంలో ఉంటుందనుకున్నవారి ఆశలు ఫలించలేదు. చైనా నుంచి దిగుమతుల అంశంలో నరేంద్రమోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టారు. పెట్టుబడులను అడ్డుకొనేందుకు చూసినా తాజాగా విద్యుత్ వాహనాల రంగంలో చైనా పెట్టుబడులను కూడా అనుమతించేందుకు వైఖరిని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇది మన కార్పొరేట్ల ప్రయోజనాల కోసమని వేరే చెప్పనవసరం లేదు. ఇదే విధంగా ఉక్రెయిన్ సంక్షోభంలో తటస్థంగా ఉన్నప్పటికీ పశ్చిమ దేశాల ఆంక్షలు, బెదిరింపులను ఖాతరు చేయకుండా రష్యా నుంచి చౌకధరలకు మనదేశం చమురు కొని పరోక్షంగా రష్యాను ఆర్థికంగా ఆదుకున్నది. దీన్ని పశ్చిమ దేశాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. మన కార్పొరేట్లు రష్యా చమురు ఉత్పత్తులను చౌకధరలకు ఐరోపా దేశాలకు విక్రయించి లబ్ధిపొందుతున్నాయి.

అమెరికాతో వ్యూహాత్మకంగా, రష్యాతో రక్షణ భాగస్వామిగా సంబంధాలు కలిగిన ఏకైక దేశం మనదేశమే. అంతర్జాతీయ రాజకీయాల్లో అటు అమెరికా, ఇటు రష్యా తమవైపు తిప్పుకొనేందుకు రెండూ ప్రయత్నిస్తున్నాయి. కొన్ని అంశాల్లో గత యుపిఏ, ప్రస్తుత మోడీ సర్కార్ అమెరికాతో అంటకాగేందుకు కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దాని ఒత్తిడికి లొంగటం లేదు. ఉక్రెయిన్ సంక్షోభంలో తమవైపునకు రానందుకు మన మీద అమెరికాకు పీకల దాకా కోపం ఉన్నప్పటికీ కొన్ని అంశాలలో తనకు అనుకూలంగా ఉన్నందున అది బయటపడకుండా తమాయించుకుంటున్నది. ఎక్కడ రష్యా వైపు మొగ్గుతామోనన్న భయంతో లేదా ఇతర కారణాలతో గానీ ఉక్రెయిన్ సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల విషయంలో ఐరాస నిబంధనలకు భారత్ కట్టుబడి ఉండాలని మోడీ రష్యా పర్యటన సందర్భంగా అమెరికా బహిరంగంగానే వినతి పూర్వక హెచ్చరిక చేసింది. రష్యాతో సంబంధాలపై తమకున్న ఆందోళనలతో సహా అనేక అంశాలపై ఎలాంటి శషభిషలు లేకుండా భారత్‌తో చర్చించినట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. రష్యాతో వ్యవహరించే ఏదేశానికైనా తాము ఇదే చెబుతామన్నాడు.

నాటో కూటమి 75వ సమావేశాలు వాషింగ్టన్‌లో జరుగుతున్న తరుణంలో మూడవసారి అధికారానికి వచ్చిన నరేంద్ర మోడీ తన తొలి విదేశీ పర్యటనకు రష్యాను ఎంచుకోవటాన్ని పశ్చిమదేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. భారత్-రష్యా-చైనా సంబంధాలను దెబ్బతీసేందుకు తంపులు పెట్టాలని చూస్తోందని, అమెరికా, ఇతర పశ్చిమదేశాల వలలో పడొద్దని చైనా సూచిస్తోంది. ఉక్రెయిన్ సమస్య నాటో విస్తరణతో లింకు అయి ఉందన్న విషయం గమనంలో పెట్టుకుని, రష్యా-ఉక్రెయిన్ సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం సబబే. అంతమాత్రం చేత రష్యా నుండి మన దేశానికి అవసరమైన ఒప్పందాలు చేసుకోవడాన్ని తప్పుపట్టలేము.

'నీరో' రాజ్యంలో మణిపూర్



(**సమయం:** జూలై 1, అర్థరాత్రి 11.49 గంటలు.
స్థలం: లోక్‌సభ, ఢిల్లీ.
ప్రసంగిస్తున్నది : ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్: మిస్టర్ చైర్‌పర్సన్ సర్, ఇప్పుడు సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు... (అంతరాయం) భారతదేశ చరిత్రలో కష్ట కాలాన్ని గురించి మాట్లాడేటందుకు- ఇలా గతంలో ఎప్పుడూ జరిగి ఉండలేదు - దానిని మణిపూర్ విషాదం అని పిలవ్వచ్చు, నేను ప్రసంగించడానికి లేవగానే ప్రభుత్వం నా నోరు నొక్కేందుకు చూస్తున్నది...(అంతరాయం) ఇంతటి ప్రాముఖ్యంవున్న విషయాన్ని నిశ్శబ్దంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, అర్థరాత్రి సమీపిస్తుండగా దానిపై ప్రసంగించేందుకు అవకాశం రావడం ఒక ఎగతాళి. నా స్వరాష్ట్రంలోని ప్రజలు ఢిల్లీలో ఉన్న కాలం కంటే రెండు గంటలు ముందు ఉంటారన్న విషయం గుర్తుకొస్తున్నది.

ఢిల్లీ పాటకు మేము డాన్స్ చేస్తున్నాము, సమయం ఇప్పుడు (రాత్రి) 12 గంటలకు దగ్గరగా వుంది..

జాహ్ను బారువా, అతని లాంటి ఇతరులు ఎన్నో ఏళ్లుగా ఈశాన్యానికి ప్రత్యేకమైన టైమ్‌జోన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే, అప్పుడు మాత్రమే మేము గౌరవంగాను, క్షేమంగానూ ఉండగలం. అయితే, నేను మాట్లాడటానికి అవకాశం ఉన్నదని గ్రహించగలగటమే ఈ క్షణాన నాకున్న ప్రాధాన్యత.

మిస్టర్ చైర్మన్, రాష్ట్రపతి ప్రసంగంలో మణిపూర్ లేదన్న విషయం మీ దృష్టికి తెస్తున్నాను. ఇదేదో పొరపాటున తప్పిపోవటం కాదు. ప్రజలను మినహాయించే జాతీయ స్వఅహాతో ఇది జరిగిందని గుర్తు చేస్తున్నాను. గతేడాది కాలంగా దుర్భరమైన పరిస్థితుల్లో 60 వేల మంది ప్రజలు దైన్య, దీన స్థితిలో ఉన్నారని మీరు తెలుసుకోవాలి. నేను ఒక పరిశోధన అంశానికి సహాయపడుతుండే వాడిని. 1947 విభజన సమయంలో బతికి బట్టకట్టిన 1500 మందిని మేము ఇంటర్వ్యూ చేశాం. అటువంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు ఇక్కడ బతుకుతున్నారని మేము చూశాము. వాటిని అన్ని నేను ఇక్కడ పేర్కొనలేను. సర్, 60 వేల మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు అంటే అది తేలికగా తీసుకునే విషయం కాదు. 200 మందికి పైగా చనిపోయారు. అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. తమ గ్రామాల రక్షణ కోసం ప్రజల ఆయుధాలు పట్టుకొని తిరుగుతున్నారు, ఒకరితో ఒకరు పోట్లాడుకుంటున్నారు. గతేడాదిగా ఉన్న ఈ విషాదానికి భారత రాజ్యం మౌన ప్రేక్షకుడిలాగా వుంటున్నది.

> మణిపూర్‌లోని ప్రతి సెంటిమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి?ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.

మణిపూర్‌లోని ప్రతి సెంటిమీటర్‌లో సాయుధ బలగాలు కేంద్ర మోహరించి ఉన్నాయని ఈ సభకు గుర్తు చేస్తున్నాను. దేశంలో అత్యధిక సైనికీకరణ జరిగిన ప్రాంతాల్లో ఇది ఒకటి. సాయుధ బలగాలే కాక, ఇక్కడ సివిల్ పోలీసులకన్నా, ఎక్కువమంది సాయుధ పోలీసులు ఉన్నారు. ఇంతమంది ఉన్నప్పటికీ, 60 వేల మంది ఎలా నిరాశ్రయులు అయ్యారు? పల్లెలు, ఇండ్లు ఎలా ధ్వంసమయ్యాయి? ఇప్పటికీ ప్రధానమంత్రి మౌనముద్రలో ఉన్నారు. ఆయననోటి నుంచి ఒక్క మాట కూడా రాలేదు. దేశ అధ్యక్షుల వారి ప్రసంగంలో కూడా దీని సంగతి లేదు. ఈ మౌనం మామూలుది కాదని నేనంటాను. వలసపాలన నుంచి వలస అనంతర పాలనకు మధ్య కొనసాగింపు ఇది అని అనేకమంది మేధావులు చెప్పిన విషయం గుర్తు చేస్తున్నది.

ఈరోజు వలసపాలన కాలం నాటి వారసత్వాన్ని వదిలించుకొని కొత్త క్రిమినల్ చట్టాలను తెచ్చుకున్న రోజు. కానీ, అశీష్ నంది చెప్పినట్టు, వలసవాదం అనేది బుద్ధికి సంబంధించింది, ఇది ఒక మానసిక ధోరణి, అదొక దృక్కోణం,ప్రజలను అర్థం చేసుకునే దృష్టి, ప్రపంచం ఏమిటో తెలుసుకునే దృష్టి. సత్యం ఏమిటంటే,19వ రాష్ట్రంగా వున్న (మణిపూర్)రాష్ట్ర విషాదం పట్ల నిర్లక్ష్య ప్రదర్శన కొనసాగిస్తూ, మణిపూర్ రాష్ట్రం స్వదేశీ పౌరులకు ఈ తిరస్కరణ వలన వారికి కలిగిన ఆగ్రహాన్ని ఆవేదాన్ని నడిరాత్రి సమీపిస్తుండగా చెప్పే అవకాశం నాకు కలగటం మహాద్భుతం.

ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరికోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు. ఈ దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రతన్ థియమ్, అరిబామ్ శ్యామ్‌శర్మ దేశానికి ఏమీ కారని కూడా మీరు చెబుతున్నారు... (అంతరాయం) మీకు ఈ రాష్ట్రం పట్ల లేశమంత బాధ వున్నా ఈ సభలో ఈ మౌనం, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేకపోవటం జరిగేది కాదు. దీనిని స్పష్టంగా గుర్తించండి.

గౌ!! చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): దయచేసి మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి?

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్) : దీనిని స్పష్టంగా గుర్తించండి. ఈ రాష్ట్ర ప్రజల జాతీయత,దేశభక్తి పట్ల మీరు సందేహించదలిస్తే, ఈ దేశం కోసం ఈ ప్రజలు పోరాడారని తెలుసుకోండి. ఈ దేశం కోసం ఈ ప్రజలు త్యాగాలు చేశారు. దయచేసి గుర్తుపెట్టుకోండి.

డా.నిశీకాంత్ దూబే (గొడ్డా): సభాపతిజీ, ఇది పొరపాటు మాట. నా పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటంటే... (అంతరాయం) గౌరవనీయులైన సభ్యుడు మేరీకోమ్ పేరు తీసుకొచ్చారు. మేరీ కోమ్‌కి మేము గౌరవం ఇవ్వటం లేదని అంటున్నారు.... (అంతరాయం) ఎంత మాట ఇది. మేరీకోమ్‌ని పార్లమెంటు సభ్యురాలు చేసాము, భారతీయ జనతా పార్టీ ఆమెను ఎంపీ చేసింది...(అంతరాయం) ఏ విధంగా మేము మణిపూర్‌కి గౌరవం ఇవ్వలేదు? మణిపూర్‌కి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఇచ్చాం. నా మామకు మణిపూర్‌లో తుపాకీ గుండు దెబ్బ తగిలింది. అతను సిఆర్‌పిఎఫ్ లో డిఐజి గా ఉండేవారు...(అంతరాయం) ఇతనికి అమరవీరులు అంటే అర్థం తెలియదు. 1956వ సంవత్సరానికి ముందు మణిపూర్‌లో ఆర్మ్‌డ్ పోలీస్ (స్పెషల్ పవర్స్) ఎఎఫ్ఎస్‌పిఏ అమల్లో ఉండేది, ఇంకా 1956 నుంచి ఇప్పటిదాకా...(అంతరాయం) కాంగ్రెస్ వల్ల ఈ పరిస్థితి ఉంది.

> ఈ సభను గట్టిగా ప్రశ్నిస్తున్నాను. భారతదేశ రాష్ట్రాలకు సంబంధించి మీరు మాకు అవసరం లేదని ఈ మూగ సమాచారం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా మణిపూర్ ప్రజలకు చెప్పాలనుకుంటున్నారా? ఆత్మాహుతి బాంబర్‌తో పెనుగులాడిన, అశోక చక్ర అవార్డు గ్రహీత మేజర్ లయిష్ రామ్ మణిపూర్‌వాడు. అతను అశోక్ చక్ర అవార్డు పొందాడు. మీరు అతని రాష్ట్రాన్ని అవమాన పరుస్తున్నారు. శ్రీలంకలో శాంతి దళంలో ఈ దేశం తరపున పని చేస్తూ కర్తవ్య నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మేజర్ ఎన్గంగోమ్ జాయ్ దత్తా వీర చక్ర అవార్డు పొందాడు. మీరు అతన్ని అగౌరవ పరుస్తున్నారు. మేరికోమ్, సరితా కుంజారాణి, మీరాబాయి చాను లాంటి వారిని, మీరు ఈ దేశానికి అవసరం లేదని, మీ రాష్ట్రం మాకు అవసరం లేదని చెప్తున్నారు.

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): నీవు మణిపూర్‌ని మినహాయిస్తున్నావు. దానిని కాదనగలవా?... (అంతరాయం) 75 ఏళ్ల తర్వాతి ఈశాన్య చరిత్రను గురించి మేము మాట్లాడుతున్నాం. మీరు చేస్తున్నది శుద్ధ మినహాయింపు. వలసవాద శక్తుల దృష్టిలో భారతదేశం చరిత్రకు సంబంధించిన విషయం కాదు, మానవ సంబంధిత విషయం... (అంతరాయం) ఈరోజు భారతదేశ చరిత్రకు సంబంధించిన పాఠ్య పుస్తకాలలో ఈశాన్యం చరిత్రకు వెలుపల ఉంది. అందువల్లనే మీరు వారిని ఇతరులుగా చూస్తున్నారు. ఆ మౌనం, ఏపూరి విషాదం మీద నెలకొన్న నిశ్శబ్దం విశేషమైనది కాదు. వలస పాలనా కాలం తర్వాత సాధారణ కొనసాగింపునకు ప్రతిరూపం ఇది...(అంతరాయం)

గౌ. చైర్ పర్సన్ (శ్రీకృష్ణ ప్రసాద్ తెన్నేటి): సర్, మీ పాయింట్‌ను తెలియజేశారు.(అంతరాయం)

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్ (ఇన్నర్ మణిపూర్): మణిపూర్ విషాదం పట్ల ఈ మౌనం బీజేపీలాంటి జాతీయ పార్టీకి సౌకర్యవంతంగా ఉందని చూడటం దుఃఖం కలిగిస్తున్నది.... (అంతరాయం) మీ గుండెల మీద చేతులు పెట్టుకుని ఆలోచించండి, 60 వేలమంది ప్రజలు కోణార్క్ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) వారి తల్లుల గురించి ఆలోచించండి, భర్తలు కోల్పోయిన వారిని గురించి ఆలోచించండి, ఆ తర్వాతే జాతీయవాదాన్ని గురించి మాట్లాడండి...(అంతరాయం)

గౌ. చైర్‌పర్సన్: అతను విషయాన్ని చెప్పాడు.

డాక్టర్ అన్‌గోమ్చ బిమోల్ అకోయ్‌జమ్(ఇన్నర్ మణిపూర్): అప్పుడు మాత్రమే ఈ విషాదం అంటే ఏమిటో అర్థం చేసుకోగలం...(అంతరాయం)మిస్టర్ చైర్మన్, బీజేపీ క్యాబినెట్ మంత్రిని ఓడించి, ప్రజాస్వామ్య దేవాలయాల్లో భాగమైన నన్ను ఎవరో అన్నట్టు తోసివేయటం బాధను, కోపాన్ని కలిగిస్తున్నది. నా బాధను ఊహించండి. నా గొంతు నుంచి వచ్చిన ఆవేదనను, బాధను మీరు వినండి. వెనక్కి పరికించి ఆ విషయాలు చూడండి... (అంతరాయం) 60 వేల మంది జనం శరణార్థ శిబిరాల్లో అల్లాడుతున్నారు... (అంతరాయం) దీనిని గెలిచేదాకా (దేశ) విభజన గురించి మాట్లాడవద్దు... (అంతరాయం) ప్రధానమంత్రి నోరు తెరిచి మాట్లాడినప్పుడు, జాతీయవాద పార్టీ మణిపూర్ భారత దేశంలో భాగమని అన్నప్పుడు, మేము ఆ ప్రజల రక్షణ చూస్తామని చెప్పినప్పుడు నేను నిశ్శబ్దంగా ఉంటాను... (అంతరాయం) అప్పుడు మాత్రమే మన దేశం యొక్క జాతీయవాదాన్ని అంగీకరిస్తాను... (అంతరాయం) ఈ మాటలతో నా ప్రసంగం ముగిస్తున్నాను.

- అనువాదం: కర్లపాలెం

సామం!

లోలోపల..
వివేకినన్న భ్రమలున్నప్పుడు
కండ్లు నెత్తిలకెక్కుతయి !

నాల్కె తిమతిమ..
అతి నోటి దురద..
మాటలు కోటలు దాటుతయ్ !
తోపు,సిపాయి పదాలు
పల్లవులై మారుమోగుతయ్ !!



దృష్టి సరిగా లేనప్పుడు
గ్రహణ సంక్లిష్టత సహజం !
నువ్వెంత ఏకాగ్రత పెట్టి
కట్టెల మంట పెట్టినా..
గాలివాటం ఎటుంటదో సెప్పలేం!?

ఒక ఇంటికి
రెండు ప్రవేశద్వారాలున్నప్పుడు
ఒకవైపు తలుపులు మూసేస్తే
రెండోవైపో గొళ్ళెం వుండే ఉంటది!

మీతిమీరిన..
మాటకారితనం వెకిలిప్రక్రియ !
సింప్లిసిటీ..
అగ్ర శిఖరాగ్ర సమానం !!

నిప్పులు..
ఎగదోసుకోవడం ఎంతసేపు!
కలుపుకుపోవడమే
జీవనది అంతిమ పరమార్థం!!

కనీస సహ,ఎరుకలేని
ప్రగల్భ సందర్భాలు
శవాలమీద పేలాల లెక్క !
మనిషిని పురుగులెక్క సూత్తయ్ !!
పరిణతి,పరిగణన పూరకాలు!

తపన,తండ్లాట మంచిదే
పొయ్యి,పొగ,దర్ప శపథాలు..
మాటైనా,సేతైనా..
నవ్వైనా,నడకైనా
నలుగురు నొచ్చుకోవద్దు కదా!

సామం..
సర్వమోద మాధుకరం !
భేదం ఎదలకు భేదం !!

-అశోక్ అవారి,
సెల్: 9000576581

నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

గత లోక్‌సభ చిట్టచివరి సమావేశాల్లో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జులై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బీజేపీ గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు. బీజేపీ పని తీరు పైన విధానాల పైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత కూడా ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కుబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బఅందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు కూడా ఈ కొత్త చట్టాలను గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతో పాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ కూడా ఉనికిలోకి వస్తుంది. ఏమంటే జులై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జులై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జులై ఒకటవ తేదీ ముందు ఎఫ్ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలిన కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు. వాజ్యాలు కూడా చాలా సంక్లిష్టంగా మారి పోతాయి.



PEOPLE'S DEMOCRACY

> ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది.

మరో యాభై ఏళ్ల అస్పష్టత

చట్టాలకు సుప్రీంకోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సిఆర్‌పిసికి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్తచట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్లు పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ నిందితులు గనక కస్టడీలో వుండేట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారితీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

పోలీసులకు నిరంకుశాధికారాలు

న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ 14రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు/ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతిని దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు/ ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు బలహీనులు న్యాయం పొందే హక్కుకు అత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోంచుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాలపరిమితిని మించి అధికకాలం పాటు రిమాండులో వుంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళ్లు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించేవారుగా పోలీసులు భావించేవాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

124 ఎ మరింత తీవ్రరూపంలో

ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎలో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందుపరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్ఐఎ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పై స్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాప్తు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి కూడా ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

నిలిపేవరకూ పోరాటం

ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీం కోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.

(జులై3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

33,922 మంది వెబ్‌ఆప్షన్ల నమోదు

● ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 97,309 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఇప్పటి వరకు 33,922 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ అభ్యర్థులు 16,74,506 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 97,309 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని వివరించారు. ఈ నెల 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందనీ, 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



(మొదటిపేజీ తరువాయి)

అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, వినతిపత్రాలు అందజేశారు.

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేయకముందే మతోన్మాద - కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు బీజేపీ రంగంలోకి దిగిందన్నారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యా లకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందని తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపీ) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మేయడం, ప్రయివేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే మంచిర్యాల జిల్లా లోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను బహిరంగ వేలం వేస్తున్నారని తెలిపారు. అయితే, కార్మికులకు కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అత్యధిక పెన్షన్ చెల్లింపు, ఓపీఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు



పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీల గురించి ఊసే లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్లతో అనేకసార్లు సమావేశాలు జరిపారు కానీ రాష్ట్ర కార్మిక సంఘాలకు కనీసం అపాయింట్‌మెంట్స్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కార్మిక సంఘాలతో సీఎం సమావేశమై కార్మిక సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బీజేపీ బాటలో పయనిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గుతోందని అన్నారు. ఇటీవల 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసింది కానీ ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదన్నారు. కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, అందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, భూపాల్, జె.మల్లికార్జున్, ఎస్.రమ, పి.జయలక్ష్మి, కె.ఈశ్వర్‌రావు, వి.ఎస్.రావు, టి.వీరారెడ్డి, కళ్యాణం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, ఎ.ముత్యంరావు, బి.మధు, టీరం మల్లేష్, ఎ.జె. రమేష్, ఎం.వెంకటేష్, కె.గోపాలస్వామి, రాగుల రమేష్, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల్లో..

నల్లగొండ జిల్లా కేంద్రంలోని భాస్కర్ టాకీస్ అడ్డా ప్రదేశంలో కార్మికులు, ఐసీడీఎస్ ఆఫీసు ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ బాసిత్‌కు వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాతో కార్మికులు నిరసన తెలిపారు. తిప్పర్తి మండలంలో కార్మికులు మార్కెట్ యార్డ్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా, అనంతరం ఆర్డీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్, ఇతర రంగాల కార్మికులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మెదక్, సిద్దిపేట పట్టణాల్లో ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశాలు, వివిధ రంగాల కార్మికులు కలెక్టరేట్, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మున్సిపల్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏఎల్‌ఓ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గద్వాల జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఖమ్మం కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, అక్రమ ప్రమోషన్లు నిలుపుదల చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరుతూ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గేటు ముందు బైటాయించి కమిషనర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. అనంతరం ఆందోళన వద్దకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ వచ్చి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఏన్కూర్ పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సీఐటీయూ నాయకులు శ్రామిక భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో కార్మికులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. హుజూరాబాద్ పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ధర్నా చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ ధర్నాలు జరిగాయి.

ఎ. పద్మనాభన్ మృతికి ఏఐఎడబ్ల్యూయూ సంతాపం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ రాష్ట్ర వ్యవసాయ కార్మికుల ఉద్యమ వ్యవస్థాపక నాయకులలో ఒకరు ఎ.పద్మనాభన్ మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఎడబ్ల్యూయూ) తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఏఐఎడబ్ల్యూయూ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి. వెంకట్ ప్రకటన విడుదల చేశారు. "జనరల్ కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఎ. పద్మనాభన్ సభ్యుడు. కేంద్ర కార్యవర్గ సభ్యుడుగా ఉన్నారు. ఆయన కేరళలోని కేఎస్ కేటీయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కూడా ఉన్నారు. కనీస వేతనాలు, నిర్ణీత పని గంటలు, కార్మికుల హక్కులు, వరి పొలాల రక్షణ కోసం అనేక ఉద్యమాల్లో అగ్రగామిగా నిలిచారు. ఆయన ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలయ్యారు. భూస్వాములు, పోలీసుల నుంచి భౌతిక దాడికి గురయ్యారు" అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, తోటి సహచరులకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

సాగుదారులకే భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడైంది. రైతుభరోసా'పై ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృత సమావేశం ఖమ్మం ఐడీవోసీలో బుధవారం నిర్వహించారు. రైతుభరోసా' క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్, ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మూడు గంటలపాటు కొనసాగింది. వందలాది మంది రైతులు, రైతుసంఘాల నేతలు, రైతు ప్రతినిధులు, లాయర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, వివిధ వర్గాలకు చెందిన అనేక మంది ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సాగుదారులందరికీ 'భరోసా' ఇవ్వాలి

ఎవరైతే సేద్యం చేస్తున్నారో.. ఎంత మొత్తం సాగు చేస్తున్నారో.. అన్ని ఎకరాలకూ 'రైతుభరోసా' పంట పెట్టుబడి సహాయం అందించాలని మెజార్టీ రైతులు, రైతుసంఘాల నేతలు తదితరులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2011లో కౌలుదారీ చట్టాన్ని అమలు చేశారని, దాన్ని యథాతథంగా అమలు చేయాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు కోరారు. ఆ తర్వాత పది ఎకరాలకు కటాఫ్ విధిస్తే మంచిదని మెజార్టీ రైతులు అభిప్రాయపడ్డారు. ఇవేవీ లేకుండా పంట ఉత్పత్తులపై బోనస్, గతంలో లాగా మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు ప్రోత్సాహకంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్ ఇరిగేషన్, పైపులైన్లు, వ్యవసాయ యంత్ర పరికరాలకు సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతుభరోసా, రైతుబీమాతో పాటు పంటనష్ట పరిహారం కూడా చెల్లించాలని కొందరు అడిగారు.

కౌలుదారులకు ఎలా చెల్లించాలి : భట్టి

కౌలు రైతులకు ఎలా చెల్లించాలని మల్లు భట్టివిక్రమార్క రైతులను ప్రశ్నించారు. 2011 కౌలుదారీ చట్టాన్ని ఆచరణలో పెడితే ఇది సాధ్యమని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు సూచించారు. కౌలుదారునికి పంటలపై బోనస్ ఇవ్వాలని కొందరు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు సహాయం చేయాలని మరికొందరు వివరించారు. ఏడాది కాలపరిమితితో కౌలు రాయించుకునే విధానాన్ని అమలు చేయాలని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

ఆంధ్రా రైతులకు ఇక్కడ ఇవ్వొద్దు..

ఆంధ్రా రైతులకు తెలంగాణలో భూములుంటే రైతుభరోసా' ఇస్తున్నారని, తెలంగాణ రైతులకు ఆంధ్రాలో ఉంటే మాత్రం ఎలాంటి సహాయం అక్కడి ప్రభుత్వాలు ఇవ్వట్లేదని గుర్తుచేశారు. కాబట్టి ఆంధ్రా రైతులకు ఇచ్చే పెట్టుబడి సహాయాన్ని నిలిపివేయాలని కోరారు. అలాగే రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా కన్వర్షన్ కాకుండా ఉన్న రియల్ ఎస్టేట్ భూములు, ఆర్‌ఎస్‌ఆర్ పెరిగి డబుల్ ఎంట్రీలున్న భూములు, సాగు చేయని ఇతరత్ర భూములకూ రైతుభరోసా కట్ చేయాలని దాదాపు అందరూ అభిప్రాయపడ్డారు.

పూర్తిస్థాయి బడ్జెట్ సమయంలో రైతుభరోసా విధివిధానాలు: భట్టి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి వచ్చిందని భట్టి గుర్తుచేశారు. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి వచ్చే నిధులకు అనుగుణంగా త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. దీనికి ముందే విధివిధానాల రూపకల్పనపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని తాను (భట్టి) కన్వీనర్‌గా, మంత్రులు తుమ్మల, పొంగులేటి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ నాటికి రైతుభరోసా విధివిధానాల రూపకల్పనకు ఈ అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు వివరించారు.

ఐటీ పేయర్స్‌కు మాత్రమే 'భరోసా' ఉండదు: మంత్రి తుమ్మల

ఐటీ రిటర్న్స్, రేషన్‌కార్డు లేనివారికి రైతుభరోసా ఇవ్వరనే చర్చ నేపథ్యంలో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, విదేశాలకు వెళ్లాలన్నా.. ఇండ్ల నిర్మాణ రుణాల కోసం రైతులు ఐటీ రిటర్న్స్ కలిగి ఉంటారని వివరించారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందించారు. ఐటీ పేయర్స్‌కు మాత్రమే భరోసా వర్తించదని సమాధానం ఇచ్చారు. రేషన్‌కార్డుతో నిమిత్తం లేదన్నారు. పేద రైతులకు భరోసా ఇవ్వడానికి ప్రభుత్వం విశాల దృక్పథంతో వ్యవహరిస్తుందని స్పష్టంచేశారు. గతంలో లోపాలు, ఆర్థిక నష్టాలు తలెత్తకుండా చిన్న, సన్నకారు రైతులకు చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు.

ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ ప్రజలదే: మంత్రి పొంగులేటి

రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి వివిధ రూపాల్లో ప్రజలు చెల్లించిందేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా నాలుగు గోడల మధ్య నిర్ణయాలు తీసుకున్నదని, ఎక్కడా ప్రజాభిప్రాయానికి చోటివ్వలేదని విమర్శించారు. ప్రతి పైసాపై లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలోని మిగతా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోనూ ఇదే రకంగా అభిప్రాయం తీసుకుంటామన్నారు. ఎవరికి సాయం చేస్తే రైతులు ఆనందంగా ఉంటారో వివరాలు సేకరించి అమలు చేస్తామన్నారు.

ఈ సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ అధికారులు విజయనిర్మల, బాబూరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సన్నచిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- భాగం హేమంతరావు, రైతుసంఘం నాయకులు

త్వరితగతిన ధరణి పెండింగ్ ఫైల్స్‌ను క్లియర్ చేసి వీలైనంత ఎక్కువ మంది సాగుదారులకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే లబ్ది చేకూర్చాలి. గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అన్ని సబ్సిడీలు ఎత్తివేసింది. 0శాతం రుణాలను పూర్తిగా తీసి వేశారు. పంటల బీమా పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలి. 25 లక్షలకు పైగా ఉన్న రియల్ ఎస్టేట్ భూములను రైతుభరోసా కింద తొలగించాలి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రకంగానైతే కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారో అదే విధంగా ఇప్పుడు కూడా ఇచ్చి 'భరోసా' కల్పించాలి. ఆర్బీఐ విధానం ప్రకారం 25 ఎకరాలకు పైబడిన రైతులు పెద్ద రైతుల కిందకు వస్తారు. కాబట్టి సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములకు ఇవ్వాలి..

మాదినేని రమేష్, బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పట్టాతో నిమిత్తం లేకుండా సాగు భూములన్నింటికీ, సాగుదారులందరికీ భరోసా, బోనస్ ఇవ్వాలి. 2018 డిసెంబర్ 12కు ముందున్న పంట రుణాలను మాఫీ చేయాలి. గత ప్రభుత్వం మాఫీని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఖమ్మం జిల్లాలో 9వేల మంది, కొత్తగూడెం జిల్లాలో 1600 మంది నష్టపోయారు. కాబట్టి రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి 2023 డిసెంబర్ 9కి ముందున్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరుతున్నాం.

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- శాంతి భద్రతల అదనపు డీజీగా మహేశ్ భగవత్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 15 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకట్రెండ్రోజుల్లో మరికొంత మంది నాన్‌క్యాడర్ ఎస్పీలను బదిలీ చేయటానికి రంగం సిద్ధం చేసింది. ఐపీఎస్‌ల బదిలీలు ఈ విధంగా

పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
మహేశ్ భగవత్	అదనపు డీజీ రైల్వే పోలీస్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు
సంజయ్ కుమార్ జైన్	అదనపు డీజీ రాష్ట్ర శాంతి భద్రతలు	అదనపు డీజీ టీజీఎస్పీ
స్వాతి లక్రా	అదనపు డీజీ టీజీఎస్పీ	అదనపు డీజీ ఆర్గనైజేషన్స్, హెూంగార్డ్స్
స్టీఫెన్ రవీంద్ర	అదనపు డీజీ	అదనపు డీజీ గ్రేహౌండ్స్, ఆక్టోపస్
[illegible]కుమార్	అదనపు డీజీ, గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్	అదనపు డీజీ పర్సనల్, ఫోర్స్ అండ్ వెల్ఫేర్
చంద్రశేఖర్ రెడ్డి	ఐజీ పర్సనల్	ఐజీ మల్టీజోన్-1
సత్యనారాయణ	ఐజీ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్	ఐజీ మల్టీజోన్-2
సుధీర్‌బాబు	ఐజీ మల్టీజోన్	కమిషనర్, రాచకొండ
తరుణ్‌జోషి	కమిషనర్ రాచకొండ	డైరెక్టర్, ఏసీబీ
కె. రమేశ్ నాయుడు	వెయిటింగ్	ఐజీ రైల్వే
రక్షిత కె.మూర్తి	ఎస్పీ వనపర్తి	డీసీపీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్
డి. ఉదయ్ కుమార్‌రెడ్డి	డీసీపీ, సౌత్‌వెస్ట్ జోన్	ఎస్పీ, మెదక్
బి.బాలస్వామి	ఎస్పీ మెదక్	డీసీపీ, ఈస్ట్‌జోన్ సిటీ
ఆర్. గిరిధర్	డీసీపీ, ఈస్ట్‌జోన్	ఎస్పీ, వనపర్తి
జి.చంద్రమోహన్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్	డీసీపీ, సౌత్‌వెస్ట్ సిటీ

రైతులతో నేరుగా మాట్లాడండి

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్న కారణంగా, ప్రస్తుత ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కోరుతున్నారని చెప్పారు. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదన్నారు. జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని సూచించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట రైతుల వాహనాలు, రైతులు వినియోగించుకునేలా మట్టి(గ్రావెల్) రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్‌చౌదరి తెలిపారు. మట్టి రోడ్ల నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని సీఎం అభిప్రాయపడ్డారు.

'సమన్వయంతో ముందుకు సాగండి'

ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీశాఖ భూముల బదలాయింపు సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి అధికారులు తెచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని సీఎం సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలనీ, ఏవైనా సమస్యలుంటే ఎన్‌హెచ్‌ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ - మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అంగీకరించారు.

రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్‌చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన ఇందుకు బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు వి.శేషాద్రి, మాణిక్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు కె.ఎస్ శ్రీనివాసరాజు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, మెదక్, యాదాద్రి భువ నగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయ శంకర్-భూపాలపల్లి, హన్మ కొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు పాల్గొన్నారు.

అది ధృతరాష్ట్ర కౌగిలి !

బీజేపీతో జట్టు కట్టి దారుణంగా దెబ్బతిన్న పార్టీలు

- పరోక్షంగా మద్దతు ఇచ్చిన పార్టీలకూ అదే గతి
- మట్టి కరిచిన మాజీ మిత్రులు
- ఆదుకున్నది ఆ మూడు పార్టీలే

న్యూఢిల్లీ : బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి అన్న నానుడి ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో మరోసారి రుజువైంది. పలు భాగస్వామ్య పక్షాలు కనుమరుగైపోగా, మరికొన్ని ప్రాభవాన్ని కోల్పోయాయి. రాష్ట్రాల్లో బీజేపీని వ్యతిరేకిస్తూ, కేంద్రంలో కొమ్ముకాసిన పార్టీలూ మట్టికరిచాయి. అవసరార్థం చేతులు కలిపిన టీడీపీ, జేడీయూ, ఎల్జేపీ పార్టీలే కమలదళాన్ని ఆదుకున్నాయి. అవి కూడా గతంలో బీజేపీపై కత్తులు నూరినవే. వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లు ఇప్పుడు మోడీ-షా ద్వయానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

2014లో నరేంద్ర మోడీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు బీజేపీకి 24 మిత్రపక్షాలు ఉండేవి. ఆ తర్వాత వాటిలో పలు పార్టీలు ఎన్డీఏతో సంబంధాలు తెంచుకున్నాయి. మోడీ తన అవసరార్థమే పొత్తులు పెట్టుకుంటారని, అవసరం తీరిన తర్వాత కరివేపాకులా వదిలేస్తారని మిత్రపక్షాలు భావించడమే దీనికి కారణం.



మిత్రపక్షాలు అనేక ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి.

నాడు సంకీర్ణ ధర్మాన్ని పాటించారు

అంతకుముందున్న ప్రభుత్వాలన్నీ సంకీర్ణ ధర్మాన్ని పాటించేవి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కొద్దికాలమే అధికారంలో ఉన్నప్పటికీ కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకారం పాలన సాగించింది. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయ కమిటీ ఉండేది. ఆ తర్వాత యూపీఏ కోసం వామపక్ష నేతలు, పి.చిదంబరం కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కూటమికి కూడా సమన్వయ కమిటీ ఉండేది. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ఏర్పడిన తొలి ప్రభుత్వానికి పరిపాలనకు సంబంధించి జాతీయ అజెండా ఉంది. దీనిని జస్వంత్ సింగ్ రూపొందించారు. 1999లో ఈ అజెండాను సవరించారు. సమాఖ్య సామరస్యాన్ని కాపాడతామని, మైనారిటీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని అందులో హామీ ఇచ్చారు. వాజ్‌పేయి రెండోసారి అధికారాన్ని చేపట్టినప్పుడు సమన్వయ కమిటీని ఏర్పాటు చేయలేదు. అయితే తరచూ మిత్రపక్షాలతో సమావేశమై వారి డిమాండ్లపై చర్చించే వారు.

అదే మోడీ తరహా పాలన

2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమన్వయ కమిటీ ఊసే లేదు. భాగస్వామ్య పక్షాలతో కానీ, పార్టీ సహచరులతో కానీ చర్చించిన దాఖలాలూ లేవు. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను ఆయనే నిర్ణయించారు. నిపుణుల కమిటీ రూపొందించిన విధానాలు, కార్యక్రమాలను ప్రభుత్వం తరపున ఆయనే ప్రకటించే వారు. చివరికి అదే ఎన్డీఏ విధానమై పోయింది. భాగస్వామ్య పక్షాలు, చివరికి పార్టీ ఎంపీల మాటకు విలువే లేకుండా పోయింది. వారందరూ మోడీ చెప్పిన దానినే ప్రభుత్వ విధానంగా ఆమోదించే వారు. 2002లో గుజరాత్ మారణహోమం జరిగినప్పటి నుండి ఇదే మోడీ తరహా పాలన అయింది.

ఆయన వైఖరే కారణం

ఎన్డీఏను భాగస్వామ్య పక్షాలు విడిచిపెట్టడానికి మోడీ వైఖరే ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. 2014, 2019లో మిత్రపక్షాల డిమాండ్లను మోడీ పెడచెవిన పెట్టారు. ఆయనకు సభలో పూర్తి మెజారిటీ ఉండడమే దీనికి కారణం. తమ మనుగడే ప్రశ్నార్థకం అవడంతో

బాబు వర్సెస్ షా

స్నేహబంధం చెడిపోయిన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, చంద్రబాబు కొన్ని నెలల పాటు పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. 2019లో షా మాట్లాడుతూ చంద్రబాబుకు ఎన్డీఏ తలుపులను శాశ్వతంగా మూసేశామని చెప్పారు. చంద్రబాబు త్వరలోనే ఎన్డీఏ గూటికి చేరతారని షా అంచనా వేశారు కానీ అది జరగలేదు. షా మాటకు ప్రతిగా చంద్రబాబు 'దక్షిణాదిన ఖాతా తెరిచేందుకు బీజేపీని ఎన్నటికీ అనుమతించం' అని భీషణ ప్రతిజ్ఞ చేశారు. చంద్రబాబు కంటే అతి పెద్ద అవకాశవాది మరొకరు ఉండరని షా ఎద్దేవా చేశారు. ఆయన పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. తన కుమారుడికి పదవులు కట్టబెట్టడం పైనే చంద్రబాబుకు ఆసక్తి ఎక్కువ అని విమర్శించారు. '2014కు ముందు ఈ అమిత్ షా ఎక్కడున్నారు? ఆయన చరిత్ర ఏమిటి? నేను చాలా మాట్లాడగలను. సరైన సమయంలో మాట్లాడతా' అని చంద్రబాబు ప్రతి సమాధానం ఇచ్చారు. ఇలా వారిద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఇప్పుడు ఇరు పక్షాలు మరోసారి చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నాయి.

నాడు మోడీపై చంద్రబాబు విమర్శలు

ఇప్పుడు ఎన్డీఏతో జట్టు కట్టిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు 2018లో ఆ కూటమిని వదిలి పెట్టారు. మిత్రపక్షాలతో సమావేశం కావడానికి కూడా మోడీకి సమయం దొరకడం లేదని అప్పుడు చంద్రబాబు ఆరోపించారు. అంతేకాదు...మోడీ గర్విష్టి అని, నిరంకుశుడని నిందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుండో డిమాండ్ చేస్తోంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది. అప్పుడు చంద్రబాబు ఏమన్నారంటే 'మోడీ మిత్రపక్షాలకు హామీలు ఇస్తారు. ఆ తర్వాత వాటిపై వెనకడుగు వేస్తారు'.

దారుణంగా దెబ్బతిన్నాయి

సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మాదిరిగానే దాని విధేయులైన మిత్రపక్షాలు కూడా ఎదురు దెబ్బలు తిన్నాయి. విశ్లేషణ కోసం బీజేపీ మిత్రపక్షాలను నాలుగు గ్రూపులుగా విభజిద్దాం. మొదటి గ్రూపులో బీజేపీతో సంవత్సరం, అంతకంటే ఎక్కువ కాలం స్నేహం చేసిన ఎన్సీపీ (అజిత్), శివసేన (షిండే), అసోం గణపరిషత్, తమిళనాడులోని మూడు అన్నా డీఎంకే వర్గాలు. ఈ పార్టీలన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి.

ఈ మూడు పార్టీలే ఆదుకున్నాయి

రెండో గ్రూపులో ఉన్న పార్టీలు జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, తెలుగుదేశం. ఈ మూడు పార్టీలు గతంలో ఎన్డీఏ మిత్రపక్షాలే. ఆ తర్వాత వివిధ కారణాలతో ఎన్డీఏకు గుడ్‌బై చెప్పాయి. ఈ మూడు పార్టీలతో ఎన్నికలకు ముందే బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఈ పొత్తు సత్ఫలితాలను ఇచ్చింది. జేడీయూకు 12, టీడీపీకి 16, చిరాగ్ పార్టీకి ఆరు స్థానాలు లభించాయి. ఈ మూడు పార్టీల మద్దతు కారణంగానే బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌ను దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలో కుస్తీ... ఢిల్లీలో దోస్తీ

ఇక మూడో గ్రూపులో వైఎస్సార్‌సీపీ, బిజూ జనతాదళ్, బీఆర్ఎస్ ఉన్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీలు. అవి స్థానికంగా బీజేపీతో పోరాడినప్పటికీ పార్లమెంటులో కీలక సమయాలలో ఆ పార్టీకే కొమ్ము కాశాయి. ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకాశ్మీర్‌కు లభించిన స్వయం ప్రతిపత్తి రద్దు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్ట సవరణలు, పౌరసత్వ సవరణ చట్టం ఓటింగుకు వచ్చినప్పుడు, అవిశ్వాస తీర్మానాల సమయంలో ఎన్డీఏకు మద్దతు తెలిపాయి. నవీన్ పట్నాయక్, జగన్ రెడ్డి, చంద్రశేఖర్ రావు ఏమి ఆశించి ఎన్డీఏకు మద్దతు ఇచ్చారో తెలియడం లేదు. ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు భయపడ్డారా? అధికార పక్షం వైపు ఉంటే సురక్షితమని భావించారా? కారణమేదైనా ఈ మూడు పార్టీలూ ఎన్డీఏకు మద్దతు ఇచ్చాయి. అయితే ఈ మూడింటినీ ఓటర్లు తిరస్కరించడం గమనార్హం. బీఆర్ఎస్, బీజేడీ పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైంది. లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ ప్రతిపక్షం వైపే ఉంటానని పట్నాయక్ ఇప్పుడు చెబుతున్నారు. బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని కార్యకర్తలకు ఆయన ఉద్బోధించారు.

ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లతో తలనొప్పులు

ఇప్పుడు మళ్లీ చంద్రబాబు దగ్గరకు వద్దాం. ఆయన చాంతాండంత డిమాండ్ల చిట్టా పట్టుకొని రాజధానికి వచ్చారు. ప్రధానిని, మంత్రులను కలిసి విజ్ఞాపనలు అందించారు. ముఖ్యంగా ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇవే రకమైన డిమాండ్లు వస్తున్నాయి. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జేడీయూ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. జేడీయూ డిమాండ్‌కు చిరాగ్ కూడా మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పాలనలోని కర్నాటక, వామపక్షాల ఏలుబడిలో ఉన్న కేరళ కూడా ప్రత్యేక ప్యాకేజీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. 2020 నుండే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ప్రత్యేక ప్యాకేజీని కోరుతున్నాయి. మోడీ-షా ద్వయానికి ఇప్పుడు ఈ ప్రత్యేక ప్యాకేజీ డిమాండే తలనెప్పి తెచ్చి పెడుతోంది.

ఈ పార్టీలూ మట్టి కరిచాయి

ఇక్కడ నాలుగో కేటగిరీ గురించి చెప్పుకుందాం. ఒకప్పుడు బలమైన అనుయాయులుగా ఉండి, ఆ తర్వాత అప్పుడప్పుడు మద్దతు ఇచ్చిన వారు ఈ కేటగిరీ కిందికి వస్తారు. 1996 నుండి శిరోమణి అకాలీదళ్ పార్టీ బీజేపీకి మిత్రపక్షంగా ఉంటోంది. 24 సంవత్సరాల పాటు బీజేపీకి మద్దతు ఇచ్చిన ఆ పార్టీ 2020 సెప్టెంబరులో రైతుల ఆందోళన నేపథ్యంలో దోస్తీ కటీఫ్ చెప్పింది. కానీ అప్పటికే ఆలస్యమైంది. బీజేపీతో సుదీర్ఘ కాలం చెలిమి చేయడంతో ఆ పార్టీ స్థానాన్ని వేరే పార్టీలు ఆక్రమించాయి. ఇప్పుడు వంద సంవత్సరాల నాటి ఆ పురాతన పార్టీ అంతర్గత కుమ్ములాటలతో విలవిలలాడుతోంది. తమిళనాట అన్నా డీఎంకే పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ పార్టీ చాలా కాలం పాటు బీజేపీ మిత్రపక్షంగా ఉంది. మోడీ అవలంబించిన విభజన రాజకీయాలు అన్నా డీఎంకే పునాదిని కదిలించాయి. ఈ పార్టీలోని కొన్ని చిన్న చిన్న గ్రూపులు ఇప్పటికీ బీజేపీకి మద్దతు ఇస్తుండగా ఎడపాడి పళనిస్వామి నేతృత్వంలోని బలమైన గ్రూపు గత సెప్టెంబరులో కమలదళంతో సంబంధాలు తెంచుకుంది. జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటు కోసం మహబూబా ముఫ్తి నేతృత్వంలోని పీడీపీ కమలదళంతో పొత్తు పెట్టుకుంది. కానీ అది ఎంతో కాలం సాగలేదు. 2018 జూన్‌లో ఆ సంకీర్ణానికి తెర పడింది.

సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ పూర్తిగా కనుమరుగు కావడానికి వేరే కారణాలు ఉన్నాయి. ఈడీ, సీబీఐ భయంతో ప్రతిపక్షాల ఓట్లు చీల్చి, బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు బీఎస్పీ అధినేత్రి మాయావతి అభ్యర్థులను నిలిపారు. ఫలితంగా ఒకప్పుడు యూపీలో అధికార పార్టీగా ఉన్న బీఎస్పీ 2.04 శాతం ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ పార్టీకి దిగువసభలో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. హర్యానాలో బీజేపీకి చాలా కాలం నుండి మిత్రపక్షంగా ఉన్న దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ పార్టీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది.

అనసూయ కాదు..

ఇక అనుకతిర్ సూర్య

- లింగమార్పిడి చేయించుకున్న సివిల్స్ అధికారి
- ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



తెలంగాణ క్యాడర్‌కు చెందిన సివిల్ సర్వీస్ అధికారి ఎం.అనసూయ తన పేరును ఎం. అనుకతిర్ సూర్యగా మార్చుకున్నారు. లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకున్న తర్వాత తన పేరును అనుకతిర్ సూర్యగా మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం ఎదుట తన అభ్యర్థన ఉంచారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఆమె మిస్ కాకుండా మిస్టర్ కానున్నారు. ప్రస్తుతం అనుకతిర్ సూర్య హైదరాబాద్‌లోని కస్టమ్స్ ఎక్సైజ్‌తో పాటు సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి సర్టిఫికేట్‌లోనూ మిస్ బదులు మిస్టర్‌గా మార్చుకోవాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన ఈ ఐఆర్ఎస్ అధికారి అనుకతిర్ సూర్య చెన్నైలోనే విద్యాభ్యాసం పూర్తి చేశారు. మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. భోపాల్‌లోని నేషనల్ లా ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. ఆ తరువాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సీ అండ్ ఐటీలో తొలిసారి తన వృత్తిలోకి అడుగు పెట్టారు. కెరీర్ ప్రారంభంలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2023లో అనుకతిర్ హైదరాబాద్‌లోని సీఈఎస్‌టీఏటీ (కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్)లో పదవీ బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతానికి అందులోనే కొనసాగుతున్నారు. సివిల్ సర్వీసెస్ అయిన ఆమె లింగమార్పిడి చేయించుకుని కొత్త చరిత్ర సృష్టించారు.


యూరోపియన్ పార్లమెంట్‌లో గణనీయ శక్తిగా

కొత్త మితవాద గ్రూపు

- ఈయూ దిశను ప్రభావితం చేస్తుందంటున్న నిపుణులు

బ్రస్సెల్స్ : యురోపియన్ పార్లమెంట్‌లో కొత్తగా ఏర్పడిన మితవాద పేట్రియాట్స్ ఫర్ యూరప్ అలయన్స్‌కు యురోపియన్ యూనియన్ పంథాను ప్రభావితం చేసేంత సామర్థ్యం వుందని నిపుణులు పేర్కొంటున్నారు. అధికారికంగా సోమవారం ఏర్పడిన ఈ అలయన్స్ 10వ యూరోపియన్ పార్లమెంట్‌లో మూడవ అతిపెద్ద రాజకీయ గ్రూపుగా మారింది. వచ్చే వారం ఈ గ్రూపు మొదటి ప్లీనరీ సమావేశం జరగనుంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా ఉర్సులా వాన్ డెర్ లేయన్ తిరిగి రెండో పదవీ కాలానికి ఎన్నికవుతారా లేదా అనే అంశంపై ఈ సమావేశంలో ఓటింగ్ జరగనుంది. ఈ గ్రూపులో 12 ఇయు సభ్య దేశాల నుండి 84మంది యూరోపియన్ పార్లమెంట్ సభ్యులున్నారు.

బంగారం కోసం వేట..



విక్రమ్

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ చిత్రాన్ని దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా త్వరలోనే వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

'బ్రిటీష్ పాలనా కాలంలో కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో బంగారం కోసం వేట మొదలుపెడతారు బ్రిటీష్ అధికారులు. స్థానిక తెగల వారిని బంగారం వెలికి తీసేందుకు పనిలో పెట్టుకుంటారు. ఒక తెగ నాయకుడిగా విక్రమ్‌ను చూపించారు. ఈ బంగారం వేటలో రెండు తెగల మధ్య పోరు మొదలవుతుంది. తన వారిని కాపాడుకునేందుకు ఎంతటి సాహసానికైనా వెనకడుగు వేయని నాయకుడిగా విక్రమ్ చూపించిన భావోద్వేగాలు ఆకట్టుకుంటున్నాయి. విక్రమ్ ఈ పాత్ర కోసం మారిపోయిన తీరు కూడా ఆశ్చర్యపరుస్తోంది. విక్రమ్ బ్లాక్ పాంథర్‌తో చేసిన ఫైట్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చరిత్రలోని వాస్తవ ఘట్టాలను దర్శకుడు పా రంజిత్ తన సినిమాటిక్ యూనివర్స్‌లో ఆసక్తికరంగా తెరకెక్కించినట్లు ట్రైలర్‌తో తెలుస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు త్వరలోనే ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది అని చిత్ర బృందం తెలిపింది.

పొలిమేర 3



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ హర్రర్ థ్రిల్లర్ 'పొలిమేర 3' అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ చిత్రానికి అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించనున్నారు.

నిర్మాత భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై వంశీ నందిపాటి దీన్ని నిర్మించనున్నారు.

ఈ సిఇనమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియో అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యింది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇందులో సత్యం రాజేష్, బాలాదిత్య కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. 'మా ఊరి పొలిమేర'కి వచ్చిన రెస్పాన్స్‌తో సీక్వెల్‌గా 'పొలిమేర2' రూపొందించారు. ఈ సినిమా సైతం విశేష ఆదరణ పొందడంతో మేకర్స్ 'పొలిమేర 3'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. నిర్మాత ఐ.భరత్

వాస్తవ సంఘటనతో..



రవికృష్ణ, భరత్

స్ట్రాంగ్ కంటెంట్‌తో రాబోతున్న చిత్రం 'ద బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్ల, రాజీవ్‌కనకాల ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో పలువురు నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని బొమ్మ బొరుసా పతాకంపై ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి విస్కి దర్శకుడు.

ఈనెల 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్ విడుదల వేడుక బుధవారం వినూత్నంగా ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ,'యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్ర కథ రాసుకున్నాను. నా జీవితంలో తొమ్మిది సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటనకు కథ రూపం ఇది' అని తెలిపారు. 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లినప్పుడు ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యవసానాలు చాలా ఆసక్తికరంగా వుంటాయి.ఈ సినిమా సహజత్వం కోసం సింక్ సౌండ్ వాడాం. కంటెంట్‌తో పాటు మంచి టెక్నికల్ వాల్యూస్‌తో ఈ చిత్రం ఉండబోతుంది' అని నిర్మాత ఐ.భరత్ చెప్పారు.

నవచిత్రం

క.. భారీ పీరియాడిక్ థ్రిల్లర్



చింతా గోపాలకృష్ణారెడ్డి, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. బుధవారం ఈ సినిమాకు 'క' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ అనౌన్స్ చేశారు. టైటిల్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం మేకోవర్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాను శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దీన్ని రూపొందిస్తున్నారు.

ఈ సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ - సుధీర్ మాచర్ల, సినిమాటోగ్రఫీ - విశ్వాస్ డానియేల్, మ్యూజిక్ - సామ్ సీఎస్, దర్శకత్వం - సుజీత్, సందీప్.

కేస్ నెం.15 రిలీజ్‌కి రెడీ



అజయ్

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కేస్ నెం. 15'. బీజీ వెంచర్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో తడకల వంకర్ రాజేశ్ రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ సందర్భంగా తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ, 'సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. బలమైన కథాంశంతో తెరకెక్కించిన ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. అజయ్‌కి మంచి పేరు వస్తుంది. రవిప్రకాశ్ ఓ డిఫరెంట్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. జాన్ మంచి సంగీతం ఇచ్చారు. సినిమాలో ఉన్న ఒకే ఒక్క పాటకు మంచి స్పందన లభించింది. ఆనం వెంకట్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చారు. ఎక్కడా రాజీపడకుండా నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే విధంగా ఉంటుంది' అని తెలిపారు.

ఆలోచనల నేపథ్యంలో

ఆపరేషన్ రావణ్

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 2న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ వస్తోంది.

ఈ సందర్భంగా బుధవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్ చొల్లేటి మాట్లాడుతూ, 'ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేయడం హ్యాపీగా ఉంది. సినిమా బాగా వచ్చింది' అని తెలిపారు.

'ట్రైలర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నా. ఇందులో నేను టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తా. మీ అందర్ని మెప్పించే సినిమా ఇది' అని హీరోయిన్ సంగీర్త విపిన్ చెప్పారు.

డైరెక్టర్ వెంకట సత్య మాట్లాడుతూ, 'మన ఆలోచనల ప్రభావం వల్లే మనం మంచి వాళ్లా లేక చెడ్డ వాళ్లా అనేది నిర్ణయించడం జరుగుతుంది. ఆ పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాను. ఫస్ట్ టైమ్ ఆలోచనలను విజువల్‌గా తెరపై చూపించబోతున్నా. మా అబ్బాయిని డైరెక్ట్ చేస్తున్నా అనే విషయం నన్ను పెద్దగా ప్రభావితం చేయలేదు. రక్షిత్ బాగా నటించాడు' అని తెలిపారు. 'పలాస' తర్వాత మా ప్రొడక్షన్‌లోనే సైకో థ్రిల్లర్ మూవీ చేద్దామని స్టోరీ లైన్ అనుకున్నాం. అప్పుడు నాన్న ఈ సినిమాకు డైరెక్షన్ చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ సినిమాతో మేం సక్సెస్ అందు కోబోతున్నాం. అని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు.



రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్

ఈ సినిమా ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. హీరో రక్షిత్ వాళ్ళ నాన్న వెంకట సత్య చాలా ప్యాషన్‌తో ఈ సినిమాకి డైరెక్ట్ చేశారని తెలుస్తోంది. 'పలాస' సినిమాతో రక్షిత్‌కి మంచి పేరొచ్చింది. ఈ సినిమాతో మరోసారి రిస్క్ చేస్తున్నారు. రిస్క్ చేసినప్పుడే సక్సెస్ మన దగ్గరికి వస్తుందనేది నా నమ్మకం. ఆ నమ్మకం ఈ సినిమా విషయంలో నిజం కావాలని ఆశిస్తున్నా.

- హీరో విశ్వక్‌సేన్

ప్రతి ఇంటి కథ



రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్ పతాకంపై చల్లపల్లి చలపతి రావు దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'సారంగ దరియా'.

ఈ సినిమాను ఈనెల 12న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు హీరో నవీన్ చంద్ర ముఖ్య అతిథిగా విచ్చేసి బిగ్ టికెట్‌ను కొనుగోలు చేశారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ,' మా డైరెక్టర్ సినిమా గురించి ట్రైలర్‌లోనే మొత్తం చెప్పేశాడు. ఫెయిల్యూర్ అనేది చాలా డేంజర్ అని చూపించాడు. ఈ చిత్రంలో నాకు ముగ్గురు కొడుకులుంటారు. ఒక్కొక్కరికి ఒక్కో సమస్య ఉంటుంది. కాలేజ్ లెక్చరర్‌గా పని చేసి అందరికీ నీతులు చెబుతాను. కానీ నా ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతాను. సోషల్ మీడియా, ప్రస్తుత బిజీ లైఫ్‌లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. కలిసి కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి టైంలో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు' అని అన్నారు.

'మా డైరెక్టర్ పండు వచ్చాకే ఈ సినిమా టీమ్ ఫామ్ అయింది. ఈ చిత్రానికి మహేష్ చాలా కష్టపడ్డాడు. మా మ్యూజిక్ డైరెక్టర్ ఎపి చాలా మంచి సంగీతాన్ని ఇచ్చారు. డీఓపీ సిద్ధు పీసీ శ్రీరామ్ వద్ద పని చేశారు. రాంబాబు, కడలి అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. రాజా రవీంద్ర చాలా సపోర్ట్ చేస్తున్నారు' అని నిర్మాత శరత్ చంద్ర చల్లపల్లి చెప్పారు.

దర్శకుడు పండు మాట్లాడుతూ, 'సమానత్వం అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రాబోతోంది. నన్ను నమ్మి చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చిన నిర్మాతలు శరత్‌కి, ఉమాదేవీకి థ్యాంక్స్. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా ఉంటుంది' అని తెలిపారు. 'నాకు ఈ చిత్రంలో పండు మంచి పాత్రను ఇచ్చారు.

మేనేజర్ అయిన నన్ను మా నిర్మాత ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా మార్చారు. మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని ఎగ్జిక్యూటివ్ నిర్మాత మహేష్ చెప్పారు.



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్ రెడ్డి తండ్రి యాదిరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఆమె వెంట కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు పుట్టగళ్ల జగన్, పేతుళ్ళ ఆనంద్ రెడ్డి, బంగారి అశోక్, మురళీమోహన్, తిరుపతి రెడ్డి, లింగారెడ్డి, కుమార్, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మంత్రి కిషన్‌రెడ్డిని కలసిన కొలన్ శంకర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్ రెడ్డి బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు నర్సింగరావ్, వి.పవన్ కుమార్, హరీష్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఉన్న పలు కాలనీలలో బుధవారం వాదీ ఏ సాలెహిన్ లో కమిషనర్ వాణిరెడ్డి, చైర్మెన్ అబ్దుల్లా సాది, స్థానిక కౌన్సిలర్ శంషోద్దీన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ పర్యటనలో కాలనీలల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారం రోడ్లపై ఉండటంతో మున్సిపాలిటీ అధికారులపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జల్‌పల్లి మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సీఎంను కోరారు. శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న మట్టి చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి వార్డులో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అక్కడి నుంచి వాదీ ఏ సాలెహిన్‌లోని బస్తీ దవాఖానను పరిశీలించి..ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ సీఎం కేసీఆర్ జల్‌పల్లి మున్సిపాలిటీకీ ప్రత్యేక నిధులు కేటాయించారని గుర్తుచేశారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపాలిటికీ కేటాయించిన వంద కోట్ల నిధులను రద్దు చేశారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఎక్కువ శాతం పేద ప్రజలు నివసిస్తారని, ఇప్పటికీ చాలా బస్తీలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ప్రజా పాలన ద్వారా అందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి..అభివృద్ధిలో వెనుక బడి ఉన్న జల్ పల్లి మున్సిపాలిటికీ స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంకా అనేక కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు లేవన్నారు. రోడ్డుపై మురికి నీరు చేరి దుర్వాసనకు పలు కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఏఈ అయేషా, మున్సిపాలిటీ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు షర్ఫుద్దీన్ హమేద్, యంజాల జనార్దన్, కౌన్సిలర్లు ఫమీద అఫ్జల్, శంకర్, ఖాలేదు మారూస్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు మేరాజ్ ఖాన్, అహ్మద్ జాబ్రీ, ఎంఏ హుస్సేన్, సయ్యద్ బదర్, బర్కత్ అలీ, సలీమ్, ఎన్రాన్మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. చైతన్యపురి డివిజన్‌లోని పెయింటర్స్ అడ్డా మీద భవన నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో జూలై 10న కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గడువు ముగిసినా వెల్ఫేర్ బోర్డులో కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ కనీసం వేతనం రూ.26000 నిర్ణయించాలన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 73 షెడ్యూల పరిశ్రమల జీవోలను సవరించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులందరికీ వేతనాలు పెంచాలని కోరారు. ఈ నిరసనలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- ఎల్బీనగర్ / సంతోష్‌నగర్



చంపాపేట్ వార్డు ఆఫీస్ దగ్గర జూలై 10 కార్మికుల డే సందర్భంగా జీహెచ్ఎంసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, నల్ల వెంకయ్యలు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు విభాగంలో పనిచేస్తున్న 60 ఏండ్లు దాటిన వారి స్థానంలో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

సూపర్వైజర్లకు పెట్రోల్ అలవెన్స్ 3000 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ 5 లక్షల రూపాయలు, మరణించిన వారికి 30 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జంగయ్య, యాదమ్మ జయమ్మ, మంజుల, పున్నమ్మ, ఎడ్ల బాలమ్మ దేవమ్మ, మైసమ్మ, సంతోష, స్వరూప, కళావతి, పల్లె హేమలత, గడ్డం పొన్నమ్మ, ఎస్ లక్ష్మి, మేడి అనురాధ, మట్టిపల్లి పుల్లమ్మ, అమృత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్‌నగర్





నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి. చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్యలు డిమాండ్ చేశారు.

జూలై 10న లేబర్ డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్, సంతోష్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద మున్సిపల్ కార్మికుల సమస్యలపై బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.కిషన్, జీహెచ్ఎంసీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.యాదమ్మ, కిష్టమ్మ, లాలమ్మ, లక్ష్మయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్

కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని భవన కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా న్యూ నాగోల్ డివిజన్ మా కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో డివిజన్ కోశాధికారి ఎండి. లతీఫ్ అధ్యక్షతన నాగోలు చౌరస్తాలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. హమాలీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హిట్ రన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ నిరసనలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణ కార్మికులు, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, శంకర్ చంద్రయ్య, సి.కృష్ణ, పి.వెంకటేష్, రహీం, శ్రీను, వెంకటయ్య, రామస్వామి బాలా గౌడ్, హనుమంతు, బాలు, జగన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



• ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ-చైతన్యపురి

ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి..పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మెన్ కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం గోడ పత్రికను బుధవారం కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులు చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేశారు.

అనంతరం కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల భూమిని, పెన్షన్ ఇచ్చే విధంగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, ఉద్యమకారుల బాధ్యత కోదండరాం సారు తీసుకోవాలని అన్నారు. హెల్త్ కార్డులు కూడా అందించాలని కోరారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, ఎల్బీనగర్ టీజేఏసీ చైర్మెన్ కేవి రంగారెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి గుప్త, ఉప్పల శ్రవణ్, బిరెల్లి వెంకట్ రెడ్డి, రమేష్, కృష్ణా గుప్త, శ్రీధర్, ఏ.ఆంజనేయులు గుప్త, శ్యామ్ సుందర్, సువర్ణ చలమరెడ్డి, మాణిక్ రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరీ బాధ్యత



ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

నవతెలంగాణ - సంతోష్‌నగర్

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరీ బాధ్యత అని ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు అన్నారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ బేగంపేట హైదరాబాద్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్, మలక్‌పేట్ వైద్య సిబ్బందికి బుధవారం రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సిగ్నల్ పడినప్పుడు ఆగే ఓపిక కూడా కొందరి వాహనదారులకు లేకుండా పోతుండడం బాధాకరం అని అన్నారు. తొందరగా వెళ్లాలనే ఆత్రమే ఇలాంటి రోడ్డు ప్రమాదాలకు కారణమన్నారు. హైదరాబాద్ పోలీసు పరిధిలో 2023 లో 65,413, 2022లో 42,261 సిగ్నల్ జంపింగ్ కేసులు నమోదైనట్టు తెలిపారు. 2023లో 6173 మంది, 2024లో 3500 మంది డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి టి.టి.ఐ బేగంపేట్ నందు కౌన్సిలింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది వైద్య సిబ్బంది, రిటైర్డ్ డీసీపీ దివ్య చరణ్, గోపాల్ రావు జనరల్ మేనేజర్ ఆఫ్ ఆపరేషన్, హేమ చంద్ర బాబు ఎజిఎం, రాజశేఖర్ ఎల్ అండ్ డి మేనేజర్ పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న 19వ డివిజన్‌లో రానున్న బోనాల పండుగ సందర్భంగా ముందస్తుగా చేపట్టాల్సిన మరమ్మత్తు పనుల్లో భాగంగా ఈదమ్మ, ఎల్లమ్మ దేవాలయాలను, రోడ్లను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం పరిశీలించారు. మేయర్ వెంట డీఈఈ జ్యోతి, కార్పొరేటర్ అమిత శ్రీశైలం చారి, కార్పొరేటర్ పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, ఏఈఈ బిక్కు నాయక్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, కాలనీ వాసులు ఎల్ మనోహర్, గిరి ముదిరాజ్, భాను ప్రసాద్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

'దళితులకే భూములు దక్కేల చూస్తాం'

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్‌లోని దావూద్‌ఖాన్ గూడ సర్వే నెంబర్2లోని దళితుల భూములను దళితులకే దక్కేవిధంగా చూస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 2 దళితుల భూములను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డిలతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను గుడ్ల శ్రీనివాస్ లక్ష్మారెడ్డికి వివరించి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దావూద్ ఖాన్ గూడ సర్వే 02లోని భూమి దళితులకు చెందిన భూమి, ఎంతో కాలంగా దళితులే ఈ భూములను సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొత్త భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మాణం చేయటం జరిగిందని, మిగిలిన భూమిని 300 దళిత కుటుంబాలకు పట్టాలు ఇప్పించి.. వారు ఇండ్లను నిర్మాణం చేసుకోవటానికి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి రూ.5 లక్షల రూపాయలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ భూమిలోకి ఏ అధికారి కూడా రారని అన్నారు. దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టగళ్ల జగన్, గోవర్ధన్ రెడ్డి, గట్టు బాలక్రిష్ణ, అమృత నాయుడు, అనిత, పద్మ అరుణ, శ్రీరాములు, చిత్రం కుటుంబ సభ్యులు రమేష్, ఉమాకాంత్, సురేష్, గుడ్ల రాములు, ముత్యాలు, మహేందర్, ధనరాజ్, యాదయ్య, జంగయ్య, ముత్తయ్య, సుధాకర్, మల్లేష్, మధు, రాజ్ కుమార్, జ్ఞానేశ్వర్, రాజు, బిక్షపమ్మ, అండాలు, విజయ, అనిత గుడ్ల రాధ, అనిత, కుమార్ చిత్రం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చంపాపేట్‌లో మధుసూదన్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ - సంతోష్‌నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘఘాట్ ఓల్డ్ విలేజ్, శుభోదయం కాలనీల నందు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బుధవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ భగత్ సింగ్ యువజన సంఘం నుండి శ్రీ సరస్వతి హై స్కూల్ మీదుగా కర్మన్‌ఘాట్ వైయస్సార్ స్టాచు స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. చంపాపేట్ ప్రధాన రహదారి జామా మసీదు నుండి మోడల్ మార్కెట్ మీదుగా చంపాపేట్ చౌరస్తా వరకు స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. మైత్రి పురం కాలనీ, క్రాంతి నాగర్ కాలనీ, చంపాపేట్ రాజీ రెడ్డి నాగర్ కాలనీ, ఎస్బిఐ కాలనీ వాసులు వర్షపు నీరు నిలిచినప్పుడుల్లా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు ఆగకుండా క్యాచ్ పిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఎస్.ఈ అశోక్ రెడ్డి, ఈఈ కార్తీక్, డీఈ రఫీ, ఏఈ సురేష్, బీజేపీ సీనియర్ నాయకులు సుంకరి రమేష్ గౌడ్, లింగాల దశరథ్ గౌడ్, వేణు గౌడ్, బసంత్, బస్తీ వాసులు కోయిలకొండ సునీల్, హనుమంత్ రెడ్డి, శ్రీశైలం, నరేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ- నాగోల్

తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నాగోలు ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలం కిందట సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో హయత్‌నగర్ మండలం కుంట్లూరు వద్ద ప్రభుత్వ భూమిలో నిరుపేదలంతా గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో వైయస్సార్ నగర్ కాలనీకి చెందిన ఆకునూరు సుదర్శన్ అనే వ్యక్తి కూడా అక్కడ గుడిసెను వేసుకున్నాడు. ప్రతిరోజు రాత్రి వేళలో గుడిసె దగ్గరికి వెళ్లి, అక్కడే పడుకొని ఉదయం ఇంటికి వస్తుండేవాడు. అదే విధంగా మంగళవారం రాత్రి కూడా కుంట్లూర్‌లోని గుడిసె వద్దకు వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వైయస్సార్ నగర్‌లోని తన ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు గుర్తించాడు. మూడు తులాల బంగారు పుస్తెల తాడు, కొంత నగదు దొంగలు దోచుకెళ్ళినట్టు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న నాగోలు ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'నక్షత్ర హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స'



నవతెలంగాణ - చైతన్యపురి/ సిటీబ్యూరో

ఆర్కేపురం డివిజన్ అలకాపురిలోని నక్షత్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో అత్యంత అరుదైన, క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతం చేసినట్టు డాక్టర్ అరుణ్ కానాల తెలిపారు. హాస్పిటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ రామంతపూర్‌కు చెందిన బాల నారాయణ(45) కాలేయ సమస్యతో కొన్ని నెలలుగా బాధపడుతున్నాడని చెప్పారు. చాలా ఆస్పత్రులలో తిరిగి అక్కడ డయాగ్నోస్ కాకపోవడంతో చివరిగా నక్షత్ర హాస్పిటల్‌కు వచ్చినట్టు తెలిపారు. నక్షత్ర హాస్పిటల్స్‌లోని అనుభవజ్ఞులైన వైద్య బృందం అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులను ఉపయోగించి, బిలియో-ప్లూరల్ క్యూటేనియస్ ఫిస్టులా, ఎంఫైమా గా డయాగ్నోస్ చేసి దీనికి ఒక క్లిష్టమైన శాస్త్ర చికిత్స చేయాలని సూచించినట్టు తెలిపారు. ఈ క్లిష్టమైన సర్జరీకి పేషంట్ కుటుంబీకులు అంగీకరించడంతో డాక్టర్లు అరుణ్ కానాల (థోరాసిక్/లంగ్- సర్జన్), ప్రవీణ్ ధీరవత్ (జనరల్ సర్జన్), సుధాకర్ (అనస్తీషియా) పాల్గొని థోరాకోటమీ, ఊపిరితిత్తుల డెకార్టికేషన్, ఫిస్టులెక్టమీ, డయాఫ్రగ్మాటిక్ రిపేర్, థోరాసిక్ లావేజ్, ఐ.సి.డీ ఇన్సర్షన్‌తో శాస్త్ర చికిత్సను విజయవంతం చేశారని వివరించారు. ఈ శస్త్రచికిత్సకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. కానీ నక్షత్ర హాస్పిటల్‌లో కేవలం రూ.2.5 లక్షలతో పూర్తి చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నక్షత్ర హాస్పిటల్స్ నూతన మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, సీఏఓ డాక్టర్ చంద్ర ప్రకాష్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్ బాషా, నర్సింగ్ సూపరింటెండెంట్ నవ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

నవతెలంగాణ - హయత్‌నగర్

బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ బ్రహణ సేవా సంఘ సమైక్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ బుధవారం డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాన్ని, బ్రాహ్మణులపై పరుష పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బ్రాహ్మణులు వేశ్యలకు పుట్టిన వారు అని దూషించడం జరిగిందని ఆరోపించారు. ఈ మాటలకు బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులను రెచ్చగొడుతున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన దాసు పైలా పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యనిర్వాహ కార్యదర్శి జయ తులసి, హైదరాబాద్ ఉపాధ్యక్షులు బనిగిరి నాగరాజ్, కోశాధికారి రఘు నందన్, కార్యవర్గ సభ్యులు రమణారావు, నెప్పాలి శశి పాల్గొన్నారు.



పార్కులను దశల వారీగా అభివృద్ధి చేస్తాం

• ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

నియోజకవర్గ పరిధిలోని పార్కులను దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పలు కాలనీల యందు పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీచర్స్ కాలనీ ఫేస్ 1 నార్త్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం, టీచర్స్ కాలనీ ఫేస్ 2లో వాకింగ్ ట్రాక్, పార్క్ సుందరీకరణకు శంకుస్థాపన, బీఎన్‌రెడ్డి నగర్ కాలనీలో పార్క్ సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పార్కులను దశల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ప్లే గ్రౌండ్స్ మరెక్కడా లేవని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్లే గ్రౌండ్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, మాధవరం నర్సింగ్ రావు, సామ బుచ్చిరెడ్డి, నక్క వెంకట్ స్వామియాదవ్, ప్రభాకర్ రెడ్డి, గడ్డం మల్లేష్ గౌడ్, రాఘవేంద్రరావు, మనోజ్, రాంబాబు, శివముదిరాజ్, భూపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-కాప్రా

బాబానగర్‌లోని రెడ్డి శ్మశాన వాటిక పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇదివరకే రూ.15 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశామని, మిగతా పనుల పూర్తి చేయడానికి మరో రూ. 30లక్షలు మంజూరు చేయాలని కోరారు. భవానీ నగర్ కమ్యూనిటీ హాల్‌పై అదనపు అంతస్తు నిర్మాణం కోసం రూ.17లక్షలు మంజూరు చేయాలని, భవాని నగర్ స్ట్రీట్ నెంబర్ 5లో ఉన్న ఖాళీ స్థలంలో మహిళా భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

మీ సేవ కేంద్రాన్ని లాక్ చేసిన తహశీల్దార్



నవతెలంగాణ-జవహర్ నగర్

ఆధార్ కార్డు కోసం రూ.10వేలు వసూలు చేస్తున్నారంటూ పలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కాప్రా తహశీల్దార్ సుచరిత మీ సేవ కేంద్రాన్ని బుధవారం లాక్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జవహర్ నగర్‌లోని ఎస్ఎల్ఎంఎస్ మీ సేవ కేంద్రంలో జరిగిన అవకతవకల పూర్తిస్థాయి నివేదికను మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు పంపించామని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మీ సేవ కేంద్రాన్ని లాక్ చేశామని, కలెక్టర్ కార్యాలయం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చాక పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ మున్సిపల్ గ్రౌండ్‌లో, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, అమరేంద్ర బాబు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రంగసాయి, చారి, కరుణాకర్, నాయకులు, గుమ్మడి జంపాల్ రెడ్డి, చారి, బాలరాజు, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్, అన్నపూర్ణ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణాన్ని దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధు ముదిరాజ్, వాసుచారి, భీష్మాచారి, మంజుల, రామాంజనేయులు, నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, కుమార్, కృష్ణ, సత్తయ్య, రాంరెడ్డి, కృష్ణారావు, బోనాల శ్రీనివాస్, బోనాల మోహన్ రావు, మల్లేశ్ గౌడ్, ప్రసాద్, శంకరయ్య గౌడ్, యూసఫ్, మహిళలు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలపై కరపత్రాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలు పంపిణీ చేసినట్టు కాప్రా మండల ప్రధాన కార్యదర్శి చింతమల్ల ప్రభాకర్ తెలిపారు. ప్రతీ తరగతి గదిలో విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనవిజ్ఞాన వేదిక విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాపు రెడ్డి, ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాద బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలి



- తోటకూర వజ్రేష్‌యాదవ్
- గాయత్రి బ్యాంక్ ఇన్సూరెన్స్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-బోడుప్పల్

జాతీయ బ్యాంకులు కల్పిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రజలందరూ వినియోగించుకుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బ్యాంక్ ఖాతాదారుడు బొంత నవీన్ ప్రమాదవశాత్తు మరణించడంతో మంజూరై ప్రమాద బీమా రూ.1 లక్ష చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు బోడుప్పల్‌లోని గాయత్రి బ్యాంక్ ఆవరణలో అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వల్లవరపు విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, చింతల నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ అన్ని తక్కువ వడ్డీకే బంగారంపై ఋణాలు అందిస్తున్నామని తెలిపారు.అదే విధంగా గూగుల్ పే, అమెజాన్ పే, ఫోన్ పే లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు

రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి పరిధిలోని వినాయక నగర్ 137 డివిజన్ కార్పొరేటర్ రాజ్య లక్ష్మి చొరవతో కాకతీయ నగర్ మెయిన్ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభమ య్యాయి. బుధవారం కాకతీయ నగర్‌లో కొనసాగుతున్న మెయిన్ రోడ్డులో బీటీరోడ్డు ప్యాచ్ వర్క్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కాలనీవాసుల సమస్యలను పరిష్కరించడానికి పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, సాయి సురేష్, గోపాల్, జగదీష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి
- ఆశాలకు నష్టం కల్గించే పరీక్ష విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి
- ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి

నవతెలంగాణ-జవహర్ నగర్

ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మేడ్చల్ జిల్లా ఆశావర్కర్ల యూనియన్ కార్యదర్శి రేవతి కల్యాణి అన్నారు. బుధవారం జవహర్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు డిమాండ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి కల్యాణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో "కోరికల దినం" పాటిస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. పదేండ్లుగా బీజేపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని ప్రయివేటీకరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఆశలు 19 ఏండ్లుగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలకు గ్లోబల్ లీడర్స్ అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. అలాంటి వారిని కొత్తగా ఎగ్జామ్ రాసి పరిజ్ఞానాన్ని నిరూపించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం అన్యాయమన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆశాలు 16 రోజులు నిరవధిక సమ్మె చేశారని, సమ్మె సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని వేస్తామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు రాధా, శిల్ప, జ్యోతి, స్వరూప, సువర్ణ, వసంత, రాణి, మెర్రీ, మాధవి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కీసరలో..



ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.కార్యదర్శి ఎం. రేవతి అన్నారు. బుధవారం కీసర ప్రైమరీ హెల్త్ సెంటర్ దగ్గర ఆశా వర్కర్లు డిమాండ్ డే సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, సునీత మంగ రాధ జయప్రద, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో..



కోరికల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ మల్కాజిగిరి ఆఫీస్ నుండి జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సుమలత ,వసంత కోమలత, మంజుల ,సంతోష ,వైజయంతి చంద్రకాంత ,రాధా ,సుజాత తదితరులున్నారు.

ఘట్కేసర్‌లో..



ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్. సబిత డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి దాసు, ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, చంద్రమోహన్, గణేష్ గౌడ్, మల్లేష్, హనుమంతు, మధ్యాహ్న భోజనం యూనియన్ అధ్యక్షులు పుష్ప, కార్యదర్శి శ్రీనివాస్, తదితరులున్నారు.

ఉప్పల్‌లో..



కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఐటీయూ ఉప్పల్ కార్యదర్శి జె వెంకన్న అన్నారు. కోరికల దినోత్సవం సందర్భంగా ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండి గౌస్ వై వెంకటేశ్వర్లు వెంకటస్వామి వెంకటేష్ వెంకటేష్ మధు తదితరులు పాల్గొన్నారు

కాప్రాలో..



అఖిల భారత సీఐటీయూ సంఘం పిలుపు మేరకు జులై 10న డిమాండ్స్ డేను చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు జె. వెంకటేష్, నరసింహ ఆదాం, సంతోష్ మోయిన్ పాషా, ఆర్ . శ్రీనివాస్, ఎస్. శివ,సోమాచారి ,మన్మధరావు, విజయ్ కుమార్ ,నరసింహ యాదగిరి, అరవిందు ,నాగరాజు ,రవీందర్ ,సతీష్ పాల్గొన్నారు.

కుషాయిగూడ ప్రైమరీ ఆస్పత్రిలో



ఎన్ఆర్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్ పెంచాలని : ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కల్యాణి అన్నారు. బుధవారం కుషాయిగూడ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఆశా వర్కర్లతో కలిసి డిమాండ్ డే నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు రాధా, భవాని కవిత సేవత, లలిత, ప్రవీణ ,విజయ ,లహరి, పాల్గొన్నారు.

చెరువులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజవర్గం పరిధిలోని పలు చెరువులపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువుల స్థలాల రక్షణకు, వాటి సుందరీకరణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను పునఃప్రారంభించేందుకు, నూతన అభివృద్ధి పనుల కోసం ప్రపోజల్ తయారు చేసుకోవాలని ఆదేశించారు. పూర్తయిన పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల నుంచి తనకు పూర్తి సమాచారం అందించాలన్నారు. చెరువుల కబ్జాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, వచ్చే వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, గుర్రపు డెక్క తొలగింపు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సీజన్‌లో దోమలతో వచ్చే డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్లలో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున ఫాగింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఈఈ నారాయణ, ఏఈ పృథ్వీ, రెవెన్యూ డిపార్టుమెంట్ మల్కాజిగిరి డిప్యూటీ తహశీల్దార్ అనంతలక్ష్మి, అల్వాల్ డిప్యూటీ తహశీల్దార్ రోజా, ఆర్ఐ శ్రీశైలం, విశ్వనాథ్, సర్వేయర్ లు వెంకటేష్, ప్రశాంత్, హెచ్ఎండీఏ ఏఈ శివారెడ్డి, ఎంటమాలజీ ఏఈ వనజ, ఫీల్డ్ అసిస్టెంట్లు వేణు, నజీర్, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, నేరేడ్‌మెట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ మల్కాజిగిరి కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు రాము యాదవ్, హనుమంత రావు, మధుసూదన్ రెడ్డి, డోలి రమేష్, శ్రీనివాస్ గౌడ్, వంశీ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, ఇబ్రహీం, పవన్, అరుణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలను నాటాలి



నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం రాంపల్లి పరిధిలోని తారక ఎన్‌క్లేవ్ పార్కులో వనమహోత్సవం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, మూడో వార్డు కౌన్సిలర్ గోక కళావతి కాలనీ సభ్యులు పార్కులో నందు మొక్కలను నాటరు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డుకు ఇరువైపులా), పార్కుల స్థలాల్లో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటలన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని సాయిరాం నగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులలో నాణ్యత పాటించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. సాయిరాం కాలనీలో చేపట్టిన పనులను బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రతి సీసీ రోడ్డుకు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మించే సమయం నుంచి పనులు పూర్తయ్యేంతవరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈఈ రాజ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫొటో బాలు, సాయిరాం నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దుర్గాప్రసాద్, సుబ్బారావు, నాగేశ్వరరావు, సాబీర్ పాషా, నరసింహ, రాంబాబు, వేణుగోపాల్ రెడ్డి, మల, రూమి, భవాని, పద్మ, నీతా కుమారి, ప్రమోద, సునీత, తదితరులున్నారు.

పలు కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని నాయక్ నగర్ బంజారా కాలనీ, శ్రీశ్రీనగర్ కాలనీలలో కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అభిషేక్, శానిటేషన్ జవాన్ రామకృష్ణ, నాయక్ నగర్ బంజారా కాలనీ, శ్రీశ్రీనగర్ కాలనీల వాసులు విఠల్ నాయక్, పార్వతీ నాయక్, మధుమతి, చందర్, చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, మల్లారెడ్డి, బాబన్న, సంతోష్ చారి, సురేందర్ రెడ్డి , నరేందర్ గౌడ్, సత్యనారాయణ , తన్నీరు శ్రీహరి, పూర్ణ యాదవ్, సాయి యాదవ్, ఖాన్ , ఆరిఫ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్

నవతెలంగాణ-జవహర్ నగర్

అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని ప్రమాదాలకు నిలయంగా మారిన చెన్నాపురం చౌరస్తాలో బుధవారం మున్సిపల్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మేయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కూతాడి సాయి, మేకల లలిత యాదవ్, చింతల ప్రేమల శ్రీనివాస్, పల్లపు రవి, జమల్పూర్ నవీన్ కుమార్, రాజ్ కుమార్, నాయకులు మనోధర్ రెడ్డి, బింగి సతీష్ గౌడ్, ఉమర్, సింగన్న బాలరాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మకు హాజరైన ఎంపీ ఈటల



నవతెలంగాణ-అల్వాల్

బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గ కోకన్వీనర్ మల్లికార్జున గౌడ్ తండ్రి పిండి కూర జనార్ధన్‌గౌడ్ దశదినకర్మకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, దండుగుల వెంకటేష్, మాణిక్య రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, అజయ్ రెడ్డి, లక్ష్మణ్, వినయ్ కుమార్, అనిల్, రాజు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పెన్షన్ కోసం కార్పొరేటర్ అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

వృద్ధాప్య పెన్షన్స్, ఒంటరి మహిళ పెన్షన్స్, వీడో పెన్షన్, కల్లు గీత కార్మికుల పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్, పీహెచ్‌సీ పెన్షన్స్ కోసం పెన్షన్ అధికారి జోమినితో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సమీక్ష నిర్వహించారు. పెన్షన్ నిరంతర ప్రక్రియ అని 2022 సంవత్సరంలో కొత్త పెన్షన్ మంజూరయ్యాయని తెలిపారు. నాటి నుంచి ఇప్పటి వరకు ఎవరికీ పెన్షన్ సాంక్షన్ కాలేదన్నారు. చర్లపల్లి డివిజన్‌లోని కాలనీల్లో పెన్షన్ కోసం చాలా మంది అప్లై చేసుకున్నారని పేర్కొన్నారు. వారందరికీ పెన్షన్స్ మంజూరు చేయాలని కోరారు. బిల్ కలెక్టర్‌తో ఎంక్వైరీ పూర్తి అయిందని తెలిపారు. పెన్షన్స్ కోసం ఒక ఫొటో, ఇన్కమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్ పాసుబుక్ జిరాక్స్, కంపల్సరీ అప్లికేషన్ ఫామ్‌కు జతపరచాలని సూచించారు. ఆమె వెంట సీతారాం రెడ్డి , మహిళా నాయకురాలు డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



కార్పొరేటర్ సతీష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య గౌడ్

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య గౌడ్‌లు అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో పోచమ్మ గుడి నిర్మాణానికి కాలనీ వాసులు జవహర్ నగర్ పబ్లిక్ హై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, అమ్మవారికి మకరతోరణం కోసం రూ.11,000, అభిషేక్ గౌడ్ రూ.50,000 విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకున్నదని, మిగతా పనులు పూర్తి కావడానికి ఇంకా దాతల సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ చారి, కోశాధికారి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సుశీల బాబు, అడ్వైజర్ శ్రీనివాస్, యాదగిరి, సాయి, రాము, ప్రసాద్ పాల్గొన్నారు.

నాచారంలో హంగర్ రిలీఫ్ ప్రోగ్రాం



నవతెలంగాణ-కాప్రా

నాచారంలోని సాధనా మెంటల్లీ ఛాలెంజ్డ్ ఇన్స్‌స్టిట్యూట్‌లో హంగర్ రిలీఫ్ ప్రోగ్రాంను లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ అధ్యక్షురాలు శ్రీదేవి తన తండ్రి తాతా చారి, భర్త బుల్లి స్వామి జ్ఞాపకార్థం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి లంచ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి, భర్తలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చనమోలు వరప్రసాద్, సభ్యులు రోజీ, ధరణి, విజయకుమార్, కుటుంబ సభ్యులు అరుణ కుమారి, హరిశ్రీ , గోపీశ్రీ, జ్యోతి పాల్గొన్నారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | జూలై 11, 2024 | www.navatelangana.com

పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయం..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాడం అభినందనీయమని సేవ్ ఎ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ) సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణాప్రతాప్ సూరగన అన్నారు. బుధవారం సేవ్ ఎ లైఫ్ (సేఫ్టీ ఫర్ హ్యూమానిటీ) సంస్థ ఆధ్వర్యంలో.. దాతల సహాయంతో కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్ ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం దాతలకు సంస్థ తరపున రాణాప్రతాప్ కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి సత్తయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్తినేని వీరయ్యకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంఘం(టీవీసీసీ) చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముత్తినేని వీరయ్యను బుధవారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఎన్.పి.ఆర్.డి.రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి అడివయ్య, మేడ్చల్ జిల్లా సంయుక్త కార్యదర్శి జంగిటి మల్లేష్, సంఘం నేతలు మలక్ పేటలోని కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వికలాంగులకు చెందాల్సిన సంక్షేమఫలాలు, రాయితీలు, వచ్చే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీపతిరావు, నాగరాజ్, బాలాజీ, రమేష్, సోనిరెడ్డి ఆదర్శ్ జగద్గిరిగుట్ట కమిటీ కార్యదర్శి, సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

130- సుభాష్ నగర్ డివిజన్ పాండు బస్తీలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డితో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలలో నెలకొని ఉన్న నూతన సీసీ రోడ్డు పనుల గురించి, వర్షాకాలంలో నెలకొని ఉంటున్న నీటి ముంపు సమస్యను పరిష్కరించాలని పలువురు బస్తీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేండ్ల కాలంలో సుభాష్ నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో దాదాపు 90 శాతం పనులు పూర్తి చేసామని ఇంకా ఏమైనా పనులు మిగిలిపోతే అతి త్వరలో చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు పందిరి యాదగిరి, యూసుఫ్, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ లోని విద్యుత్ సమస్యలపై టీజీఎస్పీడీసీఎల్ చెర్మెన్‌ను కలిసిన ఎమ్మెల్యే..

టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కుత్బులాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ టీజీఎస్పీడీసీఎల్ (TGSPDCL) సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీ అలీని కలిసి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం అభివృద్ధి పనుల్లో ఆటంకం కలిగిస్తున్న విద్యుత్ మరమ్మత్తు (ఎల్.సి) పనులను త్వరితగతిన పూర్తిచేసి అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లు, ట్రాన్స్ఫర్లు, పోల్స్ సిఫ్టింగ్ తరలింపు కోసం ఎల్‌సి అనుమతులు ఇవ్వాలి. బాచుపల్లి - మల్లం పేట్ - బౌరంపేట్ మార్గంలో చేపడుతున్న హెచ్ఎండిఏ రోడ్డు విస్తరణ పనుల్లో ఆటంకంగా ఉన్న విద్యుత్ పోల్స్, విద్యుత్ వైర్ల తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట్, బాచుపల్లి (తెలుగు యూనివర్సిటీ), మల్లంపేట్ (శంభీపూర్) ప్రాంతాలలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం కేటాయించిన భూముల్లో సబ్ స్టేషన్, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బాచుపల్లి పరిసరాలతో పాటు శంభీపూర్, భౌరంపేట్, ఆటంకం లేని 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు 33 కెవి లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. మల్లంపేట్ (శంభీపూర్) ప్రాంతంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు 33 కెవి లైన్ ఏర్పాటు చేయాలి. దుండిగల్, ఇతర ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉంటున్న లబ్ధిదారులకు నూతన విద్యుత్ కనెక్షన్, నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు చర్యలు చేపట్టాలి. బహదూర్ పల్లి - కొంపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలి. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని టీజీఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ అలీ ఫారుఖీ అలీకి ఎమ్మెల్యే కేపీ వివేకానంద అందజేశారు.



మొహమ్మద్ అహ్మద్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ నగర్ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అహ్మద్‌ను బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరాలు హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. అనంతరం అతని ఆరోగ్య పరిస్థితి వివరాలు డ్యూటీ డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్‌కి తెలియజేసారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, జి.హెచ్.యం.సి. అధికారులతో కలిసి రాక్ గార్డెన్ (సున్నం చెరువు పార్క్) అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. మార్నింగ్ వాకర్స్ మౌలిక వసతులు కల్పించాలని కోరగా.. ఎమ్మెల్యే తక్షణమే అధికారులకు నిధులు మంజూరు చేస్తామని దానికి తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం తులసి నగర్ కాలనీ వాసులతో కలిసి కాలనిలో పర్యటించారు. స్థానికుల వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండు నెలలుగా నీటి ఎద్దడితో బాధపడుతున్నారని, వీధి దీపాలు వెలగడం లేదని, బస్తీలో ఉన్నటువంటి ఆరు ట్రాన్సాఫార్మర్ లకు ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను మార్చాలని, దోమల బెడదా వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారానికో సారైనా ఫాగింగ్ చేయించాలన్నారు. విధుల్లో స్వీపింగ్ సరిగ్గా జరగడం లేదని ప్రతి రోజు స్వీపింగ్ చేయించాలని కోరగా ఎమ్మెల్యే అధికారులకు స్థానికులు కోరిన పనులను సత్వరమే చేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, జీహెచ్ఎంసీ ఈ ఈ సత్యనారాయణ, ఎఈ రంజిత్, జలమండలి డీజీఎం రవి, లైన్ మెన్ మొగులయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ బలరాం, వీర రెడ్డి, పిల్లి తిరుపతి, నాగుల సత్యం, సంజీవ్ రెడ్డి, కొండల్ రెడ్డి, నూర్, జావీదుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ పురంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ. 40 లక్షల వ్యయంతో బస్తీ దవఖాన నిర్మించారు. కమ్యూనిటీ హాల్ భవనాన్ని బుధవారం ఏఈ పవన్‌తో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ పురం నిర్మించిన కమ్యూనిటీ హాల్లో ఉర్దూ, తెలుగు మీడియం ఉండడం వల్ల విద్యార్థులకు చదువుకోడానికి ఇబ్బంది కరంగా ఉండేది. విద్యార్థులకు వెసలు బాటుగా అదనంగా పై ఫ్లోర్ కూడా వేసి ఉర్దూ మీడియం, తెలుగు మీడియంలకు విడివిడిగా క్లాసులు తీసుకునే విధంగా కమ్యూనిటీ హాల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా బస్తీ దవాఖాన కూడా అదే భవనంలో ఉండడం వల్ల బస్సు దవఖానకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. దాదాపు 100 మంది రోగులకు బస్తీ దవఖానలో హెల్త్ చెకప్‌లు, టాబ్లెట్లు కొరకు రావడం జరుగుతుందని దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు వైద్యులు చర్చించారు. అభివృద్ధి విషయంలోనూ, సంక్షేమ విషయంలో గానీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు డివిజన్‌లో ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని ఆయన. ఈ కార్యక్రమంలో గౌస్, షౌకత్, ఇమ్రాన్, సలీం, అన్వర్, కైసర్, హస్మత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూత అభినందనీయం



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద విద్యార్థులకు చేయూతనందించే దిశగా దాతలు ముందుకు రావడం అభినందనీయమని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. బుధవారం గాజులరామారం గ్రామపరిధి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరము పదవ తరగతి విద్యార్థులు(2023-24) అత్యధిక మార్కులు సాధించినటువంటి ముగ్గురు విద్యార్థులకు దాతలు గుంటుపల్లి శ్రీనివాసరావు, గుడివాడ సురేష్, సురేంద్రల ఆధ్వర్యంలో ఒక్కొక్క విద్యార్థికి రూ.5000 లు నగదును కార్పొరేటర్ రావుల శేషగిరి చేతులమీదుగా విద్యార్థులకు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా స్వచ్ఛందసంస్థలు, దాతలు ప్రోత్సహించాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, రావడం పట్ల కృషి చేసిన ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, నాయకులు మురళీకృష్ణ, లక్ష్మణ్, వినయ్ కుమార్, శంకర్, ప్రతాపరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

దేశవ్యాప్తంగా జూలై 10 వ తేది కార్మిక కోరికల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లి సీఐటీయూ మండల కార్యదర్శి కే కృష్ణా నాయక్, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.శంకర్‌లు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ.. కార్మికులకు కనీస హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. కూకట్‌పల్లి పరిధిలోని వివిధ ప్రదేశాల్లో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను లేవనెత్తుతూ.. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం నిలిపివేయాలి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాన్నారు. మున్సిపల్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని, కూలి రేట్లు పెంచాలి, పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి, ఆటో రంగ కార్మికులకు నెలకు 4500 ఇవ్వాలి, తదితర సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బి.రాములు, నరసింహ, సుభాష్, భారతి, జేఎన్‌టీయూ ఆటో స్టాండ్ నుంచి మహేష్ రెడ్డి, ప్రభుదాస్, జమీల్, సుభాష్ రెడ్డి, నరసింహ పాల్గొన్నారు.



బాలానగర్ మండలంలో బాలానగర్ చౌరస్తాలో కార్మికుల కోర్కెల దినం సందర్భంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేస్తుంది అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అన్నారు. ఈ ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా చేసే 4 లేబర్ కోర్డ్‌లను తీసుకువచ్చిందని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికుల ను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నారని, కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి రూ.18వేలు వెంటనే ఇచ్చేలా చట్టం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరణను నిపేలేయాలని, నేషనల్ మనీటైజేషన్ పైప్ లైన్ ను రద్దు చేసి, బొగ్గు బ్లాక్ లను వేలం వేయడాన్ని నిలిపేయాలని అన్నారు. సింగరేణికి నేరుగా గనులు కేటాయించి, అన్ని రంగాల కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,వేలుగా నిర్ణయించాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. ఆశా వర్కర్లకు పరీక్షలు రద్దు చేయాలి అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజనం, ఐకెపి, విఓఏ, వైద్య ఆరోగ్య రంగాలతో పాటు వివిధ స్కీం లలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, చట్టాలు అమలు పరుస్తూ డిమాండ్లు పరిష్కరించాలన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని కేంద్ర బీజేపీని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శంకర్, తాజ్, మల్లేష్, శ్రీనివాస్, వనిత,సబియా, అనిత, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



జులై 10 కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం జీడిమెట్ల పారిశ్రామిక వాడ షాపూర్ నగర్ మెయిన్ రోడ్డు రైతు బజార్ నుంచి సాగర్ హొటల్ వరకు కేంద్ర ఎన్డీఏ బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ , సీఐటీయూ సీనియర్ నాయకులు జి. వెంకన్న, ఈ. దేవదానం పాల్గొని మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం కాలరాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు చేస్తూ కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును కూడా కాలరాస్తున్నా రన్నారు. అన్ని ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి బడా బడా పెట్టుబడిదారులకు చౌకగా కట్టబడుతున్నారని ఆరోపించారు. దేశంలో ఉన్న ఆదాని అంబానీ కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చి దేశంలో ఉన్న అన్ని రకాల అన్ని రంగాల కార్మికుల హక్కులను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కనీస వేతనాలు అమలు చేయకుండా ఈఎస్ఐ, పిఎఫ్. బోనస్. రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి సౌకర్యాల్ని రోజురోజుకు తగ్గించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ నాయకులు వెంకయ్య, ప్రసాద్, కే.శీను, తిమ్మప్ప, కరుణాకర్, దుర్గా నాయక్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



హక్కుల దినోత్సవం సందర్భంగా దుండిగల్ మండలంలో కొంపల్లిలో మున్సిపల్ కార్మికులు ర్యాలీ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా గండిమైసమ్మ చౌరస్తాలో ఆశా వర్కర్స్ రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి మాట్లాడుతూ కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని వయసు మీరిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మికులందరిని సమీకరించి భవిష్యత్తులో భారీ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యం, లక్ష్మయ్య, జగన్, ఎల్లయ్య, బాలమణి, సుశీల,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు హంస, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం స్కీంను రక్షించాలని బుధవారం కూకట్‌పల్లి మండల రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశ వ్యాప్తంగా అన్ని మండల , పట్టణ , జిల్లా కేంద్రాల్లో కోర్కెల దినం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



జులై 10 కార్మికుల హక్కుల దినోత్సవం సందర్భంగా బాచుపల్లిపారిశ్రామిక ప్రాంతంలో నిరసన కార్యక్రమాలు, బాచుపల్లి మండల ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ నరేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సింగరేణి బొగ్గు గనులను సింగరేణి ప్రభుత్వ సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాధత్తం చేసే దానికోసం ఏర్పాటుచేసిన నేషనల్ మానిటైజేషన్ పైపులైను రద్దు చేయాలన్నారు. ఈపీఎఫ్ చెల్లింపులో జాప్యం చేసిన వారికి జరిమానాలను తగ్గించడాన్ని సంహరించుకోవాలన్నారు.హమాలి ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ,హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ ఆశ మధ్యాహ్నం భోజనం ఐకెపి విఏవో వైద్య ఆరోగ్య రంగంతోపాటు వివిధ స్కీములలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లందర్నీ కార్మికులుగా గుర్తించాలని వారికి చట్టాల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ-దుండిగల్

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రయినేజీ పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని కూనమాలక్ష్మీనగర్‌లో దాదాపు రూ.9 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రయినేజీ పనులను అధికారులు, స్థానిక బస్తీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ డివిజన్ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పూర్తి చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్, స్థానిక నాయకులు గుంజా మహంకాళి, రేపన్ గిరిబాబు, ఈ.వెంకటేష్, ఎర్ర లక్ష్మయ్య, విట్టల్ ముదిరాజ్, గంగా సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

బతుకమ్మ కుంట పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని కూనమాలక్ష్మీనగర్, భూదేవి హిల్స్,ఆర్.జి.కే.కాలనీ సంబంధించిన బతుకమ్మ కుంటను సుమారు రూ.20.లక్షల వ్యయంతో చేపట్టిన పనులను సంబంధిత అధికారులు, ఆయా ప్రాంత వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. బతుకమ్మ కుంట పనులు సరిత గతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్ తోపాటు ఆయా ప్రాంతాల వాసులు పాల్గొన్నారు.



'సదాశివ గ్రూప్ ఆఫ్ స్కూల్ నోటుబుక్స్ యూనిఫామ్ దందా'



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ మండల పరిధిలోని ఫిరోజ్ గూడలో సదాశివ గ్రూప్ ఆఫ్ ఇన్స్టూషన్స్‌లో అక్రమంగా పుస్తకాలు, యూనిఫారమ్స్, టై బెల్టులు ఇతర స్టేరియనరీ వస్తులు అమ్ముతునారని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ ఆఫీస్ నుంచి సీఆర్పీ గంగాధర్ రావడంతో బుక్స్, యూనిఫారమ్స్, బెల్ట్, టై ఉన్న రూమ్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.కార్తీక్ మాట్లాడుతూ అక్రమంగా పుస్తకాలు, యూనిఫారమ్స్, బెల్ట్, టై, స్టేషనరీ సమన్లు అముతున సదాశివ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రధానంగా సదాశివ పాఠశాలలో సీబీఎస్ఈ స్కూల్ పర్మిషన్ పేరిట తలితండ్రుల నుంచి వేలాలో ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎంఈఓ ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు సదాశివ పాఠశాలలో అక్రమంగా బుక్స్ అముతున్నారని పేర్కొన్నారు. అలాగే పర్మిషన్ లేకుండా స్కూల్స్ నడుపుతున్నారని చేపడానికి ప్రయత్నిస్తుంటే యాజ మాన్యం ఫోన్ కూడా లేపని పరిస్థితి నెలకొందన్నారు. ఎంఈఓ విధుల్లో ఉంటున్నారో లేకపోతే నామ మాత్రంగా వ్యవరిస్తున్నారో తెలియని పరిస్థితి.. డీఈఓ వెంటనే అక్కడే అందుబాటులో ఉన్న సీఆర్పీ గంగాధర్ పంపించి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తీరుని తీవ్రంగా కండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుబ్బు, అరుణ్, విష్ణు, భూపతి, గౌతమ్, గిరి తదిఇతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలుగా గెలుపొంది.. పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్ఎస్ గుర్తుపై గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆదిత్య నగర్ ఉపాధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురభి రమేష్ రావు మండిపడ్డారు. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు చేయాలంటూ పత్రికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్ల వెంకట్రావు, కాలే యాదయ్య సభ్యత్వాలు రద్దు కావాలి. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం, రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం అని పేర్కొన్నారు. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ... బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని సురభి రమేష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. మరికొందరు బీఆర్ఎస్ తరపున గెలిచిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమ పదవులకు రాజీనామా చేయకుండానే, కాంగ్రెస్‌లో చేరారని అందువల్ల వీరిపై అనర్హులుగా ప్రకటించాలని.. ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చెయ్యాలని సురభి రమేష్ రావు డిమాండ్ చేశారు.

అధికారుల కనుసన్నల్లోనే కబ్జాలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ దుండిగల్ తాండా-2లోని సర్వే నంబర్ 684 ప్రభుత్వ భూమిలోమొదట ఏడు అక్రమ ఇండ్లు నిర్మించిన కబ్జా దారుడు రెవెన్యూ అధికారుల అండదండలు చూసుకొని అక్రమ నిర్మాణాల ను చేపట్టడం జరిగింది. అనేక పిర్యాదుల మేరకు కేవలం 4మాత్రమే అధికూడ పైపై కూల్చివేతలు చేపట్టి మమా అనిపించారు. రెవెన్యూ అధికారుల కనుసన్నలోనే జరుచున్నాయని స్థానికులు సైతం ఆరోపిస్తు న్నారు. అందువల్లనే మిగితా 3 రూమ్‌లపై ఉదాసీనతతో వ్యవహరిస్తున్నా రని తెలుస్తుంది. ఈ అక్రమ నిర్మాణాలపై ఆర్‌డిఓ సైతం చర్యలు తీసు వాలని తెలిపిన అయన మాటలు బేకతారు చేస్తు తహసీల్దార్ మిగితా3 రూమ్‌ల పై చర్యలకు వెనుకడుగు వేసి కబ్జాదారులకు వాత్తాసు పలుకడం శోచనీయం ఇప్పటికైనా పై అధికారులు ఈ భూ కబ్జాలపై విచారించి కబ్జాకు పాల్పడే వారిపై, చర్యలు తీసుకోవాలి. కాపాడవలసిన వారే నిమ్మకునీత్తినట్లు వ్యవహరిస్తే కబ్జాలను కాపాడేవారెవరణి ఆరోపణలు వెళ్ళు విరుస్తున్నాయి..

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధి,మహాదేవ్ పురంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు లలిత హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి కమిటీ సభ్యులు యాదగిరి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ,షుగర్‌తో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సేవ చేసే అవకాశం అందరికి రాదు తన జన్మదినం సందర్భంగా పది మందికి కడుపునిండా భోజనం పెట్టడం ఇష్టమనీ జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. ఇంద్ర నగర్ బీఆర్ఎస్ యువ నాయకులు మనోజ్, వినయ్,వేణు, సోను, అఫ్రోజ్, కలిసి బంజారా హిల్స్ కాన్సర్ హాస్పిటల్ వద్ద అన్నదానం చేసి అనంతరం కేక్ కట్ చేసి మహిళలతో కలిసి కార్యాలయంలో భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బంజారా హిల్స్



ఇంజినీరింగ్ సవాళ్లను పరిష్కరించేందుకు ఎన్‌హెచ్ అధికారులతో సమావేశం



● **మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

నవతెలంగాణ-సిటీబ్యూరో

హెచ్ఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఏఎంఎల్ ఇంజనీరింగ్ బృందం, జనరల్ కన్సల్టెంట్లు (సిస్ట్రా) ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి మియాపూర్-పటాన్‌చెరువు, ఎల్బీనగర్-హయత్‌నగర్ మెట్రో ఫేజ్-2 కారిడార్లను జాతీయ రహదారులపై ఉన్న మైలార్‌దేవ్‌పల్లి-ఆరాంఘర్- కొత్త హైకోర్టు స్పర్‌లైన్లను రెండు రోజులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ రూట్లలో ప్రస్తుతమున్న ఫ్లై ఓవర్లు, కొత్త ఫ్లై ఓవర్ల నిర్మాణం కారణంగా ఇంజినీరింగ్ సవాళ్లను పరిష్కరించేందుకు ఆయన మెట్రో రైలు భవన్‌లో ఎన్‌హెచ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ప్రతిపాదిత అంశాలు ఇవే..

ఎల్బీనగర్-హయత్‌నగర్ మెట్రో ఫేజ్-2 కారిడార్ (సుమారు 7కి.మీ)ను జీహెచ్ఎంసీకి చెందిన ప్రస్తుత రెండు ఫ్లైఓవర్ల మధ్య ఎల్బీనగర్ జంక్షన్ వద్ద ఉన్న మెట్రో వయా డక్ట్‌కు పొడిగింపుగా నిర్మిస్తారు. ఈ కారిడార్ అలైన్‌మెంట్ ఎల్బీనగర్ జంక్షన్ నుంచి ప్రతిపాదిత చింతలకుంట మెట్రో స్టేషన్ వరకు సెంట్రల్ మీడియన్‌లో ఉంటుంది. చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు ఎన్‌హెచ్ అధికారులు నిర్మిస్తున్న నాలుగు కొత్త ఫ్లైఓవర్ల దృష్ట్యా. మెట్రో అలైన్‌మెంట్ ఎడమ వైపు సర్వీస్ రోడ్డులో ఉంటుంది. నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లు, మెట్రో రైల్ పిల్లర్లు, వయాడక్ట్, స్టేషన్‌ల ఇంజనీరింగ్ డ్రాయింగ్‌లు ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ఇరు వైపుల అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. ఈ కారిడార్‌లోని 6 ప్రతిపాదిత మెట్రో స్టేషన్‌లలో కొన్నింటిని ఫ్లైఓవర్లు మీదుగా ఆటంకం లేకుండా ఎన్‌హెచ్ రెండు వైపుల నుంచి సులభంగా యాక్సెస్ చేసే విధంగా కొద్దిగా సరిచేయనుంది.

మియాపూర్-పటాన్‌చెరు మెట్రో కారిడార్‌ను (సుమారు 13 కి.మీ) ఎన్‌హెచ్ సెంట్రల్ మీడియన్‌లో మెట్రో వయాడక్ట్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే ఎన్‌హెచ్ అధికారులు గంగారం (మదీనగూడ ప్రాంతం) వద్ద దాదాపు 1.2 కి.మీల పొడవైన ఫ్లైఓవర్‌ను ప్లాన్ చేస్తున్నందున, హెచ్ఏఎంఎల్, ఎన్‌హెచ్ ఇంజనీర్లు సంయుక్తంగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్-కమ్-మెట్రో వయాడక్ట్‌ను సంయుక్తంగా నిర్మించే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు. ఇరుకైన స్ట్రెచ్, రహదారికి ఇరువైపులా భూగర్భ/ఓవర్ హెడ్ యుటిలిటీస్ ఉండటం, ఈ స్ట్రెచ్‌లో కుడి వైపున ఒక పెద్ద మతపరమైన కట్టడం ఉండడం వల్ల ఈ డబుల్ డెక్కర్ ప్రతిపాదన జరిగింది. దిగువ స్థాయిలో ఎన్‌హెచ్ ఫ్లైఓవర్, పైస్థాయిలో మెట్రో వయాడక్ట్‌తో డబుల్ డెక్కర్ మార్గం ఉండేలా క్రాస్ సెక్షన్ డ్రాయింగ్‌ను హెచ్ఏఎంఎల్ సిద్ధం చేసి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఆమోదం కోసం సమర్పిస్తుంది. బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ ఫ్లైఓవర్ వద్ద ఎడమ వైపునకు మెట్రో అలైన్‌మెంట్ ఉంటుంది. బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద ఉన్న టీజీఎస్ఆర్టీసీ బస్ స్టాప్‌తో బీహెచ్ఈఎల్ మెట్రో స్టేషన్ అనుసంధానం కానుంది.

నాగోల్-ఎల్బీనగర్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్‌కు స్పర్ లైన్‌గా నిర్మించే మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్-కొత్త హైకోర్టు స్పర్‌లైన్‌లో(5కి.మీకిపైగా) మెట్రో అలైన్‌మెంట్ ప్రారంభంలో ఆరాంఘర్ వద్ద పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేకి ఎడమ వైపున ఉంటుంది. అది పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, అగ్రికల్చర్ యూనివర్సిటీ ఫ్లైఓవర్ మధ్య సరైన ప్రదేశంలో కుడి వైపునకు (వ్యవసాయ విశ్వవిద్యాలయం వైపు) మళ్లుతుంది. ఈ సమన్వయ సమావేశంలో ఆర్అండ్‌బీ(ఎన్‌హెచ్) ఈఎన్‌సీ ఐ.గణపతిరెడ్డి, జాతీయ రహదారుల ఎస్ఈ పి.ధర్మారెడ్డి, హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనందమోహన్, ఎస్ఈ వై.సాయప రెడ్డి, జనరల్ మేనేజర్లు బి.ఎస్.రాజేశ్వర్, విష్ణు వర్ధన్ రెడ్డి, ఇతర సీనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

జాతీయ మత్స్య కృషీవలుల దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం డీఎఫ్‌సీఎస్ జిల్లా చైర్మెన్ మన్నె రాజు అధ్యక్షతన ఘనంగా మత్స్యశాఖ-జాతీయ మత్స్య కృషీవలుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ హీరాలాల్ చౌదరి, అలీఖుని జ్ఞాపకార్థం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీరు చేపల ఉత్పత్తిలో ఇండ్యూస్‌డు బ్రీడింగ్ ద్వారా అధికం చేయడంలో కృషికిగాను ఈ సెనినార్లు, వర్క్‌షాపులు, ప్రొహిబిషన్లు, ఇంటరాక్టివ్ సెషన్లు విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి నిర్వహించినట్టు తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం పీఎంఎంఎస్‌వై పథకాన్ని (ఐదేండ్లకుగాను) తీసుకొచ్చినట్టు చెప్పారు. దీని ద్వారా దేశ వ్యాప్తంగా 55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఉన్నట్టు పేర్కొన్నారు. 22 ఎంటీ చేపల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా ఉన్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా మత్స్య రంగంలో ఉన్న వారికి ఆటోలు, ఎంఎఫ్ఆర్‌ఓలు, చేపల చెరువులు, ఆర్ఎస్ఏలు సబ్సిడీ ద్వారా లబ్దిదారులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లాలో మట్టి పాండ్‌లలో చేపలను పెంచుతున్న రైతుల అనుభవాలను, చేపల పెంపకం, పెట్టుబడి, మార్కెటింగ్ లాంటి విషయాల్లో వివరించడానికి పలువురుని ఆహ్వానించినట్టు తెలిపారు. వీరు మత్స్యకారులకు చేపల పెంపకం గురించి వివరించినట్టు తెలిపారు. డీఎఫ్‌సీఎస్ జిల్లా చైర్మెన్ మన్నె రాజు మాట్లాడుతూ చేపల ప్రొటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో, దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో, చేపల రైతులు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి ఈ జాతీయ చేపల రైతు దినోత్సవం ముఖ్యమైన వేదికగా పని చేస్తుందన్నారు. మత్స్యకారులకు నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయడానికి, మత్స్య సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రయివేటు కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలి



● **నిరుద్యోగులు స్టడీ సర్కిల్స్‌ను వినియోగించుకోవాలి**

● **ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి**

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రయివేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని, నిరుద్యోగులు స్టడీ సర్కిల్స్‌ను వినియోగించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సూచించింది. బుధవారం హిమా యత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయివేట్ కోచింగ్ సెంటర్ల ఆగడా లు అధికమయ్యాయని, ఒక్కో సెంటర్లలో లెక్కకు మించి ఒకే గదిలో నిరుద్యోగు లకు కోచింగ్ ఇస్తున్నారని వారు ఆరోపించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థుల నుండి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నో ఏండ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం వేచి చూసి పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు చేదు అనుభవాలే ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల రూపాయలు కోచింగ్ ల పేరిట వసూళ్లు చేస్తున్న నిరుద్యోగులకు మెరుగైన సేవలు అందించడంలో విఫలం అవుతున్నారని ధ్వజమెత్తారు. అదే విధంగా నేడు కొన్ని పోటీ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు కోరుతున్నారని, అయితే మెజారిటీ అభ్యర్థుల నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కొన్ని కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు నిరుద్యోగులను పావులుగా వాడుకుని వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టి వేయడానికి కుటిల నీచ పద్ధతులను ఎంచుకుంటున్నారని వాటి పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ప్రభుత్వ పరంగా ఉన్న స్టడీ సర్కిల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ స్టడీ సర్కిల్స్‌లో ఉచితంగా మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ లింగం రవి, వెంకటేశ్వర్లు, బిజ్జ శ్రీనివాసులు, సత్య ప్రసాద్, ఎం.శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు అరికట్టాలి

● అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలి

● కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి ● ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ పెన్షన్ కల్పించాలి

● తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మికుల కోర్కెల దినం సందర్భంగా బుధవారం అల్వాల్ ప్రాజెక్టు ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.శివరాణి అధ్యక్షత వహించగా.. శోభారాణి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్‌కు బడ్జెట్ ఇవ్వకుండా జీతాలు పెంచడం లేదని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా టీచర్లకి రూ.లక్ష ఆయాలకు రూ.50వేలు ఇస్తున్నట్టు జీవో జారీ చేయడం అన్యాయం అన్నారు. రూ.26వేల జీతం ఇవ్వాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలనీ, ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రేణుక, అంజమ్మ, తిరుమల, మంజు, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రిటైర్డ్ బొగ్గు ఉద్యోగులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

రిటైర్డ్ బొగ్గు ఉద్యోగులు బుధవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ని కలిశారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి పెన్షన్ పెంచాలని కోరారు. బొగ్గు ఉద్యోగులు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, అఖిల భారత పెన్షన్ అసోసియేషన్ ఉద్యోగుల కన్వీనర్ పికే సింగ్ రాథోర్ అధ్యక్షతన కేంద్రమంత్రిని కలిసి రెండు వినతి పత్రాలు చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు .ఇటీవలనే సింగరేణి రిటైర్డ్ డైరెక్టర్ దత్తాత్రేయలు ఈ విషయంపై కలిశారని త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి పెన్షన్ పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినారు ఇచ్చారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మేడూరి విజయ బాబు తదితరులు పాల్గొన్నారు

తార్నాక డివిజన్‌లో ప్రజా పాలన

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ లోని లాలాపేట కార్యాలయంలో బుధవారం నుంచి ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజా పాలనా కార్యక్రమంలో పాల్గొనున్నారని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ ప్రజలందరూ ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయగలరని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సూచించారు.ప్రజలు అందించే ఫిర్యాదులకు అధికారులు స్పందించి, పరిష్కారం చూపించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ అధికారులు స్పందించకుంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.



టీఎస్‌పీ విద్యార్థి నాయకులు అరెస్ట్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని డిమాండ్ డిమాండ్‌తో చలో కోదండరాం ఇల్లు ముట్టడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్ట్స్ కాలేజ్ నుండి తార్నాకలోని కోదండరాం నివాసానికి ముట్టడి కోసం తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ విద్యార్థి నాయకులు బయల్దేరేందుకు యత్నించగా ఓయూ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి ఓయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ తో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. యూనివర్సిటీల వీసీల నియామకంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకునేలా ప్రొఫెసర్ కోదండరాం ఒత్తిడి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యూనివర్సిటీలకు వీసీలు లేనందున పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని.. పది రోజులలో వీసీలను నియమించకుంటే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల బంద్ పాటిస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బారి అశోక్ కుమార్, వెంపటి సురేష్, నూకల పాల్గొన్నారు.

బ్రాహ్మణ బస్తీలో పర్యటించిన కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ

స్థానికుల ఫిర్యాదు మేరకు సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ బుధవారం బ్రాహ్మణ బస్తీలో అధికారులతో కలిసి పర్యటించారు. తాగునీరు కలుషితం అవుతుందని, లో ప్రెజర్‌లో వాటర్ వస్తోందని స్థానికులు తెలుపగా సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంకను కార్పొరేటర్ ఆదేశించారు. నూతన సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరగా జీహెచ్ఎంసీ అధికారులతో కార్పొరేటర్ ఫోన్‌లో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంక వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్,స్థానికులు పాల్గొన్నారు



వాణిజ్య విభాగం 2024 పోస్టర్స్ విడుదల

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని కామర్స్ పీజీ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఓయూ వాణిజ్య శాస్త్ర విభాగం అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అన్ని యూనివర్సిటీల పరిధిలోని ఎం.కామ్ విద్యార్థులు వివిధ అంశాల్లో తమ ప్రతిభను, నైపుణ్యాన్ని చాటుకునేందుకు వీలుగా కామర్స్ డిపార్ట్‌మెంట్ 'వాణిజ్య 2024' పేరుతో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ నిర్వహించేందుకు సిద్ధమైంది. అంతర్ విశ్వవిద్యా లయ స్థాయిలో ఈ నెల 19, 20 తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఉత్సాహవంతులైన ఎం.కామ్ విద్యార్థుల్లో దాగి ఉన్న వాణిజ్యరంగ మెలకువలు, ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఆరోగ్యకరమైన పోటీ, స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులు తమ సత్తా చాటేందుకు వీలుగా వాణిజ్య 2024 సంవత్సరంలో వివిధ రకాల ఈవెంట్స్ ఉంటాయని చెప్పారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు, సందేహాలు నివత్తి చేసుకునేందుకు విద్యార్థులు ఎశీబ-ఋఅబయిఋ2024ఏ స్రఋఅశ్రీ.ఎశీఎకు మెయిల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఓయూ వీసీ ఓఎస్‌డీ ప్రొ. బి.రెడ్యా నాయక్, కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. ఎం.గంగధర్, హెడ్ ప్రొ.దాసరి. చెన్నప్ప, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొ. కష్ణ చైతన్య, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొ. ఐ.శేఖర్, ఫ్యాకల్టీ సైన్సెస్ డీన్ ప్రొ. కరుణ సాగర్, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. తలత్ సుల్తానా, మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, ప్రొ. జి.నరేశ్ రెడ్డి, ప్రొ. ఎ.పాట్రిక్, డాక్టర్ రామేశ్వర్ పాల్గొన్నారు.



హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మార్బుల్ హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, శ్రీనగర్ కాలనీలోని మార్బుల్ కార్మికులతో కలిసి సిఐటియు హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి అశోక్ పాల్గొని భారీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, మార్బుల్ హమాలీ కార్మికులకు వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, వారికి సంక్షేమ పథకాలు పట్టణ ఉపాధి హామీ పథకం కల్పించాలని డిమాండ్ చేశారు.శ్రీనగర్ కాలనీలో మార్బుల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సరైనటువంటి సౌకర్యాలు లేవు ప్రమాదాలు జరిగితే రక్షణ లేదు. లోడింగ్ అన్లోడింగ్ చేసే సమయంలో బండలు మీద పడి అనేక రకాల గాయాలతో ఇబ్బందులు పడుతున్న రక్షణ లేదు. కావున సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు, కూలి రేట్లు పెంచి ఆరోగ్యం కొరకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ,రాజు కురుమయ్య, లాలు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సూత్ర ఎగ్జిబిషన్ షురూ

నవతెలంగాణ-బంజారా హిల్స్



ఆధునిక సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను మిస్ గ్రాండ్ ఇండియా 2022, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర మిస్ యూనివర్స్ డైరెక్టర్ ప్రాచీ నాగ్‌పాల్ బుధవారం బంజారాహిల్స్ లోని తాజ్ కష్ణలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... దేశంలోని అనేక నగరాల మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లను ఒకే వేదికలో తమ వేలాది రకాల ఉత్పత్తులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 12 వ తేది వరకు కొనసాగనున్న ప్రదర్శనలో రాఖీ తీజ్ కు పండుగ షాపింగ్ అనుభూతిని కలిగించే ప్రత్యేకమైన ఫ్యాషన్, పండుగ ప్రత్యేక సేకరణలు, భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్ అండ్ డిజైనర్ జ్యువెలరీ తో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు వంటి వేలాది రకాల ఉత్పత్తులను 'రాఖీ తీజ్' స్పెషల్ ఎడిషన్ లో 70 స్టాల్స్ 25 వేలకు పైగా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నామని సూత్ర నిర్వాహకులు ఉమేష్ తెలిపారు

బల్కాపూర్ నాలా చుట్టూ ప్రహరీ నిర్మించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- షేక్‌పేట్ సక్కుబాయి సొసైటీ నాలాను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

బల్కాపూర్ నాలా, గ్రేవ్ యార్డ్ ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు నాలా చుట్టు గోడ నిర్మించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం షేక్‌పేట్‌లోని సక్కుబాయి సొసైటీ వద్ద ఉన్న నాలాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బల్కాపూర్ నాలా, గ్రేవ్ యార్డ్‌ను రక్షించేందుకు నాలా బఫర్ జోన్ వెంట ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశిం చారు. జీహెచ్ఎంసీ అధికారులు నాలా వెంట ప్లాంటేషన్, గ్రీనరీతో సుందరీకరణను చేపట్టాలని సూచించారు. 2012 సంవత్సరంలో రెవెన్యూ ద్వారా అప్పగించిన 1700 చదరపు గజాల విస్తీర్ణంలోని గ్రేవ్ యార్డ్ ప్రహరి గోడ నిర్మించాలని



తెలిపారు. సక్కుబాయి సొసైటీ ప్లాట్ యజమాని మిస్సర్స్ విసీసీ ద్వారా చెత్త డంప్‌ను సొంత ఖర్చుతో తొలగించాలని, లేకుంటే వారికి నోటీసులు జారీ చేయాల్సిందిగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ , తహసీల్దార్ అనిత రెడ్డి, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సంపత్, ఏఈ కిషోర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేటలో ఏర్పాట్లపై సమీక్ష

ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బల్కంపేట రేణుక ఎల్లమ్మ చండీ హెూమం, రథోత్సవము ప్రశాంతంగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్కంపేట రేణుక ఎల్లమ్మ దేవస్థానము సందర్శించి చండీ హెూమం, రథోత్సవము కార్యక్రమ ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వైద్యశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని, అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ ఇంజన్లు, వైద్య ఆరోగ్యశాఖ అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, దేవదాయ శాఖ నిరంతరం ఉత్సవాల్లో పరిస్థితిని పర్యవేక్షించాలని, జీహెచ్ఎంసీ అధికారులు దేవస్థాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, రెవెన్యూ శాఖ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. రథోత్సవ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ పీఎం, సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్, ఏసీపి వెంకటరమణ, దేవస్థానం ఈవో అంజనా దేవి, తాసిల్దార్ భీమయ్య గౌడ్, ఆర్అండ్‌బీ, దేవదాయ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శ్రీ గణేష్
- టిమ్స్ హాస్పటల్ పనులు పరిశీలన



నవతెలంగాణ-కంటోన్మెంట్

బొల్లారంలో టిమ్స్ హాస్పిటల్ పనులను బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పరిశీలించారు. ఇంజనీర్లు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యత పరంగా ఎలాంటి లోపాలు లేకుండా నిర్మాణం చేపట్టాలని ఇంజినీర్లకు సూచించారు వీలైనంత తొందరగా ఆస్పత్రి అంకితం చేసే విధంగా ముందుకు సాగాలని కోరారు. నిర్మాణంలో ఎక్కడ చిన్నపాటి లోపం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన ఎన్ని బ్లాకులు ఏ బ్లాక్ ఎక్కడ ఉంటాయని అడిగి తెలుసుకున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని.. ప్రజల ఆరోగ్యం కోసం పెద్ద భారీగా బడ్జెట్ కేటాయిస్తుందని అన్నారు..ఇప్పటివరకు సరైన సమయంలో పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ వరకు హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు ఇంజనీర్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం చేపడుతుందని.. కార్పొరేట్ స్థాయికి మించి వైద్యం అందించడానికి టిమ్స్ హాస్పిటల్ సనద్ధమవుతుందన్నారు. ఈ టీమ్స్ ఆస్పత్రి ద్వారా చుట్టుపక్కల ఉన్న రెండు మూడు జిల్లాల పేదలకు వైద్యం అందుతుందని.. ఇది చాలా సంతోషమని ఎమ్మెల్యే అన్నారు..

'సౌత్ ఇండియా'లో విజయవంతంగా ఆషాఢమాసం సేల్స్

నవతెలంగాణ-బేగంపేట్



తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాల్లో ఆషాఢ మాసానికి ఉన్న ప్రత్యేకత నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూమ్స్ వారు భారీ తగ్గింపు ధరలతో సరికొత్త ఆఫర్‌ను ప్రకటించారు. కిలోల్లో షాపింగ్ చేసి టన్నుల్లో ఆనందాన్ని పొందమంటూ ఆషాఢం నెం1 కిలో సేల్స్‌లో భాగంగా 66 శాతం వరకు తగ్గింపు ధరలకు అన్ని రకాల వస్త్రాలపై సరికొత్త స్టాక్‌ను విక్రయిస్తున్నారు. అంతేకాదు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్/ క్రెడిట్ కార్డుపై ఈఎంఐ సదుపాయాన్ని కల్పించడంతో పాటు రూ.5,000ల వరకు తక్షణ డిస్కౌం ట్‌ను అందజేస్తున్నారు. కస్టమర్ల అభిరుచుల మేరకు కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి, అదేవిధంగా డిజై నర్ శారీస్, హైఫ్యాన్సీ శారీస్, క్యాటలాగ్ శారీస్ కిడ్స్ వేర్ వంటి వైవిధ్యభరిత వస్త్రశ్రేణిని అందుబాటులో ఉం చారు.

రెండు రాష్ట్రాలలోని షోరూమ్లలో ఆషాఢం నెం1 కిలో సేల్స్‌లో ఆఫర్‌ను వినియోగించుకోవాల్సిందిగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు ఇచ్చిన పిలుపును పురస్కరించుకుని మహిళాలోకం షోరూంలకు. పెద్ద ఎత్తున తరలిరావటం విశేషం. ఈ ఏడాది ఆషాఢమాస వేడుకల సందర్భంగా వస్త్రప్రియుల నుంచి 'సభూతో...' తరహాలో లభిస్తున్న అనూహ్య స్పందన పట్ల సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకులు ఒక పత్రికా ప్రకటనలో తమ ఆనందాన్ని, కతజ్ఞతనూ వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా గతంలో లేని విధంగా ఈ ఏడాది ఆషాఢం నెం1 కిలో సేల్స్‌ను మరింత ఆకర్షణీయంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ వెరైటీలతో కూడిన సరికొత్త స్టాక్‌ను వస్త్రప్రియుల ఎంపిక కోసం తమ షోరూమ్‌నుకు తరలిస్తున్నారు. ఈ వాస్తవాన్ని వస్త్రప్రియుల దష్టికి తీసుకువస్తూ, అందుబాటులో ఉన్న అందమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు. కోరుతున్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి
- ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన ఎగ్జిబిషన్‌కు అపూర్వ స్పందన

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే అంశంపై ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో బుధవారం జామున్మానియా ప్రభుత్వ హైస్కూల్‌లో డ్రగ్స్ పై అవగాహన కల్పనకు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసై బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. భయం కరమైన డ్రగ్స్ భూతాన్ని మన దరిచేరకుండా తరిమికొట్టాలని అన్నారు.

దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించవలసిన యువకులు, విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను అంధకారంలోకి నెట్టి వేసుకుంటున్నారని.. ఇలాంటి డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టవలసిన బాధ్యత ప్రజలందరి పైన ఉందని గుర్తు చేశారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోతారని, వారికి వారే మాట్లాడుకోవడం, డ్రగ్స్ కోసం ఎలాంటి పనులకైనా సిద్ధపడేటట్టుగా మనిషిని తయారు చేస్తుంది డ్రగ్స్ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డ్రగ్స్ మాఫియా స్కూల్ పిల్లల దగ్గర నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు టార్గెట్ చేసుకొని చాప కింద నీరుల తమ వ్యాపారాన్ని విస్తరిస్తుందని ఇలాంటి డ్రగ్స్ మాఫియా ఆటలు కట్టించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఒక ప్రత్యేకమైనటువంటి వ్యవస్థను తయారుచేసి డ్రగ్స్ మాఫియా నుంచి విద్యార్థుల్ని యువకుల్ని ప్రజల్ని కాపాడుకోవడం కోసం కృషి చేస్తుందని అన్నారు. మన పిల్లల ప్రవర్తనను, ఇంట్లో తల్లిదండ్రులు స్కూల్లో టీచర్స్ అబ్జర్వేషన్ చేయాల్సిన బాధ్యత ఉంది

పట్నం సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీఎస్ ఎన్ రాజు



మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియా రకరకాల మార్గాల్లో రెచ్చిపోతున్న డ్రగ్స్ మాఫియా కొత్త మార్గాలను ఎంచుకుంది పాన్ షాపులు టీ కొట్టులు చేసుకొని తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా చిరుప్రాణాలైన విద్యార్థులను కూడా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్‌ను అందిస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ మాఫియా ఆటలు కట్టించేందుకు ప్రభుత్వ అధికారులు, పోలీసులు నిఘా పెంచవలసిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడకు విఘాతం కలిగిస్తున్న డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ చిరంజీవి డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టడంలో టీచర్స్ ప్రజా ప్రతినిధులు, పోలీస్ డిపార్ట్మెంట్, అధికారులు అందరూ కలిసి ఈ డ్రగ్స్ భూతాన్ని నిర్మూలించాలన్నారు. డ్రగ్స్ భూతాన్ని అంతం చేయడం కోసం అందరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. డ్రగ్స్ మత్తును అరికట్టాలంటే అది చదువుతూనే సాధ్యమవుతుందని, అవగాహన కల్పించినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ఎస్ మధుసూదన్, రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ,ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మారన్న ,ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి డి. మహారాజ్, నగర ఉపాధ్యక్షులు ఎస్ జనార్దన్, టీచర్స్ ఆర్ శ్రీనివాస్ రెడ్డి ,జి రమేష్ ,కే రాములు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఆహ్వాన సంఘం సభ్యులు కె. వీరయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ముజీబ్ జన్మదిన వేడుకలు



- టీఎన్జీవోస్ జిల్లా కమిటీ ఆధర్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం కార్యక్రమాలు
- డాన్ బాస్కో అనాధాశ్రమానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకుల అందజేత
- జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ముజీబ్ దంపతులకు సన్మానం.. కేక్ కటింగ్


నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) 52వ జన్మదిన వేడుకలు కేంద్ర సంఘం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలోని అమ్మవారి ఆలయంలో పూజ కార్యక్రమం నిర్వహించి.. పేదలకు అన్నదానం చేశారు. అటు నుంచి హజరత్ యూసుఫ్ బాబా దర్గాలో చాదర్ సమర్పించి.. పేదలకు అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు డాన్ బాస్కో అనాధ శరణాలయంలో దైవ ప్రార్థన తర్వాత భోజనం ఏర్పాటు చేసి.. వారికి నెలకు సరిపడ సరుకులను ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం కార్యదర్శి కె.విక్రమ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి.. డాక్టర్ ముజీబ్ దంపతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, కోశాధికారి బాల్‌రాజ్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, సుజాత, గీత, ప్రచార కార్యదర్శి వైదీక్ శాస్త్ర, ఈసీ మెంబర్ శ్రీధర్, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్, మాజీ సభ్యులు జానకి, కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, కొండల్ రెడ్డి, జిల్లా పీఆర్వో సయ్యద్ జాహంగీర్ మొహమ్మద్, వహీద్, మహమ్మద్ ముస్తఫా షరీఫ్, మిత్రులు ఉస్మాని అలీ ఉస్మాని, రామకృష్ణారెడ్డి, రోహిత్, రాజేంద్రనగర్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులతో పాటు సుమారు 58 యూనిట్స్ అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు పాల్గొని డాక్టర్ ముజీబ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్ఎస్. బ్రదర్స్‌లో శరవేగంగా ఆషాఢమాసం కేజీ సేల్స్

నవతెలంగాణ-బేగంపేట్



అన్ని రకాల వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపు ధరలకు అందుబాటులో ఉండేలా ఆర్.ఎస్. బ్రదర్స్ వారు ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ప్రకటించిన 'కేజీ సేల్స్' వస్త్రాభిమానులను ఆకర్షిస్తోంది. అంతేకాదు రానున్న పర్వది నాలను, శుభాకార్యాలను దృష్టిలో ఉంచుకుని కంచి పట్టు చీరలను కంచి సొసైటీ ధరలకే విక్రయిస్తున్నారు. అదే విధంగా ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పఠాని, పోచంపల్లి, పటోల, రాజ్కోట్, జైపూర్, కోల్కత, బెనారస్, ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, క్యాటలాగ్ శారీస్, మెన్స్ ఎత్నిక్వేర్ అండ్ కిడ్స్‌వేర్‌ను వస్త్రప్రియులకు అందుబాటులో ఉంచారు. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్/క్రెడిట్ కార్డులపై ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు సదుపాయాన్ని కల్పించి రూ.5,000ల వరకు తక్షణ డిస్కౌంట్‌ను కూడా ఇస్తున్నారు.

ఆషాఢమాసం ఎప్పుడు వస్తుందా? ఆర్.ఎస్. బ్రదర్స్ వారు ఏ రకమైన సరికొత్త ఆఫర్ ప్రకటిస్తారా? అని మహిళా లోకం ప్రతీ ఏటా ఆత్రుతగా ఎదురు చూసే నేపథ్యంలో ఈ సంవత్సరం తాము ప్రకటించిన ఆషాఢమాసం కేజీ సేల్స్ పట్ల వస్త్రాభిమానులు విశేష స్థాయిలో హర్షం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో తమ బ్రాంచికి తరలి వస్తున్నారని ఆర్. ఎస్. బ్రదర్స్ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కేజీ సేల్స్ విషయంలో మహిళా లోకం నుంచి వెల్లువెత్తుతున్న ఆదరాభిమానాలను దష్టిలో ఉంచుకుని వైవిధ్యభరితమైన సరికొత్త స్టాక్‌ను ఆర్.ఎస్. బ్రదర్స్ షోరూమ్‌లలో ప్రతీ రోజూ పెద్దఎత్తున అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆర్.ఎస్. బ్రదర్స్ వారు ఈ పత్రికా ప్రకటన మూలంగా అభ్యర్థిస్తున్నారు

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల కోరికల దినం



నవతెలంగాణ-ఓయూ

కార్మికుల కోరికలు దినం సందర్భంగా సికింద్రాబాద్ జోన్‌లోని తుకారం గేట్ ,లాలాపేట, తార్నాక పరిధిలో కార్మికుల ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ నాయకులు ఎం. అజయ్ బాబు,ఆర్. మల్లేష్ లు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చి ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్లీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. బొగ్గు బ్లాక్ లవేలానికి పూనుకుందని, ఈపీఎఫ్ సకాలంలో చెల్లించిన యాజమాన్యాలకు విధించే జరిమానను భారీగా తగ్గించిందన్నారు. కార్పొరేట్ మతోన్మాదులను ప్రసన్నం చేసుకొని వారికి లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలను నివారించి కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉదతం చేయాలని సీఐటీయూ అఖిలభారత కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కమిటీ సభ్యులు నర్సింగ్, శంకర్ యాదవ్, రామచందర్, అశోక్ సిద్ధయ్య, రామచంద్రనాయక్ తాలయ్య వెంకటేష్ కష్ణ మోహన్ సైదమ్మ పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీతో ఉజ్వల భవిష్యత్తు

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో అగ్రగామి
- విద్యార్థులకు బంగారు బాటలు వేస్తున్న యూనివర్సిటీ
- వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో విశ్వవిద్యాలయం
- ఆహ్లాదకర వాతావరణంలో సువిశాలమైన క్యాంపస్





చామకూర మహేందర్‌రెడ్డి,
మల్లారెడ్డి యూనివర్సిటీ సెక్రటరీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజనీరింగ్ విద్యా బోధనలో 36 ఏండ్ల అనుభవం కలిగిన మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిటూషన్స్ 32 విద్యా సంస్థలతో విద్యార్థులకు అపారమైన అవకాశాల నెలవుగా మారి వారి భవితకు భరోసాగా నిలుస్తోంది. విజ్ఞానానికి, వికాసానికి, ఉపాధి అవకాశాలకు బంగారు బాటలు వేస్తూ ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దుతోంది.

మల్లారెడ్డి యూనివర్సిటీని 2020లో మైసమ్మగూడలో సువిశాలమైన ప్రదేశంలో స్థాపించారు. ఈ యూనివర్సిటీ యూజీసీ అప్‌గ్రేడ్ పొందింది. పేద విద్యార్థులకు అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో అతి తక్కువ ఫీజులతో ఇంజి నీరింగ్ విద్యనందిస్తున్నామని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వి.ఎస్.కె.రెడ్డి, సెక్రెటరీ సీహెచ్ మహేందర్‌రెడ్డి తెలిపారు. మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో 50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, 10వేల మంది ఫ్యాకల్టీ ఉన్నారు. ఇక్కడ గతేడాది ఐదు వేల అడ్మిషన్లు జరగ్గా, ఈసారి ఆరు వేలకు చేరువలో ఉన్నాయి.

హైదరాబాద్ మహానగరంలో, బహదూర్‌పల్లి మైసమ్మగూడలో ఉన్న ఈ యూనివర్సిటీలో అత్యాధునిక సదుపాయాలతో ఇంజినీరింగ్, బీఎస్సీ, బీటెక్, బీకాం, బీబీఏ, ఎంబీఏ కోర్సులను అందిస్తున్నారు. ఈ క్యాంపస్ సికింద్రాబాద్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో, కూకట్‌పల్లి నుంచి 13 కిలోమీటర్ల చేరువలో మైసమ్మగూడలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. యూనివర్సిటీ ఛాన్సలర్‌గా సీహెచ్ కల్పనారెడ్డి, వైస్ ఛాన్సలర్‌గా వి.ఎస్.కె.రెడ్డి ఉన్నారు. కళాశాలలో ఎన్నో విభిన్న కోర్సులను బోధిస్తున్నారు. ఎంఆర్‌జీఐ సంస్థ దాదాపు మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో, ప్రత్యేకించి ఇంజినీరింగ్‌లో నిపుణులైన విద్యార్థులను ఆయా పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అందించగలిగింది.

వర్సిటీ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తమ సంస్థ విజయానికి కారణాలు తెలుపుతూ.. నిష్ణాతులైన ఫ్యాకల్టీలు తమ సంస్థలో ఉన్నారనీ, విజ్ఞాన దాయక, సృజనాత్మక విద్యా బోధనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అంతేగాక 400 ఎకరాల సువిశాలమైన ఎకో ఫ్రెండ్లీ అధునాతన క్యాంపస్, ఆహ్లాదకరమైన వాతావరణం, అన్ని వసతులు కలిగిన ప్రయోగశాలలు, వివిధ క్రీడలు ఆడుకునేందుకు విశాలమైన ఆట స్థలం, హాస్టల్ సౌకర్యంతో పాటు 200కుపైగా బస్సులు ఉన్నాయి. వైఫై సౌకర్యం ఉంది. ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్, బ్యాంక్ ఏటీఎంలు, వైద్య సదుపాయం, విద్యార్థుల కోసం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్, డిజిటల్ లైబరీతో పాటు ప్రతి తరగతి గదిలోనూ ఆడియో విజువల్స్ అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అలాగే ఈ సంస్థ మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తోంది.

ఎంఆర్‌యూహెచ్ మల్లా రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ యూనిట్ అయిన మల్లా రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా స్పాన్సర్ చేయబడింది. ఎంఆర్‌యూహెచ్ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను సృష్టించడం, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడం, వినూత్న కార్యక్రమాలను అభివద్ధి చేయడం, పారిశ్రామిక టై-అప్‌లను ఏర్పాటు చేయడం, మంచి-అర్హత, శిక్షణ పొందిన ఫ్యాకల్టీని నియమించడం, ప్రతిభను ప్రోత్సహించడం, పరిశోధనను పెంపొందించడం వంటి కొత్త కార్యక్రమాల ద్వారా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎదగడానికి ఒక దృక్కోణ ప్రణాళికను కలిగి ఉంది. ఇన్నోవేషన్, స్థిరమైన నిధుల ప్రవాహంతో అవుట్ రీచ్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది.

వివిధ కోర్సులు ఇలా..

స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, బీటెక్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, వీఆర్ అండ్ ఏఆర్ ఐటీ, ఈసీఈ ఎంటెక్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్, ఎంబెడడ్ సిస్టమ్స్, బిగ్ డేటా అనాలటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలు, బీఎస్సీ (హనర్స్), అగ్రికల్చర్, బీఎస్సీ ఆర్టికల్చర్, బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ జెనటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, అగ్రోనమీ, ఎంటమాలజీ, ప్లాంట్ పాతాలజీ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్, హార్టికల్చర్, ఫుడ్ సైన్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.

మల్లారెడ్డి గ్రూప్ కళాశాలలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కోర్సులు

బీటెక్‌లో సివిల్, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. వీటితోపాటు ఎంటెక్ కోర్సుల్లో ఈసీఈ, ఎంబీడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్స్, వైర్‌లెస్ అండ్ మొబైల్ కమ్యూనికేషన్స్, ఇంజినీరింగ్, ఎంబీఏ కోర్సులతో పాటు బీ ఫార్మసీ, ఎం పార్మసీ, ఫార్మాడీ (పీబీ) కోర్సులు, ఎంబీబీఎస్, బీడీఎస్ కూడా ఉన్నాయి. వీటికి తోడు బీఎస్సీ హానర్స్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సైన్సెస్ కోర్సులను ఈ ఏడాది ప్రవేశపెట్టింది.

అనుబంధ సంస్థలు

మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ (ఎంజీఆర్ఐ)లో 16 అనుబంధ సంస్థలు ఉన్నాయి. వీటిలో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ (అటానమస్), మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్, మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, మల్లారెడ్డి మెడికల్ సైన్సెస్, మల్లారెడ్డి డెంటల్ కాలేజీలు ఉన్నాయి.

50 వేలకుపైగా విద్యార్థులు

మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో 32 విద్యాసంస్థల్లో 50 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అనుభవం కలిగిన 10 వేల మంది ఫ్యాకల్టీలు ఉన్నారు. ప్రతియేటా 12 వేల మంది విద్యార్థులు క్యాంపస్ నియామకాల్లో ఎంపికవుతున్నారు.

అకాడెమీ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్

విప్రో, టెక్‌మహీంద్రా, కోడ్ తంత్ర, భారత్ బయోటెక్, ఐసీటీ అకాడెమీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, నాస్కామ్, ఐఈఈఈ, సియాంట్, ఇక్రిసాట్, హెచ్‌సీఎల్, జెన్‌పాక్ట్, డీలైటీ, హుందాయ్, సీజీఐ, త్రిపుర, కాగ్నిజెంట్, కోర్సెరా వంటి ప్రముఖ కంపెనీలు క్యాంపస్ నియామకాల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

ఇంటర్న్‌షిప్ అవకాశాలు

టీహబ్, క్లినోసల్, ఇండిగ్లోబల్, డా.అగర్వాల్స్, స్వరూప్ ఐసెంటర్, ఎన్‌ట్రీత్, జియిస్ ఎంప్లాయిబిల్టీ, భారత్ బయోటెక్, నోవార్టిస్, మల్లారెడ్డి హాస్పిటల్, ఏఐజీ హాస్పిటల్స్, కేర్ హాస్పిటల్స్, అపోలో హాస్పిటల్స్, సన్ ఫార్మా ఒరాకిల్, సమనిత రిసర్చ్ రిసొల్యూషన్స్, ఎబాట్, యాక్సెంచర్, కవెన్స్, క్రోయిస్సెన్స్, ఐక్యూవీఐఏ, సిప్లా, జైడస్, ఎంక్యూర్, బ్రూనెక్స్‌లో అవకాశాలు లభిస్తున్నాయి.

మేనేజ్‌మెంట్

మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవస్థాపక చైర్మెన్‌గా ఉన్నారు. సెక్రెటరీగా సీహెచ్ మహేందర్‌రెడ్డి, చైర్మెన్‌గా భద్రారెడ్డి ఉన్నారు.

సువిశాలమైన క్రీడా ప్రాంగణం

విశ్వవిద్యాలయంలో సువిశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, ఇండోర్ ఆటలతో సహా అద్భుతమైన క్రీడా సౌకర్యాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్‌లను గెలుచుకున్నారు. అదనంగా, విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు ఇద్దరికీ ఉపయోగం కోసం అత్యాధునిక వ్యాయామశాల అందుబాటులో ఉంది.

హాస్టల్ సౌకర్యం

దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక, పర్యావరణ అనుకూల హాస్టల్ సౌకర్యాలు బాలురు, బాలికలకు విడివిడిగా అందుబాటులో ఉన్నాయి. ఇంటర్నెట్ సదుపాయం, డిజిటల్ లైబ్రరీ, జిమ్, యోగా సౌకర్యం కూడా ఉంది. హాస్టల్‌లోని అన్ని గదులు విశాలంగా, పరిశుభ్రంగా, మంచి వెంటిలేషన్‌తో విద్యార్థులకు సౌకర్యవంతమైన జీవన వాతావరణాన్ని అందిస్తాయి.

విద్యార్థుల భవితవ్యానికి పునాది హితం





అరుట్ల ప్రశాంత్,
హితం కళాశాల చైర్మెన్

- అద్భుత విజయాలతో ఆకట్టుకున్న హితం
- స్వయం ప్రతిపత్తి(అటానమస్) కళాశాల
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్
- సృజనాత్మక, ప్రణాళికాబద్ధ విద్యా విధానంతో ముందుకు
- హితం కళాశాల ఎంసెట్ కోడ్ HITM

నవతెలంగాణ-సిటీబ్యూరో

హితం విద్యా సంస్థ విద్యార్థుల భవితవ్యానికి బాసటగా నిలుస్తోంది. మేడ్చల్ గౌడవెల్లిలో 10 ఎకరాలలో నెలకొల్పిన ఈ సంస్థ మెరుగైన, నాణ్యమైన విద్యను అందించడంలో మేటిగా నిలుస్తోంది. విద్యార్థుల విజయాలే తమ విజయంగా హితం యాజమాన్యం భావిస్తోంది. కేవలం విద్యార్థుల కెరీర్, ప్లేస్‌మెంట్స్‌తో పాటు లక్ష్యాల విషయంలో మొదటి సంవత్సరం నుండే డిజైన్ చేయబడితేనే అనుకున్న విజయాలు సాధ్యమని హితం నమ్ముతోంది. ఇంజనీరింగ్ విద్యా విధానంలో ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇక్కడ 'డూయింగ్ ఇంజనీరింగ్' విద్యా విధానం విద్యార్థులు అనుభవపూర్వక అభ్యాసన కార్యక్రమంగా కొనసాగుతోంది. ఎమర్జింగ్ టెక్నాలజీ కోర్సుల కోసం ఎమర్జింగ్ ఇనిస్టిట్యూషన్ హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (హితం) అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు కేంద్రంగా పనిచేస్తోంది. 2001 నుంచి విద్యార్థి కేంద్రీకృత అభ్యాస కార్యక్రమాలలో నిజమైన చాంపియన్‌గా నిలిచింది. విద్యా ర్థుల భవిష్యత్తుకు భరోసానిస్తోంది. ఇంజినీరింగ్ విద్యకు దాని ప్రత్యేక ప్రాజెక్ట్-ఆధారిత విధానం తోడ్పడుతోంది. విద్యార్థులందరూ మొదటి సంవత్సరం నుండే పరిశ్రమలో ఇంటరాక్టివ్ విద్యను పొందుతారు. తద్వారా వారు తమ కలల 'కెరీర్' ను సాకారం చేసుకుంటారు. బీటెక్ ప్రధాన శాఖలతో పాటు, హితం కూడా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో ప్రత్యేక బీటెక్ కోర్సులను అంది స్తోంది. నిరంతర పరిశ్రమ భాగస్వామ్యాన్ని నిర్మించడంపై హితం ప్రత్యేక దృష్టి ని కేంద్రీకరించింది. క్యాంపస్‌లో ఐబీఎం సాఫ్ట్‌వేర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇది రీకోడ్, కోక్యూబ్స్, ప్రోత్సాహక మైండ్స్, ఇన్ఫోమెరికా, టెక్ న్యూమెన్, ఎంటర్‌ప్రైజ్ మైండ్స్ మొదలైన వాటితో టై-అప్‌లను కలిగి ఉంది. ఇంజినీరింగ్‌లో మల్టీ డిసిప్లినరీ విధానాన్ని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాలు ఇప్పుడు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ- 2020తో అనుసంధానం చేశారు. హితం తన పాలకమండలిలో విద్యా రంగం నుండి అనేక మంది ప్రముఖులను కలిగి ఉంది. కాన్పూర్ మాజీ డైరెక్టర్, ఐఐటీ ప్రొఫెసర్ సంజయ్ ధాండే అత్యున్నత ప్రమాణాలను ఏర్పాటు చేసిన చైర్మెన్ దూరదృష్టి నాయకత్వ బంధంతో హితం ఏఐ, ఎంఎల్, రోబోటిక్స్, ఐవో సైబర్ సెక్యూరిటీ డేటా సైన్స్‌లో అధునాతన అభ్యాస కేంద్రంగా ముందుకు దూసుకుపోతోంది. ఇది ఎన్‌బీ నుండి గుర్తింపు, న్యాక్ ద్వారా ఏ+ తో నాణ్యమైన విద్యకు గుర్తింపు పొందింది.

హితం అందిస్తున్న ఇంజనీరింగ్ కోర్సులు

సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్)
సీఎస్ఈ డాటా సైన్స్
సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్

స్వయంప్రతిపత్తి కళాశాలగా..

హితం ఈ సంవత్సరం నుండి స్వయం ప్రతిపత్తి కళాశాలగా మారింది. న్యాక్ ద్వారా ఏ ప్లస్ గ్రేడ్ పొందింది. ఒక స్వయం ప్రతిపత్తి కళాశాలగా హితం తన పాఠ్యాంశాలను పరిశ్రమ-సంబంధిత పాఠ్యాంశాలకు ప్రాధాన్యతనిస్తోంది. నిపుణులైన అధ్యాపకులతో పాటు అనుబంధ అధ్యాపకులు అందించే స్పెషలైజేషన్‌లను పునర్వ్యవస్థీకరిస్తోంది. విద్యార్థుల పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి అసెస్‌మెంట్ మెట్రిక్స్ శాస్త్రీయంగా అభివృద్ధి చెందాయి. ఏఐటీఏఎల్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్ 2020, మైక్రోసాఫ్ట్ ఇమాజిన్ కప్, ఏఐసీటీఈ లీలావతి అవార్డు, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ అవార్డు, గ్రీన్ బిల్డింగ్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ వంటి హితంతోపాటు దాని విద్యార్థులు గెలుచుకున్న అనేక పురస్కారాలు ఉన్నాయి.

సువిశాలమైన క్యాంపస్

ఇంజినీరింగ్ కళాశాల గ్రీన్ బిల్డింగ్‌తో సువిశాలమైన క్యాంపస్, ఒక ఐజీబీ సిల్వర్-రేటెడ్ గ్రీన్ బిల్డింగ్‌ని కలిగి ఉంది. ఇది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విశాలమైన పచ్చని క్యాంపస్ మధ్య గంభీరంగా నిలుస్తోంది. అందమైన ల్యాండ్ స్కేప్ ఎలిమెంట్‌లతో కూడిన ప్రశాంతమైన సెట్టింగ్ విద్యార్థుల అభిజ్ఞా ఒత్తిడిని తగ్గిస్తుంది. హార్వర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఐఎం అహ్మదాబాద్, ఏఎస్‌సీఐ నుంచి ఎండీపీ లతో మెకానికల్ ఇంజనీర్, ఐఎస్‌బి యొక్క పూర్వ విద్యార్థి అయిననీ సంస్థ చైర్మెన్ అరుట్ల ప్రశాంత్ యొక్క విజన్‌కు, అభిరుచికి సాక్ష్యంగా నిలుస్తోంది. వారు భారత స్వాతంత్ర్య పోరాట కాలంనాటి నుంచి ఒక ప్రముఖ కుటుంబ వారసత్వానికి టార్చ్ బేరర్. హితంలో 'డూయింగ్ ఇంజనీరింగ్' కోసం వేగాన్ని సెట్ చేసే బోధనా శాస్త్రం హితంలో విద్యార్థులకు అందుబాటులో ఉంది. నాయకులుగా, సమస్య పరిష్కర్తలుగా మారడానికి ఇక్కడ శిక్షణ పొందుతారు. వారికి టీమ్ బిల్డింగ్, యాక్టివ్ లెర్నింగ్, ప్రాజెక్ట్-బేస్డ్ డిజైన్, సమస్య పరిష్కార నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ఇది ఐవోటీ, ఏఐ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీవోఈ ని కలిగి ఉంటుంది. హితం ఎక్స్‌ప్లోర్ పేరిట జీసీపీఎస్‌ఫే,ఈపీసీఎస్, ఈడబ్ల్యుబి, యుబిఎ అనేక ఇతర కార్యక్రమాలు క్యాంపస్‌లో ఉన్నాయి. విద్యార్థులతో వారి కెరీర్‌ను రూపొందించడంలో దగ్గరగా పనిచేస్తుంది. విద్యార్థుల వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు వారి ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచడం, మార్గనిర్దేశం చేయడంతో ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడం వరకు సీడీసీ నిజమైన గురువు సమర్థవంతమైన పాత్ర పోషిస్తుంది. మరిన్ని వివరాల కోసం www.hitam.org, కాల్ / వాట్సాప్: 9248711150, 9248711151 సంప్రదించాలి.

ఉన్నత విద్యే మర్రి లక్ష్మణ్‌రెడ్డి గ్రూప్ ధ్యేయం



- ఇంజనీరింగ్ విద్యలో ప్రభంజనం
- 52 ఎకరాల్లో సువిశాలమైన క్యాంపస్
- ప్రాంగణ నియామకాల్లో ముందంజ
- రూ.58 లక్షల వేతన ప్యాకేజీ..
- కాలేజీకి ఎన్‌బీఏ అండ్ న్యాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు



మర్రి లక్ష్మణ్ రెడ్డి,
చైర్మెన్, ఎంఎల్ఆర్‌జీఐ



మర్రి రాజశేఖర్‌రెడ్డి,
సెక్రటరీ, ఎంఎల్ఆర్‌జీఐ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి ఇంజినీరింగ్ విద్యా బోధనలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో ఉన్న మర్రి లక్ష్మణ్ రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఉన్నత విద్యే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. ఇంజినీరింగ్ విద్యలో ఏడాదికేడాది ప్రభంజనం సృష్టిస్తూ ముందుకు సాగుతోంది. 52 ఎకరాల స్థలంలో సువిశాలమైన క్యాంపస్, అత్యాధునిక సదుపాయాలతో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంలో విద్యనందిస్తోంది. ప్రముఖ విద్యావేత్త, వెటరన్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి 2005లో 'ఎంఎల్ఆర్ఐటీ' (యూజీసీ, అటానమస్), 2009లో మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఐటీఎం' (ఎన్‌బీఏ, న్యాక్ 'ఏ' గ్రేడ్), 2007లో ఎంఎల్ఆర్ఐపీని స్థాపించారు. ఫౌండర్ సెక్రెటరీగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాటి నుంచి నేటి వరకు విద్యా బోధన, ప్రాంగణ నియామకాలు, ర్యాంకుల్లో సత్తా చాటుతూ వస్తోంది.

20 ఏండ్లుగా విద్యా బోధన..

మర్రి లక్ష్మణ్‌రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూటషన్స్ 20 ఏండ్లుగా విద్యార్థులకు కాలేజీ స్థాయిలో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, ఇంజినీరింగ్ విద్యా బోధనలో తనదైన ముద్ర వేసుకుని ప్రఖ్యాతి గాంచింది. నాణ్యమైన ఉన్నత విద్యందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. నిష్ణాతులైన ఫ్యాకల్టీతో బోధనను సాగిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మన్ననలు పొందుతోంది. ఆయా కోర్సుల వారీగా ల్యాబ్‌లను సువిశాలంగా ఏర్పాటు చేయడంతోపాటు.. కాలేజీ ప్రారంభమైన తొలి ఏడాది నుంచే విద్యార్థులకు వందల సంఖ్యలో ప్రాంగణ నియామకాలను అందించి రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద కంపెనీలు ప్రతి ఏటా క్యాంపస్ నియామకాల కోసం ఈ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్స్ క్యాంపస్‌లకు క్యూ కడుతున్నాయి. కొన్నేండ్లుగా పలు కార్పొరేట్ కంపెనీల్లో ఈ ఇనిస్టిట్యూట్స్ విద్యార్థులు సుమారు 6 వేలకుపైగా ఉద్యోగాలు పొందారు. ఈ కళాశాల విద్యార్థులు అత్యధికంగా రూ.58 లక్షల ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ దక్కించుకున్నారు.

కాలేజీ క్రీడలకు నెలవు..

మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్స్‌లో వివిధ క్రీడలు ఆడుకునేందుకు విశాలమైన ఆటస్థలాలు, రవాణా సౌకర్యం, వైద్య సదుపాయం, పార్కింగ్, జిమ్, ఇండోర్ గేమ్స్, క్రికెట్ స్టేడియం ఉన్నాయి. ప్రతియేటా పలు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల ప్రపంచస్థాయి కామన్‌వెల్త్ బాక్సింగ్ క్రీడల్లో రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిన గోల్డ్ మెడలిస్ట్ నిఖత్ జరీన్ ఈ కళాశాల స్టూడెంట్ కావడం విశేషం.

కోర్సుల వివరాలు ఇలా..

బీటెక్‌లో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఏరో), సివిల్, సీఎస్ఈ (డేటా సైన్స్), ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ) ఉన్నాయి. వీటితో పాటు ఎంటెక్ కోర్సుల్లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్, క్యాడ్/క్యామ్, సీఎస్ఈ, డిజిటల్ సిస్టమ్స్ అండ్ కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్, ఈఎస్, ఎస్ఈ, టీఈతో పాటు ఫార్మా ఎంబీఏ కోర్సులను అందిస్తోంది.

ప్రాంగణ నియామకాల్లో ముందంజ

మర్రి లక్ష్మణ్‌రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే ప్రాంగణ నియామకాల్లో ముందు వరుసలో నిలుస్తూ వస్తోంది. ప్రతియేటా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించడంలో మెరుగు చూపుతూ వస్తోంది. ఏటా నిర్వహించే ప్రాంగణ మౌఖిక పరీక్షల్లో మర్రి లక్ష్మణ్ రెడ్డి కళాశాల విద్యార్థులు 1275 ప్లస్ కుపైగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. దేశ విదేశాల్లో నెలకొన్న పెద్ద కంపెనీల్లో వేలాది మంది ఈ కాలేజీ విద్యార్థులే పని చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇంజినీరింగ్ విద్యలో ప్రతి ఏడాదీ రారాజుగా నిలవడంలో సంస్థ వ్యవస్థాపకులు, చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి, సెక్రెటరీగా మర్రి శ్రేయారెడ్డి కీలకంగా వ్యవహరించడంతోపాటు డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు (ప్రిన్సిపాల్, ఎంఎల్ఆర్ఐటీ), పి.శ్రీధర్ (డైరెక్టర్, మర్రి లక్ష్మణరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్), డాక్టర్ ఎన్.జ్యోతి (ప్రిన్సిపాల్, ఎంఎల్ఆర్ఐపీ) కాలేజీని ముందంజలో నిలుపడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు.

నాణ్యమైన విద్యకు కేరాఫ్ 'సీఎంఆర్'

- ప్లేస్‌మెంట్లలో 'సీఎంఆర్' విద్యాసంస్థలు అగ్రగ్రామి
- పలు దిగ్గజ సంస్థలతో ఎంఓయూ
- అత్యధిక ప్యాకేజీ రూ.58 లక్షలు
- 22 ఏండ్ల అపార అనుభవం
- 75 ఎకరాల్లో సువిశాలమైన ప్రాంగణం
- నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు
- వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజినీరింగ్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తూ.. ఉద్యోగ కల్పనకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి 'సీఎంఆర్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థలు. ఇంజినీరింగ్ విద్యలోనే నూతన ఒరవడితో ముందుకు దూసుకెళ్తున్నాయి. విజ్ఞానానికి, విద్యా సంపదకు నెలవైన సీఎంఆర్' గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, మేడ్చల్ నియోజకవర్గం కండ్లకోయలో 75 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదాన్నిచ్చే వాతావరణంలో 2002లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే, ఫౌండర్ చైర్మెన్, చామకూర మల్లారెడ్డి స్థాపించారు. ఈ సంస్థకి మల్లారెడ్డితో పాటు వారి సోదరులు వైస్ చైర్మెన్‌గా చామకూర నర్సింహారెడ్డి, చైర్మెన్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్‌గా చామకూర గోపాల్‌రెడ్డి సౌజన్యంతో కొనసాగుతోంది. అనతి కాలంలోనే విద్యారంగంలో పేరు ప్రతిష్టలు గడించిన ఈ సంస్థ పరిధిలో ఐదు కాలేజీలు, మెడికల్ సైన్సెస్ ఉన్నాయి. 2002లో సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, 2005లో సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలేజీ, 2005లో సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, 2009లో సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్, 2010లో సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలను నెలకొల్పారు. సీఎంఆర్ విద్యాసంస్థలు 22 ఏండ్లుగా విద్యారంగంలో సంచలనాలను సృష్టిస్తూ అగ్రగామిగా పేరు గడించాయి. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులకు గతేడాది ప్రాంగణ నియామకాల్లో అత్యధికంగా రూ.58 లక్షల ప్యాకేజీ పొందడం విశేషం. కళాశాలలో ఏడాది యావరేజీగా రూ.6 లక్షలకు తగ్గకుండా ప్యాకేజీ దక్కడం గొప్ప విశేషం. ఈ కళాశాలలో చదివిన వారిలో 25వేలకు పైగా విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందుకున్నారు. 2023-24లో 2,500 మంది ప్లేస్‌మెంట్స్ పొందారు. సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ కళాశాలలో 30 వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సీఎంఆర్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్‌ను ప్రారంభించి పేద విద్యార్థులు, ప్రజలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నారు. ఇక్కడ పట్టా పుచ్చుకున్న వారిలో చాలామంది వివిధ పారిశ్రామిక, ఐటీ రంగాలతో పాటు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. మరికొందరు విదేశాల్లో స్థిరపడ్డారు.



సీహెచ్ మల్లారెడ్డి, ఫౌండర్ చైర్మెన్, సీఎంఆర్‌జీఐ



సీహెచ్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మెన్, సీఎంఆర్‌జీఐ,



సీహెచ్ గోపాల్ రెడ్డి, చైర్మెన్ సీఎంఆర్ఐజీ

సీఎంఆర్ గ్రూప్ అందించే కోర్సులు

ఇంజినీరింగ్, మెడికల్ సైన్స్, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఫార్మసీ, ఫిజియోథెరపీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్టీ, బీఎస్సీ అనస్థీషియా టెక్నాలజీ, న్యూరో సైన్స్ టెక్నాలజీ, క్రిటికల్ కేర్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూజీసీ అటానమస్, ఎన్బీఏ, న్యాక్ గుర్తింపు పొందింది. ఇందులో విద్యనభ్యసించేందుకు దేశ విదేశాల నుంచి ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడున్న ఫ్యాకల్టీ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చేస్తున్న కృషి అమోఘం. స్టూడెంట్స్, సిబ్బంది, ఫ్యాకల్టీ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నారు. సామాజిక, సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాల్లోనూ కళాశాల విద్యార్థులు రాణిస్తున్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు మానవతా ధృక్పథంతో బ్లడ్ డొనేషన్ కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి బాసటగా నిలుస్తున్నారు.

నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు

నైపుణ్యత కలిగి కాంపిటీషన్లను తట్టుకుని నిలబడే శక్తి సామర్థ్యాలను ఇక్కడ విద్యార్థులకు అందిస్తున్నారు. సమర్థులైన ఇంజినీర్లను తీర్చిదిద్ది సమాజంలో వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు బాటలు వేస్తున్నారు. కేవలం 22 ఏండ్ల కాలంలోనే దాదాపు 25 వేలకు పైగా ప్లేస్‌మెంట్స్‌తో అత్యధికంగా రూ.58 లక్షల ప్యాకేజీతో అవకాశాలు కల్పించిన ఏకైక విద్యాసంస్థ సీఎంఆర్ గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ అనే చెప్పాలి. బెస్ట్ ప్లేస్‌మెంట్ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. ఐదు కళాశాలలకు యూజీఎస్‌సీ అటానమస్ ఎస్ఆర్ఎఫ్ గుర్తింపు లభించింది. ఏటా వెలువడే ఇంజినీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ ఫలితాల్లో సీఎంఆర్ఎఫ్ విద్యాసంస్థలు సత్తా చాటుతున్నాయి. ఉన్నత చదువుతో చక్కటి విలువలు కలిగిన ఫ్యాకల్టీతో విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలు కలిగిన చదువులను అందించడం ద్వారా, ఇక్కడి విద్యార్థులు చక్కటి అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయడంతోపాటు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో సీఎంఆర్ గ్రూప్స్ ముందంజలో ఉంటున్నాయి.

అధునాతన ప్రయోగశాలలు

ఈ కళాశాలలో అధునాతన సౌకర్యాలు కలిగిన ప్రయోగశాలలు విద్యార్థులు ఇంజినీరింగ్‌లో ప్రత్యేక సత్తా చాటేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. విశాలమైన క్రీడా స్థలాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలతోపాటు సెమినార్ల కళాశాలలో ఉన్నాయి. ప్రమాణాలు కలిగిన చదువులను అందించడం ద్వారా, ఇక్కడి విద్యార్థులు చక్కటి అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తూ ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయడంతోపాటు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో సీఎంఆర్ గ్రూప్స్ ముందు వరుసలో ఉంటోంది. అధునాతన సౌకర్యాలు, ప్రయోగశాలలు విద్యార్థులు ఇంజినీరింగ్‌లో ప్రత్యేక సత్తా చాటేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. విశాలమైన క్రీడా స్థలాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలతోపాటు సెమినార్ల నిర్వాహణకు ప్రత్యేక హాళ్లను ఏర్పాటు చేశారు.

కళాశాల ప్రత్యేకతలు

1. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, సువిశాల క్యాంపస్
2. క్యాంపస్ ప్లేస్‌మెంట్, ఇంజినీరింగ్‌లో రాణించిన వారికి ప్రత్యేక ప్రోత్సాహం
3. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించడం
4. విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లలో సపోర్టు ఇవ్వడం
5. నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం
6. ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల భవిష్యత్‌కు పునాది
7. విద్యారంగంలో ఉత్తమ ఫలితాలతో ముందుకు
8. సులభమైన రవాణా సౌకర్యం
9. 24 గంటలు వైద్య సదుపాయం
10. విశాలమైన తరగతి గదులు

తేనెతో ఇలా...

తేనెలో ఔషధ గుణాలు బోలెడున్నాయి. దానికి తోడు అదిరిపోయే రుచి. అది ఎనర్జీని కూడా ఇస్తుంది. అలాంటి తేనె ఉపయోగాలేమిటో తెలుసుకుందాం.



- దగ్గు వస్తోందా ఓ టీస్పూన్ తేనెను నిమ్మరసంలో కలిపి తాగండి. ఇక దగ్గు మటాష్. పగటి వేళల్లో తేనె, పాలు కలిపి తాగితే.. శరీర అలసట తగ్గుతుంది. ఎనర్జీ పెరుగుతుంది.
- శరీరంలో ఎక్కడైనా గాయాలుంటే.. తేనెను అక్కడ రాసి, నెమ్మదిగా మసాజ్ చెయ్యాలి. తేనె సహజమైన యాంటీబయోటిక్. రోజూ గాయంపై రాస్తుంటే, ఆటోమేటిక్‌గా నయమై పోతుంది. కాలిన గాయాల మీద తేనెను రాయాలి. అంతే.. మచ్చ కూడా లేకుండా గాయం మాయమవుతుంది.
- ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారా.. మీరు తాగే టీలో ఓ స్పూన్ తేనె కలపండి.. టేస్ట్ ఆస్వాదిస్తూ తాగండి.. టెన్షన్ పరార్.

తినరా మైమరచి...

దోశ అంటే ఇష్టపడని వారుండరు... దీనిని వివిధ రకాలుగా తయారు చేసుకుంటూ ఉంటారు. ఉల్లి దోశ, మసాల దోశను తినేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. రోజూ తినే సాధారణ దోశలే కాకుండా.. పాలకూర, కొత్తిమిర, పుదీన, కరివేపాకుతోపాటు, జొన్నలు, స్వీట్‌కార్న్, పన్నీర్ వంటి వాటిని ఉపయోగించి వెరైటీ దోశలను చేసుకోవచ్చు. ఇవి శరీరానికి పోషకాలు అందించటమే కాకుండా... ఎంతో రుచిగానూ ఉంటాయి. ఇలాంటి ఆరోగ్యకరమైన దోశల రెసిపీలు నేటి మానవిలో...



పాలకూరతో..

పాలకూరలో ఉండే ఐరన్, కాల్షియం, విటమిన్లు వంటి పోషకాలు శరీరానికి బోలెడు లాభాలను అందిస్తాయి. అంతేకాకుండా ఇందులో ఫైబర్ కూడా లభిస్తుంది. ఇది శరీర బరువు, రక్తపోటును అదుపులో ఉంచేందుకూ కీలక పాత్ర పోషిస్తుంది.

కావలసిన పదార్థాలు : దోశ పిండి - నాలుగు కప్పులు, పాలకూర - రెండు కప్పులు, పచ్చిమిర్చి - నాలుగు, చిన్న అల్లం ముక్క, దోసెలు



వేసేందుకు - నెయ్యి లేదా నూనె, పసుపు - కొద్దిగా, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నెను స్టౌవ్‌పై పెట్టుకుని నాలుగు కప్పుల నీరు పోసి వేడు చేసుకోవాలి. అందులో పసుపు పొడి వేసి బాగా మరిగించాలి. నీరు మరుగుతుండగా.. అందులో శుభ్రంగా కడిగిన పాలకూర, పచ్చి మిర్చి అల్లం వేసి 3 నుంచి 4 నిమిషాలు ఉడికించాలి. ఉడికిన తర్వాత నీటి నుంచి పాలకూరను తీసి చల్లారనివ్వాలి. ఆ తర్వాత పాలకూర, పచ్చి మిరపకాయలు, అల్లంను మెత్తని పేస్టులాగా మిక్సీ వేసుకోవాలి. ఈ పేస్టును దోశ బ్యాటర్‌లో వేసి బాగా కలపాలి. పిండిని బాగా కలిపిన తర్వాత పెనం వేడి చేసి, 1/2 టీస్పూన్ నెయ్యి లేదా నూనె వేసి దోశను వేసుకొవాలి. దోశ లేత గోధుమ రంగు వచ్చేంత వరకు రోస్ట్ చేసుకోవాలి. అంతే పాలక్ దోశ రెడీ! మీకు నచ్చిన చట్నీతో సర్వ్ చేసుకోండి.

జొన్న పిండితో..

జొన్న పిండి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నిజానికి డయాబెటిస్ బారిన పడినవారు సాధారణ దోశల కంటే జొన్న పిండితో చేసిన దోశలు తినడం చాలా మంచిది. ఈ జొన్న దోశలు క్రిస్పీగా రుచిగా ఉంటాయి. దీన్ని ఎప్పటికప్పుడు ఇన్‌స్టెంట్‌గా తయారు చేసుకోవచ్చు.

కావలసిన పదార్థాలు : జొన్న పిండి - అరకప్పు, బియ్యంపిండి - పావు కప్పు, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు.

తయారీ విధానం : ముందుగా ఒక గిన్నెలో జొన్న పిండిని తీసుకోవాలి. ఉండలు కట్టకుండా బాగా కలుపుకోవాలి. అందులోనే బియ్యంపిండిని కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు నీళ్ల పోసుకుని దోశలు వేయడానికి సరిపడేలా పలుచగా ఉండేటట్టు పిండిని అడ్జస్ట్ చేసుకోవాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఈ మిశ్రమంలోనే సన్నగా



తరిగిన ఉల్లిపాయలు, సన్నగా తరిగిన కొత్తిమీర, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర, కరివేపాకు తరుగు వేసి బాగా కలుపుకోవాలి. ఒక పది నిమిషాలు పక్కన పెట్టాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనాన్ని పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక ఈ పిండిని దోశలాగా పలచగా వేసుకోవాలి. రవ్వ దోశలు ఎలా వేస్తారో అలా పలుచగా వేసుకుంటే ఇవి క్రిస్పీగా వస్తాయి. రెండు వైపులా ఎర్రగా కాలాక కొబ్బరి చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.

సోయాతో..

డయాబెటిక్ పేషెంట్ల కోసం కొన్ని ప్రత్యేక బ్రేక్ ఫాస్ట్ రెసిపీలు ఉన్నాయి. అందులో సోయా దోశ ఒకటి. దీన్ని తినడం వల్ల శక్తి వస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. పైగా రుచిగా కూడా ఉంటుంది. దీన్ని చేయడానికి ఎక్కువ సమయం కూడా పట్టదు.

కావలసిన పదార్థాలు : సోయా పాలు - ఒక కప్పు, కొత్తిమీర తరుగు - ఒక స్పూను, ఉప్పు - రుచికి సరిపడా, పచ్చిమిర్చి తరుగు - ఒక స్పూను, ఉల్లిపాయ తరుగు - అరకప్పు, నూనె - సరిపడినంత, గోధుమపిండి - పావు కప్పు, బేకింగ్ సోడా - చిటికెడు,

తయారీ విధానం : ఒక గిన్నెలో గోధుమపిండి, సోయా పాలు వేసి బాగా కలపాలి. సన్నని పచ్చిమిర్చి తరుగు, ఉల్లిపాయ తరుగు,



కొత్తిమీర తరుగు, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. కొద్దిగా నీళ్ళను వేసి దోశ పిండిలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంటపాటు నాననివ్వాలి. పెనం మీద రవ్వ దోసెలా వేసుకొని రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. దీన్ని కొబ్బరి చట్నీతో, టమాటో చట్నీ, సాంబార్.. .ఇలా దేనితో తిన్నా చాలా టేస్టీగా ఉంటుంది.

స్వీట్ కార్న్‌తో

స్వీట్ కార్న్ మార్కెట్లో అధికంగానే లభిస్తుంది. దీన్ని చేయడం చాలా సులువు. పిల్లలు ఇష్టంగా తింటారు. ఎప్పుడు ఒకేలాంటి దోశ తిని బోర్ కొట్టిన వారికి ఈ స్వీట్ కార్న్ దోశ నచ్చడం ఖాయం. దీన్ని సులువుగా ఎలా చేయాలో చూద్దాం.

కావలసిన పదార్థాలు : బియ్యం - ఒక కప్పు, స్వీట్ కార్న్ - ఒక కప్పు, జీలకర్ర - కొద్దిగా, పచ్చిమిర్చి - నాలుగు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ విధానం : బియ్యాన్ని నాలుగు గంటల పాటు ముందుగానే నానబెట్టుకోవాలి. తర్వాత మిక్సీలో ఆ బియ్యాన్ని వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అందులోనే స్వీట్ కార్న్, జీలకర్ర, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పును కూడా వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. దీన్ని పావుగంట సేపు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. ఈ పిండిని దోశలాగా



వేసుకోవటమే. రెండు వైపులా ఎర్రగా కాల్చుకొని సర్వ్ చేసుకోవాలి. టమాటా చట్నీతో, పల్లీల చట్నీతో తింటే చాలా బాగుంటుంది. పిల్లలకు ఇది మంచి బ్రేక్ ఫాస్ట్ రెసిపీ.

కొత్తిమీర, పుదీనాతో

కొత్తిమీర, పుదీనా, కరివేపాకులతో చేసే దోశ ఇది. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. హై బీపీతో బాధపడేవారు, డయాబెటిస్‌తో బాధపడేవారు కూడా ఈ దోశ తినవచ్చు. ఒకసారి దీన్ని చేసుకొని తిని చూడండి. ఇంటిల్లిపాదికి నచ్చుతుంది.

కావాల్సిన పదార్థాలు : కొత్తిమీర తరుగు - ఒక కప్పు, పుదీన - ఒక కప్పు, కరివేపాకులు తరుగు - అరకప్పు, బియ్యం - ఒక కప్పు, మినపప్పు - పావు కప్పు, మెంతులు - కొద్దిగా.

తయారీ విధానం : బియ్యం,



మినపప్పు, మెంతులు నాలుగైదు గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత వాటిని గ్రైండర్లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఆ మిశ్రమాన్ని తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. ఇప్పుడు కొత్తిమీర, పుదీనా, కరివేపాకులని మిక్సీ జార్లో వేసి మెత్తగా రుబ్బి... ఆ మిశ్రమాన్ని కూడా అందులో కలిపేయాలి. రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలపాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. దోశ పిండిలో జీలకర్ర వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయాలి. దానిపై దోశెలు వేసుకోవాలి. పైన ఉల్లిపాయ, పచ్చిమిర్చి తరుగును చల్లుకోవాలి. అంతే టేస్టీ గ్రీన్‌తో సహా రెడీ అయినట్టే. కొత్తిమీర, పుదీనా, కరివేపాకులు అధికంగా వేసాము. కాబట్టి ఇది ఆకుపచ్చని రంగులో వస్తుంది. ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది.

పాలు విరిగిపోతున్నాయా.?

పాలు లేనిదే రోజు గడవదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఉదయం లేవగానే ఇంట్లో పాలు ఉంటేనే పని ముందుకు సాగుతుంది. అప్పుడప్పుడు పాలు విరిగిపోతూ వుంటాయి. మనలో చాలా మంది ఇలాంటి సమస్యను ఎదుర్కొంటూనే వుంటాం. అయితే కొన్ని సహజ చిట్కాలు పాటించడం ద్వారా పాలు విరిగిపోకుండా చూసుకోవచ్చు.

పాలు విరిగిపోకుండా ఉండాలంటే ఎక్కువసార్లు వేడి చేయాలి. ముఖ్యంగా పశువుల నుంచి పాలు పితికిన కొద్ది గంటలకు వేడి చేయకపోతే... విరిగిపోతుంటాయి.



కాబట్టి పాలు పితికిన వెంటనే వేడి చేసుకోవటం మంచిది.

ఇక వేడి చేసిన పాలు చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో స్టోర్ చేయాలి. ఇలా చేస్తే పాలు విరగకుండా ఉంటాయి. ఫ్రిజ్ లేనివారు అయితే ప్రతీ ఆరేడు గంటలకు ఒకసారి పాలను వేడి చేసుకోవాలి. ఇలా చేస్తే పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఇక వేడి చేసిన తర్వాత పాలను గాలి చొరబడకుండా ఉండేలా బాటిల్స్ లేదా ఎయిర్ టైట్‌గా వుండే బాక్సుల్లో స్టోర్ చేయాలి. ఇలా చేయడం వల్ల కూడా పాలు విరిగిపోకుండా ఉంటాయి.

ఈ టిప్ అందరికీ తెలిసిందే. పాలను వేడి చేసే ముందు ఒక చిటికెడు బేకింగ్ సోడా వేసుకుని మరిస్తే పాలు విరగవు.

పాలను ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే సమయంలో టెంపరేచర్ 32 డిగ్రీల ఫారన్‌హీట్ నుంచి 39.2 డిగ్రీల ఫారన్‌హీట్ మధ్యలో ఉండేలా చూడాలి. ఇలా చేస్తే పాలు చల్లగా ఉండి పగలకుండా వుంటాయి.

సహకార బలోపేతానికి కొత్త అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

కాదని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. సమస్యలకు పరిష్కారాలు యుద్ధ రంగంలో లభించవన్నారు. చర్చలు, దౌత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని నొక్కి చెప్పారు. తీవ్రవాదం ఏ రూపంలో వున్నా ఆమోదయోగ్యం కాదని, ఏ రకంగానూ దాన్ని సమర్థించలేమని మోడీ పేర్కొన్నారు. గత 40ఏండ్లలో భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రక్రియకు సంబంధించి చూసినట్లైతే భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కావాలంటే తటస్థ దేశంగా తమ దేశంలో చర్చలు జరుపుకోవచ్చని నెహమార్ పేర్కొన్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై కూలంకషంగా చర్చించామని చెప్పారు. ఈ యుద్ధంపై యురోపియన్ దేశాల ఆందోళనలు, ఇబ్బందులను భారత్‌కు తెలియచేసినట్టు చెప్పారు. అలాగే పశ్చిమాసియాలో ఘర్షణలపై కూడా సుదీర్ఘంగా చర్చించామన్నారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అందువల్ల శాంతి ప్రక్రియలు, భవిష్యత్ శాంతి సదస్సులకు సంబంధించి భారత్‌ది చాలా కీలకమైన పాత్ర అని నెహమార్ చెప్పారు.

ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ ప్రతినిధులతో సీఎం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్‌నేషనల్ స్పిరిట్స్, వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ) ప్రతినిధులతో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఇతర అంశాలపై సీఎం వారితో చర్చించారు. ఐఎస్‌డబ్ల్యూఏఎస్ఐ అనే సంస్థ జాతీయ, అంతర్జాతీయ ప్రీమియం స్పిరిట్స్, వైన్ బ్రాండ్‌లను తయారు చేసే కంపెనీలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో కొత్తగా పలు లిక్కర్ కంపెనీలకు ఇటీవల అనుమతివ్వడం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో వాటికి ప్రాతినిధ్యం వహించే సంఘం సీఎంను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. త్వరలో రాష్ట్రంలో మరిన్ని కొత్త లిక్కర్ కంపెనీలు తమ పెట్టుబడులను పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు

వారూ భరణానికి అర్హులే

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు బుధవారం చారిత్రక తీర్పు ఇచ్చింది. ఏ మతం వారైనా విడాకులు తీసుకున్న మహిళలు సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 ప్రకారం భరణం పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీలోని 'రెలిజియస్ న్యూట్రల్' సెక్షన్ ప్రకారం ముస్లిం మహిళలు తన భర్త నుండి భరణం కోరవచ్చునని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌తో కూడిన డివిజన్ బెంచ్ తెలిపింది. న్యాయమూర్తులు వేర్వేరుగా తీర్పును రాసినప్పటికీ ఒకే విధమైన తీర్పు ఇచ్చారు. భరణం కోరేందుకు భార్యకు హక్కు ఉన్నదని ఈ నెల 1వ తేదీకి ముందు అమలులో ఉన్న సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 చెబుతోంది. ఈ సెక్షన్ ముస్లిం మహిళలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు తాజాగా తేల్చి చెప్పింది.

తీర్పులో ఏముంది?

'కేవలం వివాహిత మహిళలకు మాత్రమే కాకుండా సీఆర్‌పీసీ సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుంది. అందువల్ల క్రిమినల్ అప్పీలును తిరస్కరిస్తున్నాము' అని తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ నాగరత్న తెలిపారు. భరణం అనేది దాతృత్వం కాదని, అది వివాహిత మహిళలందరి హక్కు అని, మతం ఏదైనా వివాహిత మహిళలందరికీ అది వర్తిస్తుందని డివిజన్ బెంచ్ వివరించింది.

1986వ సంవత్సరపు ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం సెక్యులర్ చట్టాన్ని అతిక్రమించదని తెలిపింది. భారతీయ వివాహిత మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదన్న వాస్తవాన్ని గుర్తించాలని అంటూ కాబట్టి తన భార్యకు ఆర్థిక మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత భర్తదేనని పేర్కొంది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 వివాహిత మహిళలకే కాకుండా సహజీవనం సాగిస్తున్న వారితో సహా మహిళలందరికీ వర్తిస్తుందని చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద పిటిషన్ పెండింగులో ఉన్న సమయంలో ముస్లిం మహిళ విడాకులు తీసుకుంటే సదరు మహిళ సెక్షన్ 125 ప్రకారం కోర్టులో కేసును కొనసాగిస్తూనే 2019 నాటి ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) చట్టం కింద కూడా కోర్టును ఆశ్రయించవచ్చునని తెలిపింది.

కేసు పూర్వాపరాలు

పోషణకు సంబంధించి కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో దానిని సవాలు చేస్తూ మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ సీఆర్‌పీసీలోని

సెక్షన్ 125 ప్రకారం భరణం కోరేందుకు అర్హురాలు కాదని సమద్ వాదించారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాసిం ఖాద్రీ వాదనలు విన్న అనంతరం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసులో న్యాయస్థానానికి సాయపడేందుకు గౌరవ్ అగర్వాల్‌ను అమికస్ క్యూరీగా నియమించింది.

సమద్ తన మాజీ భార్యకు భరణాన్ని ఇవ్వాల్సిందేనని కుటుంబ న్యాయస్థానం తీర్పు చెప్పింది. అయితే తాత్కాలిక నెలసరి భరణాన్ని రూ.20 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. పిటిషన్ దాఖలు చేసిన తేదీ నుండి ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది. దీనిపై సమద్ తెలంగాణ హైకోర్టుకు వెళ్లగా గత సంవత్సరం డిసెంబర్ 13న ఈ ఆదేశాలను న్యాయస్థానం కొట్టివేయలేదు. 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు తీసుకున్నామని, ఇందుకు సంబంధించి విడాకుల సర్టిఫికెట్ కూడా ఉన్నదని, అయితే దీనిని కుటుంబ న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టులో సమద్ వాదించారు.

డీజీపీగా జితేందర్

(మొదటిపేజీ తరువాయి)

ఏఎస్పీగా ఆయన తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బెల్లంపల్లి ఏఎస్పీగా, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ రేంజ్ డీఐజీగా, సీఐడీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జైళ్ల శాఖ అధిపతిగా, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా, రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా వివిధ హోదాల్లో బాధ్యతలను నిర్వహించి సమర్థుడైన పోలీసు అధికారిగా పేరు పొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహించారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా డాక్టర్ రవిగుప్తా సచివాలయానికి వెళ్లి బాధ్యతలను స్వీకరించారు. డీజీపీగా నియమితులైన సమయంలో ఆయన ఇదే శాఖలో ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆరు నెలల్లో రాష్ట్ర డీజీపీగా ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పనిచేశారు.

నేరరహిత రాష్ట్రమే లక్ష్యం : కొత్త డీజీపీ

తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమనీ, ఆ దిశగా రాష్ట్ర పోలీసు శాఖను ముందుకు నడిపిస్తానని కొత్త పోలీసు బాస్ జితేందర్ అన్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టాక ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో శాంతిని సుస్థిరంగా నెలకొల్పేలా తన చర్యలుంటాయని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. ముఖ్యంగా సైబర్‌నేరాలు, మాదకద్రవ్య పదార్థాల రవాణా, వినియోగం పెద్ద సవాలుగా మారిందనీ, వాటిని అరికట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసు శాఖ సమిష్టి బాధ్యతతో నడిచేలా చర్యలు తీసుకుంటాననీ, మాదకపదార్థాల నిరోధానికి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉన్నప్పటికీ దాంతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని చెప్పారు. మావోయిస్టుల కార్యకలాపాలు రాష్ట్రంలో దాదాపు లేకుండా సమసిపోయాయనీ, అయినప్పటికీ ప్రభావిత రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ఆ సమస్యపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన సచివాలయానికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఓయూలో కొనసాగుతున్న ఆందోళనలు

సీఎం దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్‌వీ నాయకుల యత్నం

అరెస్టు చేసిన పోలీసులు

జర్నలిస్టు పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన

ఓయూ పోలీస్ స్టేషన్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధుల నిరసన

నవతెలంగాణ- ఓయూ

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఓయూలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనల నేపథ్యంలో బుధవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కవరేజ్‌కు వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌పై పోలీసుల దురుసుగా ప్రవర్తించడంతో కాస్త ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుద్యోగ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు కవరేజీకి వెళ్లిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ శ్రీచరణ్ పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ అరెస్టు చేయడంతో యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మీడియా పత్రినిధుల పట్ల పోలీసుల వైఖరిని నిరసిస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు ఓయూ పోలీస్ స్టేషన్ ముందు బైటాయించి ఆందోళన చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థుల పట్ల, మీడియా ప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఏఐఎస్ఎఫ్. పీడీఎస్‌యూ, టీజీవీపీ, ఓయూ జేఏసీ, బీఆర్ఎస్‌వీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, వర్సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం.. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కులను, స్వేచ్ఛను కాలరాయడమేనని, జర్నలిస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని పలువురు విద్యార్థులు విద్యార్థి సంఘాల ప్రతినిధులు అన్నారు.

లీకు వీరుడు బేడీ రామ్

(మొదటిపేజీ తరువాయి)

బ్రజేష్ పాఠక్, కేశవ్ ప్రసాద్ మౌర్యలతో సహా సీనియర్ బీజేపీ నాయకులతో కలిసి ఉన్న ఆయన ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. "మీకు ఏదైనా విభాగంలో ఉద్యోగం కావాలంటే, ఫారమ్ నింపిన తర్వాత బేడీ రామ్‌కి కాల్ చేయండి. ఆయన కొంత వరకు పరిష్కరించటం ఖాయం" అని ఎస్‌బీఎస్‌పీ చీఫ్ ఓ.పి రాజ్‌భర్ చెప్తున్నట్టుగా ఒక వీడియోలో ఉన్నట్టు ఒక ఆంగ్ల వార్త కథనం వివరించింది.

హిస్టరీ షీట్ ప్రకారం బేడీ రామ్‌పై లక్నోలో నాలుగు, జౌన్‌పూర్‌లో రెండు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రెండు, రాజస్థాన్‌లో ఒక కేసులు ఉన్నాయి. ఆయనపై వచ్చిన అభియోగాలలో ఐపీసీలోని సెక్షన్ 419, 420, 468, 120బి(నేరపూరిత కుట్ర)ల కింద కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు బేడీ రామ్‌పై ఈ కింది అభియోగాలు కూడా నమోదయ్యాయి.

రాజస్థాన్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1992లోని సెక్షన్లు 4,6(ప్రశ్నపత్రాన్ని అనధికారికంగా కలిగి ఉండటం లేదా బహిర్గతం చేయటం), యూపీ-గ్యాంగ్‌స్టర్ చట్టం, 1986లోని సెక్షన్‌లు 2,3(నేరం చేయడానికి ముందు లేదా తర్వాత ముఠా సభ్యునికి చట్టవిరుద్ధంగా సహాయం చేసిన లేదా మద్దతు ఇచ్చిన పబ్లిక్ సర్వెంట్‌కు శిక్ష), ఉత్తరప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) చట్టం, 1998లోని సెక్షన్లు 3,4,5,9,10(అనధికారికంగా స్వాధీనం చేసుకోవడం, ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, పరీక్షా పనిని అప్పగించిన వ్యక్తి ద్వారా లీకేజీ, రెండింటికీ జరిమానాలు, అన్యాయమైన మార్గాలు, వనరుల వినియోగం వంటివి ఉన్నాయి.

2022లో రిటర్నింగ్ అధికారికి సమర్పించిన బేడీ రామ్ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. ఈ కేసులు రాజస్థాన్, లక్నోలో రైల్వే రిక్రూట్‌మెంట్ పరీక్షలు, భోపాల్‌లో ఎంపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలు, జౌన్‌పూర్‌లో పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించినవి. 2006 నుంచి 2016 మధ్య ఆయనపై ఈ కేసులు నమోదయ్యాయి. 2006లో రైల్వే ఎగ్జామ్ లీక్ కారణంగా బేడీ రామ్, మరో 15 మంది అరెస్టయ్యారు. 2006 సంవత్సరంలో, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఆర్ఆర్‌బీ) భారత్ అంతటా మూడు దశల్లో గ్రూప్-డి రిక్రూట్‌మెంట్ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించింది. రెండో దశ పరీక్ష 26 ఫిబ్రవరి 2006న జరగాల్సి ఉంది. అయితే, కొంత మంది ఈ ప్రశ్నపత్రాన్ని సంపాదించినట్టు పోలీసు అధికారి భగత్‌కు సమాచామందింది. అనంతరం నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేపర్ లీకైనట్టు గమనించిన రైల్వే బోర్డు పరీక్షను రద్దు చేసింది. దాదాపు 16 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. బేడీ రామ్ సహా 16 మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, అడ్మిట్ కార్డుల నకలు, ప్రశ్నపత్రం కాపీలు స్వాధీనం చేసుకున్నారు. 'గ్యాంగ్ లీడర్' బేడీరామ్‌ను విచారించినప్పుడు.. ప్రతి అభ్యర్థి నుంచి రూ. 1-1.5 లక్షలు తీసుకున్నట్టు ఒప్పుకున్నాడు.

'బేడీ రామ్‌పై చట్టపరమైన చర్యలు అవసరం'

రైల్వే లోకో పైలట్ పరీక్షలో పేపర్ లీకైందన్న ఆరోపణలపై బేడీ రామ్‌ను 2014, జులై 17న లక్నో నుంచి స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) అరెస్టు చేసింది. యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఆ సమయంలో మాట్లాడుతూ.. "బేడీ రామ్ లొసుగులను ఉపయోగించుకోవటంలో నిపుణుడు. ఆయనకు రైల్వేలో బలమైన సంబంధాలున్నాయి. పరీక్షా పత్రాలను ప్రచురించటానికి టెండర్లు పొందిన ప్రింటింగ్ హౌస్‌ల గురించి ఆయనకు అవగాహన ఉన్నది" అని చెప్పారు.

'ఎంపీపీఎస్సీ, ఛత్తీస్‌గఢ్ పీఎంటీ పేపర్ లీక్‌లో బేడీ రామ్ పేరు'

మీడియా నివేదికల ప్రకారం.. బేడీ రామ్ 2006లో పేపర్ లీక్ కేసులో అరెస్టయిన తర్వాత సర్వీస్ నుంచి తొలగించబడే వరకు రైల్వే ఉద్యోగి(చీఫ్ టిక్కెట్ కలెక్టర్). 2008లో ఆర్ఆర్‌బీ లోకో పైలట్ పరీక్ష, 2009లో భోపాల్, జైపూర్‌లలో జరిగిన రైల్వే పరీక్షల ప్రశ్న పత్రాలను లీక్ చేసినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. 2013లో ఎంపీపీఎస్సీ, 2014, మేలో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఆయుర్వేద వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేయడంలో బేడీ రామ్ పేరు కూడా వినిపించింది. ఆయుర్వేద పరీక్ష రద్దు కాగా, ఎంపీపీఎస్సీ పరీక్షకు సంబంధించిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. బేడీ రామ్ ఒక్కో అభ్యర్థి రూ.30-40 లక్షలకు పేపర్లు విక్రయించినట్టు సమాచారం. 2012లో ఎంపీపీఎస్సీ ప్రశ్నపత్రాలను బీహార్‌కు చెందిన ముఠా ప్రింటింగ్ ప్రెస్ ద్వారా లీక్ చేసి 50 మంది అభ్యర్థులకు విక్రయించినట్టు మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో తేలింది. బీహార్ గ్యాంగ్‌కు యూపీలో ఉన్న బేడీ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నదని కొన్ని వార్త కథనాలు ఆరోపించాయి. 2011లో ఛత్తీస్‌గఢ్ పోలీసులు రాష్ట్ర పరీక్షా బోర్డు నిర్వహించిన ప్రీ-మెడికల్ టెస్ట్(పీఎంటీ) ప్రశ్నపత్రాలు లీక్ కావటంతో కేసు నమోదు చేశారు. 2015లో ఛత్తీస్‌గఢ్ కోర్టు 'కింగ్‌పిన్' బేడీరామ్‌తో సహా ఐదుగురు నిందితులను దోషులుగా నిర్ధారించి ఆరేండ్ల జైలు శిక్ష విధించింది. అయితే, అప్పుడు బేడీ రామ్ పరారీలో ఉన్నాడు. 2016 మే 25న మధ్యప్రదేశ్ ఎస్టీఎఫ్ గుర్గావ్ నుంచి ఆయనను అరెస్టు చేసింది.

'బేడీ రామ్‌పై ఆరోపణలు నకిలీ, నిరాధారం': ఎస్‌బీఎస్‌పీ

ఢిల్లీ పీఎంటీ పేపర్ లీక్ కేసులో బేడీ రామ్‌ను సీబీఐ 2012లో అరెస్టు చేసినట్టు యూపీ ఎస్టీఎఫ్ అధికారి త్రివేణి సింగ్ ఒక ఆంగ్ల వార్త సంస్థకు తెలిపారు. బెయిల్‌పై విడుదల కాకముందే తీహార్ జైలుకు తరలించినట్టు సమాచారం. అయితే, 2022 ఎన్నికల అఫిడవిట్‌లో బేడీ రామ్ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.బేడీ రామ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బేడీ రామ్‌పై వచ్చిన ఆరోపణలన్నీ అబద్ధాలు, నకిలీ, నిరాధారమైనవని ఎస్‌బీఎస్‌పీ జాతీయ అధికార ప్రతినిధి అరుణ్ రాజ్‌భర్ అన్నారు. పాత కేసులను తవ్వేస్తున్నారన్నారనీ, బేడీ రామ్‌కు సీబీఐతో పాటు సుప్రీంకోర్టు కూడా అన్ని కేసుల్లో క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పారు. ఇది ప్రతిపక్షాల కుట్రగా అభివర్ణించారు.

సంకీర్ణమైనా సరళీకరణ విధానాలే

విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నా సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలే అమలవుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఎన్డీయేకు మద్దతు ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ కూడా సరళీకరణ విధానాలను వ్యతిరేకించబోరనీ, వాటికి మద్దతిస్తారని చెప్పారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం దేశానికి ఎంతో ప్రమాదకరమని అన్నారు. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోడీ వ్యవహరిస్తారని విమర్శించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జాన్‌వెస్లీ, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్ అధ్యక్షవర్గంగా సమావేశం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ భారత్ అభివృద్ధిని చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతికి గురవుతున్నదంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఈ పదేండ్లలో అంత అభివృద్ధి జరిగితే బీజేపీకి 303 నుంచి 240కి సీట్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. మోడీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400కుపైగా సీట్లు వస్తాయన్నారనీ, చావు తప్పి కన్ను లొట్ట బోయినట్టు ఆ పార్టీకి 240 సీట్లు వచ్చాయన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో రాజకీయ పార్టీలను చీల్చిందనీ, ఇద్దరు సీఎంలను జైల్లో పెట్టిందనీ, ప్రతిపక్ష నాయకులను అణచివేసిందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్లలో రూ.8 వేల కోట్లు బీజేపీకి వచ్చాయని చెప్పారు. 80 శాతం మీడియా, సోషల్ మీడియా, కార్పొరేట్ శక్తులు ఆ పార్టీకి వత్తాసు పలికాయని అన్నారు. అయినా బీజేపీ సీట్లు తగ్గాయని వివరించారు. ప్రధాని మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశాక అసలు పాలన ముందుందంటున్నారని చెప్పారు. ఈనెల 22 నుంచి పార్లమెంటు సమావేశాలున్నాయనీ, 23న కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలను మోడీ ప్రభుత్వం ముమ్మరం చేస్తుందన్నారు.

ఉత్తరాదిన బీజేపీకి ఎదురుదెబ్బ

ఉత్తరాదిన బీజేపీకి సీట్లు తగ్గాయని రాఘవులు వివరించారు. యూపీ, మహారాష్ట్ర, బెంగాల్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బీజేపీకి సీట్లు రావడంతో అధికారంలోకి వచ్చిందన్నారు. హిందూత్వ మతోన్మాదాన్ని దేశమంతా వ్యాపింపజేసినా సీట్లు తగ్గాయని విమర్శించారు. కేరళలో బీజేపీ ఒక్కస్థానంలో గెలిచిందని అన్నారు. అక్కడ సీపీఐ(ఎం), వామపక్షాల ఓట్లు చేరి ఆ పార్టీకి రావడం ఆందోళనకరమని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నా చేజేతులా పోగొట్టుకుందని వివరించారు. మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని మోడీ ఏర్పాటు చేసినా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను అణచివేస్తారని చెప్పారు. మతోన్మాద ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలో బీజేపీ పెరుగుదలను ఇండియా బ్లాక్ నిరోధించిందని చెప్పారు. బీజేపీని వదిలించుకోవడమే కర్తవ్యమంటూ ఆ కూటమిలోని పార్టీలు పనిచేశాయనీ, ప్రజల్లో భరోసాను కల్పించాయని వివరించారు. ఇండియా బ్లాక్ విచ్ఛిన్నం కాకుండా సీపీఐ(ఎం) విశేష కృషి చేసిందన్నారు. కేరళలో సీపీఐ(ఎం)ను ఓడించాలంటూ రాహుల్, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ మాట్లాడారని గుర్తు చేశారు. తాము నష్టపోయినా దేశం నష్టపోకుండా సంయమనంతో వ్యవహరించామని చెప్పారు. మమతా బెనర్జీకి నష్టం కలగకుండా బెంగాల్‌కు కాంగ్రెస్ ముఖ్యనాయకులెవరూ రాలేదన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడ్డమే సీపీఐ(ఎం) లక్ష్యమని చెప్పారు. ఇండియా బ్లాక్‌లో భాగస్వామిగా ఉంటూనే దేశభక్తిని చాటుకున్నామని అన్నారు.

తెలంగాణలో బీజేపీని నిలువరించాలి

తెలంగాణలో నాలుగు నుంచి ఎనిమిది సీట్లకు బీజేపీకి పెరిగిందని రాఘవులు చెప్పారు. 19 నుంచి 35 శాతానికి ఓట్ల శాతం పెరిగిందన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి కూడా నెరవేర్చాలని కోరారు. ఫెడరల్ హక్కుల మీద కేంద్రం దాడి చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు నిధులను తగ్గించడం కోసం పనగారియా నేతృత్వంలో ఫైనాన్స్ కమిషన్‌ను నియమించిందని గుర్తు చేశారు. పన్నుల్లో 30 శాతం వాటాను కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్నదనీ, దాన్ని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. తమ నిధుల కోసం కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఢిల్లీలో వేర్వేరుగా ధర్నా చేశాయని గుర్తు చేశారు. అదే తరహాలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జీఎస్టీకి ఎక్కువ పన్నులు రాకుండా ఉండేందుకు కేంద్రం సెస్‌ల రూపంలో వసూలు చేస్తున్నదని చెప్పారు.

అందులో రాష్ట్రాలకు వాటా లేదన్నారు. రాష్ట్రాలకూ సెస్ వసూళ్లలో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనల్లో కాంగ్రెస్ ప్రభుత్వం భాగస్వామి కావాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు, లేబర్ కోడ్‌లు కేంద్రం తెచ్చిందనీ, వాటిని అమలు చేయబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. ఆశాలకు పరీక్ష పెట్టాలని కేంద్రం చెప్తే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. ప్రజలకు నష్టం చేసే విధానాలను అమలు చేయబోమంటూ కేంద్రాన్ని ఎదిరించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి తెస్తున్నదని అన్నారు. అప్పులు చేసుకోనివ్వకుండా ఆంక్షలు విధిస్తున్నదని విమర్శించారు. కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి రూ. ఐదు వేల కోట్లు అప్పు తెచ్చుకుందని గుర్తు చేశారు. మెదక్ జిల్లాలో బీజేపీ నాయకులు మైనార్టీల ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. ఆ ఘటనలను కాంగ్రెస్ ఖండించలేదన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధికి హానికరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. అసంతృప్తి రాకుండా హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ హామీలపై మాట్లాడే కిషన్‌రెడ్డికి కేంద్రం హామీలు, ప్రజలపై మోపే భారాలపై చెప్పే దమ్మూధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీని ఒంటరిని చేసి నిలువరించాలని పిలుపునిచ్చారు.

మతోన్మాదంపై పోరాడాలి

'ఈ దేశానికి మతోన్మాదం పనికిరాదు. లౌకికవాదం కావాలి. నిరంకుశత్వం వద్దు. ప్రజాస్వామ్యం కావాలి. సనాతన ధర్మం సృష్టించే మనువాదం ఉండొద్దు. సమానత్వం కావాలి. కులవివక్ష ఉండొద్దు, సామాజిక న్యాయం కావాలి.'అని రాఘవులు చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మనువాద రాజ్యాంగాన్ని తేవాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే కమ్యూనిస్టులతోపాటు రాజ్యాంగాన్ని, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడే వారు కలిసి రావాలని కోరారు. సమస్య ప్రాతిపదికన కేంద్రానికి మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించడం రాజకీయం కాదనీ, లొంగుబాటుతనం అవుతుందన్నారు. అవకాశవాదంతో వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. బీజేపీతో అంటకాగిన బీజేడీ, వైసీపీ పరిస్థితి ఏ విధంగా ఉందో చూడాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్ ఉండాలంటే సమస్యలపై నిక్కచ్చిగా పోరాడాలనీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయాలని చెప్పారు. అవకాశవాద రాజకీయాలను విడనాడాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రత, సంక్షేమాన్ని కోరుకునే వారు కలిసి రావాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వంపై పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, పాలడుగు భాస్కర్, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించాలి

- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్
- విస్తృత సమావేశంలో తీర్మానం ఏకగ్రీవ ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడు నెలల పాలన పూర్తయిందనీ, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్నదని చెప్పారు. గృహజ్యోతి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రైతుభరోసా కింద పంట పెట్టుబడిసాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడేలా బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించి అమలు చేయాలని కోరారు. ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ ప్రణాళికను వెంటనే ప్రకటించాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలనీ, ఖాళీపోస్టులను భర్తీ చేయాలని కోరారు. హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి ప్రకటించాలని చెప్పారు. పెన్షన్లు పెంచాలన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలనీ, ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని అన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన వారందరికీ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, బకాయిలను విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని చెప్పారు.

కార్మికుల కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకను గుణంగా సవరించాలనీ, కొత్త జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ బలపరిచారు. దాన్ని విస్తృత సమావేశంలో ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి...

రేవంత్ సర్కారుకు ఎస్ వీరయ్య సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. ఇటీవల మెదక్‌లో జరిగిన కొన్ని మతోన్మాద ఘటనల పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చాకే ఇవన్నీ జరిగాయని గుర్తు చేశారు. మెదక్‌కు సంబంధించి ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై కేసులు నమోదు చేసినప్పటికీ, అది సరిపోదని అన్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్, మిగతా మంత్రులు నోరు మెదపకపోవటం శోచనీయమన్నారు. మతోన్మాదాన్ని నిలువరించాల్సిన బాధ్యత అధికార పార్టీగా కాంగ్రెస్‌కు, పీసీసీ చీఫ్‌గా రేవంత్‌కు లేదా? అని ప్రశ్నించారు.

బీజేపీ ఆర్థిక విధానాలతోపాటు దాని మతోన్మాదంపై కరకుగా ఉండాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. అప్పుడే బీజేపీని నిలువరించగలుగుతారని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రాంట్లు, హక్కుల సాధనకు కేంద్రంపై పోరాడాలని సీఎం రేవంత్‌కు వీరయ్య ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర విభజన అంశాలపై ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ చర్చించటం మంచిదేననీ, అయితే రెండు రాష్ట్రాలకు సంబంధించి కేంద్రం పరిధిలోని అంశాలపై మోడీ సర్కారుపై ఒత్తిడి తేవాలనే ప్రతిపాదన వారిద్దరికీ లేకపోవటం శోచనీయమని అన్నారు.

బీజేపీని నిలువరించటమే మా కర్తవ్యం

- ఆ పోరాటంలో ఎవరు కలిసొస్తే వారిని కలుపుకునిపోతాం: సీపీఐ(ఎం) విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగానూ బీజేపీని నిలువరించటమే తమ పార్టీ ప్రధాన కర్తవ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇందుకు సంబంధించిన పోరాటంలో అన్ని శక్తులనూ కలుపుకునిపోతామని ఆయన చెప్పారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తమ్మినేని మాట్లాడుతూ కేవలం ఎన్నికల సందర్భంలోనే గాక బీజేపీని, దాని మతోన్మాద భావజాలాన్ని అన్ని సమయాల్లోనూ నిలువరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లను ఆ పార్టీ గెలుచుకున్న నేపథ్యంలో ప్రజలు దాని పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ, దాని విధానాలకు వ్యతిరేకంగా పోరాడే అన్ని శక్తులనూ కలుపుకుని ముందుకు పోవాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలోని రేవంత్ సర్కారు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక పరిస్థితి, నిధుల కొరత పేరిట వాటి అమలును ఎగ్గొట్టే ప్రయత్నం చేయొద్దని కోరారు. రైతు భరోసా, రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సహాయం, ఇండ్లు, ఇండ్ల పట్టాలు, కార్మికులకు కనీస వేతనాల అమలు తదితర ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రేవంత్‌రెడ్డిని తమ్మినేని కోరారు.

మూడో టి20లోనూ గెలుపే..

జింబాబ్వేపై 23పరుగుల తేడాతో ఘన విజయం
సుందర్ ఆల్‌రౌండ్ షో



హరారే: ఐదు టి20ల సిరీస్ ఆడేందుకు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత యువ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. తొలి టి20లో నిరాశపరిచినా.. రెండు, మూడు టి20ల్లో నెగ్గి సిరీస్ ఆధిక్యతలో నిలిచింది. హరారే వేదికగా జింబాబ్వేతో బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. డియోన్ మైయర్స్(65నాటౌట్, 49 బంతుల్లో; 7ఫోర్లు, సిక్సర్), క్లైవ్ మదండె (37, 26 బంతుల్లో; 2ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అవేశ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో నిలిచింది. వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండి యాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66, 49 బంతుల్లో; 7ఫోర్లు, 3సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (49, 28 బంతుల్లో; 4ఫోర్లు, 3సిక్సర్లు) రాణించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (36, 27 బంతుల్లో; 4ఫోర్లు, 2సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. రెండో టి20లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ శర్మ(10) నిరాశపరిచాడు. గిల్‌తో ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు, సిక్సర్‌తో తన ఉద్దేశాన్ని చాటాడు. రెండో ఓవర్లో గిల్ సైతం 4, 6, 4తో భారత్ స్కోరు రాకెట్ వేగాన్నితలపించింది. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడటంతో 8ఓవర్లు ముగిసేసరికే భారత్ వికెట్ నష్టపోకుండా 67పరుగులు చేసింది. తొమ్మిదో ఓవర్లో రజా వేసిన బంతిని స్వీప్ చేయబోయిన జైస్వాల్.. బెన్నెట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ ఈ మ్యాచ్‌లో తేలిపోయాడు. కానీ రుతురాజ్ అండతో గిల్ రెచ్చిపోయాడు. మధ్వెరె వేసిన 13వ ఓవర్లో గిల్ ఓ సిక్సర్ బాదగా రుతురాజ్ 6,4 సాధించాడు. చటారా 14వ ఓవర్లో ఫోర్ కొట్టిన గిల్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో గిల్.. ముజర్బని వేసిన 18వ ఓవర్లో రజాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కానీ ఆఖర్లో రుతురాజ్ వేగంగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. అర్ధ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో రుతురాజ్ ఔట్ అయి నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. జింబాబ్వే బౌలర్లలో కెప్టెన్ సికిందర్ రాజా, బ్లెస్సింగ్ ముజర్బనికి రెండేసి వికెట్లు దక్కాయి. నాల్గో టి20 శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బెన్నెట్ (బి)రాజా 36, శుభ్‌మన్ (సి)రాజా (బి)ముజరబాని 66, అభిషేక్ శర్మ (సి)మరుమణి (బి)రాజా 10, రుతురాజ్ గైక్వాడ్ (సి)మధెవెరె (బి)ముజరబాని 49, సంజు (నాటౌట్) 12, రింకు సింగ్ (నాటౌట్) 1, అదనం 8. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 182పరుగులు.

వికెట్ల పతనం: 1/67, 2/81, 3/153, 4/177

బౌలింగ్: బెన్నెట్ 1-0-15-0, నరవా 4-0-39-0, ఛటారా 3-0-30-0, ముజరబాని 4-0-25-2, రాజా 4-0-24-2, మసకడ్జా 3-0-25-0, మధెవెరె 1-0-19-0

జింబాబ్వే ఇన్నింగ్స్: మధెవెరె (సి)అభిషేక్ శర్మ (బి)ఆవేశ్ ఖాన్ 1, మరుమణి (సి)దూబే (బి)ఖలీల్ అహ్మద్ 13, బెన్నెట్ (సి)బిష్ణోయ్ (బి)ఆవేశ్ ఖాన్ 4, మెయిర్స్ (నాటౌట్) 65, సికిందర్ రాజా (సి)రింకు సింగ్ (బి)సుందర్ 15, ఛాంప్‌బెల్ (సి)రియాన్ పరాగ్ (బి)సుందర్ 1, మధండే (సి)రింకు సింగ్ (బి)సుందర్ 37, మసకడ్జా (నాటౌట్) 18, అదనం 5. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 159పరుగులు.

వికెట్ల పతనం: 1/9, 2/19, 3/19, 4/37, 5/39, 6/116 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-15-1, ఆవేశ్ ఖాన్ 4-0-39-2, రవి బిష్ణోయ్ 4-0-27-0, సుందర్ 4-0-15-3, అభిషేక్ శర్మ 2-0-23-0, దూబే 2-0-27-0

ఫైనల్‌కు స్పెయిన్

బెర్లిన్(జర్మనీ): యూరో కప్-2024 ఫైనల్లోకి స్పెయిన్ జట్టు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో స్పెయిన్ జట్టు 2-1గోల్స్ తేడాతో ఫిఫా ప్రపంచకప్ రన్నరప్ ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఈ మూడు గోల్స్ మ్యాచ్‌లో తొలి అర్ధ భాగంలోనే నమోదయ్యాయి. 8వ నిమిషంలో రాండల్ కోలో మువాని గోల్ సాధించి ఫ్రాన్స్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు 21వ నిమిషంలో లామిన్ యమాల్, 25వ నిమిషంలో డానీ ఓల్మో గోల్స్ సాధించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- తండ్రి, ముగ్గురు పిల్లలను కాపాడిన స్థానికులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఓ కారు చెరువులోకి దూసుకెళ్లగా.. స్థానికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ముగ్గురు పిల్లలు, తండ్రిని స్థానికులు తాడు, ట్యూబ్ సాయంతో బయటకు తీసుకొచ్చి ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బైరాన్‌కాన్ చెరువులో బుధవారం జరిగింది. సీఐ అంజిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం బీఎన్.రెడ్డికి చెందిన అశోక్ తన ముగ్గురు పిల్లలతో కలిసి కారులో ఇనాంగూడ చెరువు వైపు వస్తుండగా వాహనం చెరువులోకి దూసుకెళ్లింది. ఆ ప్రాంతానికి దగ్గరలో తాటి చెట్టు పై ఉన్న కల్లు గీత కార్మికుడు పాండుగౌడ్ గమనించి.. వెంటనే అతని కుమారుడికి సమాచారం ఇచ్చాడు. అతను తాడు, ట్యూబ్‌ను తీసుకురాగా చెరువులోకి దూకి.. స్థానికుల సహకారంతో ముగ్గురు పిల్లలు, తండ్రిని సురక్షితంగా బయటకు తీశారు. కొద్దిపాటి ఆలస్యమైనా పెను ప్రమాదం జరిగేది. ఈ ఘటనకు సంబంధించిన కేసును మీర్‌పేట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ అంజిరెడ్డి తెలిపారు.

శభాష్ గౌడన్న..

కారు చెరువులోకి దూసుకెళ్లగా ప్రాణాలను తెగించి వారిని కాపాడిన స్థానిక గీత కార్మికులు పాండు గౌడ్, అతని కుమారుడు సాయి కుమార్ గౌడ్‌ను పలువురు ప్రశంసించారు. స్థానికుల నుంచి, సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి అభినందనలు వస్తున్నాయి. శభాష్ గౌడన్న అంటూ పోస్టులు వైరలవుతున్నాయి. అయితే ఆర్థిక సమస్యలతో అశోక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

పెయిడ్ ఆర్టిస్టులతో ధర్నాలు చేయిస్తారా?

- ఉద్యోగం కోసం వారు దరఖాస్తు కూడా చేయలేదు : బీఆర్ఎస్ నేతలపై ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం ఫైరయ్యారు. ధర్నాలు చేస్తున్న వారిలో కొంత మంది ఉద్యోగం కోసం కూడా దరఖాస్తు చేయలేదని ఆరోపించారు. ఇలాగే చేస్తే బట్టలూడదీసి ఉరికేయాల్సి వస్తుందని హెచ్చరించారు. తన పదవి, రాజకీయం వదిలి మీ ముందుకు వస్తానని సవాల్ విసిరారు. 'బరిగే పడతాం, మీ ముందుకు వస్తాం. దొర దగ్గరే ఉండాలా? ఉద్యోగాలు రావద్దా? ఉద్యోగాలు వస్తున్నాయి అంటే మీకు కడుపులో మంట' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఆపార్టీ నేతలు గాదరి కిశోర్, బాల్క సుమన్ పరుష పదజాలంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టారని విమర్శించారు. గత పదేండ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని నిలదీశారు. ఇప్పుడు తాము నోటిఫికేషన్ వేస్తే బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఫైరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డిపై పరుషంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా దళితులను ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని తెలిపారు. ఆయన ఎంగిలి మెతుకుల కోసం కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులపై మాట్లాడటానికి బీఆర్ఎస్‌కు నైతిక అర్హత లేదని చెప్పారు.

ఏనుగును పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం

- ఫలించిన మంత్రి కొండా సురేఖ ప్రయత్నాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బోనాల ఉత్సవాల్లో అమ్మవారి అంబారీ ఊరేగింపు, మొహర్రం పండుగ(బీబీ కా ఆలం అంబారీ ఊరేగింపు) నిమిత్తం రూపవతి(ఏనుగు)ని తెలంగాణకు పంపేందుకు కర్నాటక అటవీశాఖ అంగీకారం తెలిపింది. కర్నాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో మంత్రి కొండా సురేఖ పలుమార్లు చర్చించారు. ఏనుగు తరలింపునకు ఆమోదం తెలిపేలా చర్యలు చేపట్టారు. దీంతో కర్నాటక దావణగిరెలోని పాంచాచార్య మందిర ట్రస్టు నుంచి ఏనుగు తీసుకొచ్చేందుకు మార్గం సుగమమైంది. అటవీ చట్టాల అనుసరించి ఏనుగు తరలింపులో పాటించాల్సిన జాగ్రత్తలు, పర్యవేక్షణ తదితర అన్ని రకాల మార్గదర్శకాలను అనుసరించి ఏనుగును రాష్ట్రానికి తీసుకురానున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. ఏనుగు రాష్ట్రానికి చేరుకున్న తర్వాత పోషణ, విశ్రాంతి తదితర అంశాలకు సంబంధించి అటవీ చట్టాల మార్గదర్శకాలను పాటించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులు



- చిన్నారులకు యూనిఫామ్‌లిస్తాం
- అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్
- ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- పౌష్టికాహార తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- అధికారులు వారానికో సెంటర్‌ను సందర్శించాలి
- నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే కఠిన చర్యలు : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ క్లాసులను ప్రారంభించబోతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆ కేంద్రాలకు వచ్చే పిల్లలకు యూనిఫారాలు అందజేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి వారంపాటు అమ్మమాట-అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. పౌష్టికాహార తెలంగాణే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతా ధికారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారులు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా భద్రత, దత్తత, చైల్డ్ కేర్ వంటి అంశాలపై చర్చించారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని సీతక్క సచివాలయంలో ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీతక్క మాట్లాడుతూ..పిల్లలకు తొలి ఒడి అమ్మ అయితే మలిఒడి అంగన్‌వాడీ కేంద్రాలేనని చెప్పారు. కేంద్రాల్లో ఇస్తున్న సరుకులు, సేవల నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాసిరకం కోడిగుడ్లు, పాల ప్యాకెట్ల సరఫరా కట్టడి విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలనీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వారానికో ప్రాంతంలో పర్యటించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పేద పిల్లలకు పౌష్టికాహారం, విద్య, భద్రత అందేలా చూడాలన్నారు. అమ్మ స్థానంలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది..పిల్లలకు అమ్మ ప్రేమను పంచేలా చూడాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలు నిలవాలని ఆకాంక్షించారు. కేంద్రాలకు పెయింటింగ్ పనులు పూర్తిచేయించాలని ఆదేశించారు. చాటు మాటుగా దత్తత తీసుకుని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పిల్లలను త్వరితగతిన దత్తత తీసుకునేలా సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరే విధంగా ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మహిళలపైనా, చిన్నారులపైనా దాడులు, అఘాయిత్యాలు జరిగితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యునిసెఫ్ సౌజన్యంతో రూపొందించిన న్యూట్రిషియన్ ఛాంపియన్ పుస్తకాన్ని, న్యూట్రిషియన్ కిట్లను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలోనా?

- బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలను దగా చేసే పాలనగా మారిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు.బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసుల దాడి చూస్తుంటే తెలంగాణలో ఉన్నామా? సమైక్య రాష్ట్రంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతుందని తెలిపారు. కడప వెళ్లి షర్మిల కోసం ఊరూరా తిరుగుతా అంటూ సీఎం రేవంత్ సమైక్యవాదుల కోసం తాపత్రాయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో కలుషిత ఆహారం సమస్యలు, యూనివర్సిటీల్లో నియామకాల్లేక సిబ్బంది కొరత, దళిత ఎస్సై ఆత్మహత్య, ఎస్సీ, బీసీ మంత్రులకు అడుగడుగునా అవమానాలతో కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం కొరవడిందని దుయ్యబట్టారు. కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల్లోనే సామాజిక న్యాయమంటున్నారే తప్ప చేతల్లో లేదని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు పోలీసుల చేతిలో అవమానాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంగా తనకొచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికి ఉపయోగించుకోవాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

డీసెట్‌కు 85.96 శాతం హాజరు

- రెండువారాల్లో ఫలితాలు : కన్వీనర్ శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డీసెట్‌కు 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 15,150 (85.96 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. తెలుగు మాధ్యమంకు 9,698 మంది దరఖాస్తు చేస్తే, 8,189 (84.44 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఇంగ్లీష్, ఉర్దూ మీడియంకు 7,957 మంది దరఖాస్తు చేయగా, 6,961 (87.48 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రాథమిక కీని www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. రెండు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గన్నీ బ్యాగుల ధరలపై సమీక్షలేవి?

ఏడేండ్లలో రైతులకు రూ. 40కోట్ల మేర నష్టం

- జీవో 396 అమలు చేయాలని డిమాండ్
- మూడు గోదాముల్లో మూలుగుతున్న 5 లక్షల గన్నీ సంచులు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండి





నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కి తమ మిర్చి, పత్తి పంటలను తెచ్చిన రైతులకు గన్నీ సంచులకు ఆ పంటలు కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్ చార్జీల కింద డబ్బులు చెల్లిస్తారు. సదరు చెల్లింపులు రెండేండ్లకు ఒకసారి జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మెన్, జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమావేశమై చార్జీలను సమీక్షించి పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త ధరలు నిర్ణయించి అమలు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులు జీవో 396తో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ-2 ప్రస్తుతం మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు వ్యాపారులు రూ.30 చెల్లిస్తున్నారు. ఇది ఆనాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న దయానంద్ 04-07-2017న జరిగిన సమావేశంలో నిర్ణయించి ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే చెల్లిస్తున్నారు. ఇందులో పాడైన పేరుతో కొన్ని సంచులకు వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదు. అంటే ఏడేండ్ల నుంచి రైతుల గన్నీ సంచులకు చెల్లించవలసిన చార్జీలను సమీక్షించి ధరలను పెంచలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల జీవో నెంబర్ 396 ప్రకారం చార్జీలను 2019-2021, 2023లలో సమీక్షించి నిర్ణయించినట్లయితే రైతులకు ఇప్పుడు గన్నీ సంచికి రూ.60 వచ్చి ఉండేది. దాంతో రైతులు సుమారు రూ.35 నుంచి 40 కోట్ల మేర నష్టపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా రైతులకు రావలసిన చార్జీలను సమీక్షించి గన్నీ సంచుల ధరలను పెంచాలని రైతులు కోరుతున్నారు.

మూడు గోదాముల్లో మూలుగుతున్న 5లక్షల గన్నీలు

2012-2013 సీజన్‌కు సంబంధించి 21 లక్షలా 31వేల పైచిలుకు గన్నీ బ్యాగులను సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో 5 లక్షలా 31వేల పైచిలుకు బ్యాగులు ఏనుమాముల మార్కెట్‌లోని మూడు గోదాముల్లో ఉంచినట్టు వారు తెలిపారు. మార్కెట్లోని మూడు గోదాముల్లో గన్నీ బ్యాగులు నిల్వ ఉంచడం వల్ల మార్కెట్ ఆదాయానికి భారీ ఎత్తున గండిపడుతుందని తెలంగాణ రైతు సంఘం అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

వ్యాపారులతో మార్కెట్ అధికారుల కుమ్మక్కు

2015 ఆగస్టులో నాటి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ 10,19,550 గన్నీ బ్యాగులకు టెండర్ పెట్టగా వ్యాపారులు సిండికేట్‌గా మారి బ్యాగుకు రూ.7.50 వరకు పాట పాడారు. మళ్లీ టెండర్ నిర్వహించినా వ్యాపారులు మరోసారి సిండికేట్‌గా మారి రూ.7.30కు పాడారు. దాంతో కలెక్టర్ జీవన్ పటేల్ జోక్యం చేసుకొని రైతుల గన్నీ బ్యాగుకు వ్యాపారులు రూ. 15 చెల్లించాలని ఆదేశించారు. ఇదే విషయంపై 2023లో నాటి జిల్లా కలెక్టర్ గోపి నిర్వహించిన సమావేశంలో వ్యాపారులు రైతుల గన్నీ బ్యాగుకు రూ. 25 ఇవ్వాలని నిర్ణయించారు. 2015 నాటికి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని 15 మిల్లుల్లో 9,72,448 గన్నీ బ్యాగులు ఉన్నాయని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్కెట్‌లో రైతుల గన్నీ సంచులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ. 30ను రూ. 60కు పెంచి ప్రతి బస్తాకు చెల్లింపులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

గోదాముల కిరాయి రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి



- మోర్తాల చందర్ రావు, రైతు సంఘం నాయకులు

ఏనుమాముల మార్కెట్‌లో 12 ఏండ్ల నుంచి మూడు గోదాముల్లో నిల్వ ఉన్న గన్నీ బ్యాగులను కోర్టు అనుమతితో ఓపెన్ చేసి అందులో ఉన్న సంచులను అమ్మి ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేయాలి. గోదాముల కిరాయి మార్కెట్ కమిటీ కోల్పోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ అధికారుల జీతాల నుంచి కానీ, సీసీఐ నుంచి కానీ వసూలు చేసి మార్కెట్‌కు సమర్పించాలి. అలా వచ్చిన ఆదాయాన్ని రైతు సంక్షేమానికి ఖర్చు చేయాలి. కొనుగోలుదారులు రైతులకు ప్రతి బస్తాకు రూ. 60 చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం



- గుగులోతు రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి

రైతుల గన్నీ బ్యాగుల చార్జీల చెల్లింపుల విషయం ఇటీవలే రైతు సంఘం నేతలు నా దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.

బాలికకు పీఎల్‌హెచ్‌ఎఫ్ ప్రాణదానం

- క్రౌడ్ ఫండింగ్ ద్వారా రూ.12 లక్షలు ఆర్థిక సాయం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తొమ్మిదేండ్ల బాలికకు ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ (పీఎల్‌హెచ్‌ఎఫ్) ప్రాణదానం చేసింది. కర్నూలుకు చెందిన కే సానియా (9) రెండు నెలల క్రితం శారీరకంగా బలహీనమై, శరీరం నీలం రంగులోకి మారి, చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడింది. ఆమె తండ్రి వడ్డెర వృత్తిదారుడు. కుమార్తెకు సరైన వైద్యం చేయించలేక కుంగిపోతూ, చివరి ప్రయత్నంగా హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఆమెకు అత్యంత క్లిష్టమైన ఫోంటాన్ ప్రక్రియ ద్వారా వైద్యం చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. దీనికోసం దాదాపు రూ.12 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఆర్థిక స్థోమతలేని బాలిక తండ్రి ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నప్పుడు ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ (పీఎల్‌హెచ్‌ఎఫ్) వాలంటీర్లకు విషయం తెలిసింది. దీనితో వారు అప్పటికప్పుడు క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించారు. దాతలు విరాళాలు అందించారు. బాలిక శస్త్రచికిత్సకు అవసరమైన రూ.12 లక్షలు తక్కువ వ్యవధిలోనే సమకూరాయి. దీనితో బాలికకు వైద్యం చేయించారు. శస్త్రచికిత్స అనంతరం సానియా పూర్తిగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు. ఆమెను డిశ్చార్జి చేశారనీ, ఇప్పుడామె తోటి పిల్లలతో కలిసి పాఠశాలకు వెళ్తున్నదని పీఎల్‌హెచ్‌ఎఫ్ వాలంటీర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ హెచ్చరించారు. ఈనెల 9వ తేదీ మాసబ్‌ట్యాంక్‌లోని చాచానెహ్రూ పార్క్ వద్ద ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక కారణంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగింది. అయితే దీన్ని మార్చడానికి గంటల కొద్ది సమయాన్ని తీసుకున్నారని సీఎమ్‌డీకి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన సదరు అధికారులపై సీరియస్ అయ్యారు. ఆలస్యానికి కారణాలు ఏంటో తెలుపుతూ నివేదిక ఇచ్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మోహన్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన దీనిపై విచారణ జరిపి, సరఫరాలో అంతరాయం విషయం అధికారులకు తెలియజేయలేదనీ, విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకుగాను వివరణ ఇవ్వాలని మాసాబ్‌ట్యాంక్ అసిస్టెంట్ ఇంజనీర్ నాగచైతన్య, మెహదీపట్నం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మల్లయ్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేసారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

నివారణకు తక్షణ చర్యలు

- డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ
- జీహెచ్‌ఎంసీలో అధికారులతో సమీక్ష
- క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశం





నవతెలంగాణ-సిటీబ్యూరో


వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను నివారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ అధికారులకు సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వైద్య ఆరోగ్య, శానిటేషన్, ఎంటమాలజీ, మలేరియా విభాగాల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. నగరంలో మలేరియా, డెంగ్యూ చికెన్ గున్యా, జ్వరాల గురించి ఆరా తీశారు.

ఈ సందర్భంగా క్రిస్టినా చొంగ్తూ మాట్లాడుతూ.. డెంగ్యూ కేసుల విషయమై ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన చేస్తూ, వాటి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. నగరంలో విస్తరిస్తున్న డెంగ్యూను నియంత్రించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యారోగ్య, శానిటేషన్, ఎంటమాలజీ, తదితర అనుబంధ విభాగాలు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ, అవగాహన కల్పించాలని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. వర్షంతో వాటర్ నిల్వ ఉండటం, అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని, డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే కట్టడి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటింటి సర్వే చేసినప్పుడు గుర్తించిన జ్వరం కేసులకు సంబంధించి వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, హాస్టల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, డెంగ్యూ తదితర కేసులు పెరగకుండా నియంత్రించడంలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి డెంగ్యూ నియంత్రణలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లతో సమావేశాలు నిర్వహించి యాంటి లార్వా ఆపరేషన్‌పై అవగాహన పెంచాలన్నారు.

ఈ సందర్భంగా నగరంలో వ్యాధ్యులు ప్రబలకుండా ఏ విధంగా శానిటేషన్ నిర్వహిస్తున్నది, దోమల నియంత్రణకు చేపడుతున్న చర్యలను శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవికిరణ్ వివరించారు. జ్వరం వచ్చిన వారిని గుర్తించగానే ఎలా చికిత్స చేస్తున్నామన్నది వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. ప్రజలకు డెంగ్యూ, ఇతర వ్యాధుల నివారణ, దోమల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజారాణి, ఎంటమాలజీ చీఫ్ రాంబాబు, సంగారెడ్డి, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల డీఎంఅండ్‌హెచ్‌ఓలు, ఈఎంహెచ్‌ఓ, డిప్యూటీ ఈఈలు, మలేరియా శాఖ అధికారులు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మేయర్ సమావేశం

సీజనల్ వ్యాధులపై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా కమిషనర్ ఆమ్రపాలి కాటాతో కలిసి వైద్య ఆరోగ్యశాఖ, ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. ఏఎంహెచ్‌ఓలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డెంగ్యూ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.



న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన బోనాల వేడుకల్లో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

బిజినెస్

లక్షలాది మోసపూరిత ఖాతాలు

- ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)ల్లో లోపాలు
- సీఎఫ్ఓ (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)లు సీరియస్‌గా తీసుకోవాలి : ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆందోళన



న్యూఢిల్లీ : బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థల్లో ఇటీవల లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరిగిపోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె అన్నారు. మోసపూరిత లావాదేవీలు, ఎవర్‌గ్రీనింగ్ రుణాల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాలు ఇటీవల పెరిగాయన్నారు. కొన్ని బ్యాంకులు ఇలాంటి లక్షలాది ఖాతాలను కలిగి ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. రుణగ్రహీత చెల్లించిన ప్రిన్సిపల్ మొత్తంను మళ్లీమళ్లీ రుణ రూపంలో ఖాతాదారులకు ఇవ్వడాన్ని ఎవర్‌గ్రీనింగ్ రుణాలుగా భావిస్తారు. మంగళవారం బ్యాంకుల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు, ఆడిటర్లతో జరిగిన సమావేశంలో స్వామినాథన్ మాట్లాడుతూ.. అంతర్గత ఖాతాల నియంత్రణ, నిర్వహణలో లోపాలు ఉన్నాయని విత్త సంస్థలను ఉద్దేశించి అన్నారు. కొన్ని బ్యాంకులకు సరైన కారణం లేకుండా లక్షలాది ఖాతాలు కలిగి ఉండటాన్ని తాము గుర్తించామన్నారు. గత వారం బ్యాంక్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలోనూ మోసపూరిత ఖాతాలపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు.

డిజిటల్ మోసాలను అరికట్టాలని సూచించారు.ఈ ఖాతాల్లో కొన్ని మోసపూరిత లావాదేవీలు, రుణాల ఎవర్ గ్రీన్ కోసం వినియోగిస్తున్నట్లు స్వామినాథన్ తెలిపారు.

ఈ ఖాతాలతో దుర్వినియోగానికి అవకాశం ఉన్నందున వాటిని హేతుబద్ధీకరించాలని సూచించారు. వీలైనంత వరకు తగ్గించాలన్నారు. సంస్థల ఆర్థిక సమగ్రతను, పారదర్శకతను కాపాడుకోవడంలో సీఎఫ్ఓలు కీలక పాత్రను పోషించాలన్నారు. పలు బ్యాంకుల్లో సరైన కారణం లేకుండా కొనసాగిస్తున్న లక్షలాది ఖాతాలు కొన్ని మోసపూరిత లావాదేవీలకు మద్దతును ఇస్తున్నాయన్నారు. విత్త సంస్థల్లో పారదర్శకత పెంచడానికి ఆడిటర్లు, సీఎఫ్ఓలు నిజాయితీతో వ్యవహరించాలని మరో డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు సూచించారు. ఎన్‌బీఎఫ్‌సీలలో మార్గదర్శకాల అమలు లోపించిందన్నారు.

హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్ విస్తరణ

- గ్లోబల్ ఐటీ సెంటర్ ఏర్పాటు : ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ : మెడికల్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న అమెరికాకు చెందిన మెడ్‌ట్రానిక్ కంపెనీ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ ఐటి సెంటర్‌ను బుధవారం ఐటి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, మెడ్‌ట్రానిక్ ఎస్‌విపి అండ్ సిఇఒ రష్మి కుమార్, ఎంఇఐసి సైట్ లీడర్ దివ్యా జోషి లాంచనంగా ప్రారంభించారు. మెడ్‌ట్రానిక్ ఇక్కడ కార్యకలాపాలను విస్తరించడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనుకూలమన్నారు. ఇక్కడి నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో 60 మిలియన్ డాలర్లు (రూ.500 కోట్లు) పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ సంస్థ నగరంలో మెడ్‌ట్రానిక్ ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కలిగి ఉంది. గ్లోబల్ ఐటి సెంటర్ అనేది యూఎస్ వెలుపల మెడ్‌ట్రానిక్‌కు అతిపెద్ద కేంద్రంగా కావడం విశేషం. వచ్చే ఐదేండ్లలో 300 కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించనున్నామని ఆ సంస్థ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి మద్దతు

- అసోచామ్ ప్రతినిధుల వెల్లడి

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధిని కొనసాగించడానికి ఇరు ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని అసోచామ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ చైర్మెన్ కటారు రవి కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాలో 2024-25కు గాను అసోచామ్ తొలి ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి రవి కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. దీనికి ఆ సంస్థ ప్రతినిధులు శ్రీధర్ పిన్నపురెడ్డి, బన్సిధర్ బండి తదితరులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధికి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి పని చేస్తామని రవి కుమార్ అన్నారు. సమ్మిళిత, స్థిరమైన సామాజిక ఆర్థిక వృద్ధిని సాధించాలనేదే తమ లక్ష్యమన్నారు.

జీజీ ఇంజినీరింగ్ విలీనానికి ఇంటెగ్రా బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ : జీజీ ఇంజినీరింగ్ విలీనానికి తమ బోర్డు ఆమోదం తెలిపిందని ఇంటెగ్రా ఎసెన్షియా లిమిటెడ్ తెలిపింది. తమ ప్రతిపాదన ప్రక్రియ స్టాక్ మార్కెట్లు, సెబీ, ఎన్‌సిఎల్‌టి, వాటాదారుల ఆమోదానికి లోబడి ఉంటుందని పేర్కొంది. నిర్మాణం, మౌలిక వసతులు, పరిశ్రమలు తదితర ప్రాజెక్టులకు జీజీ ఇంజనీరింగ్ సొల్యూషన్స్‌ను అందిస్తుందని తెలిపింది.

మార్చి కల్లా 35 స్టోర్లకు విస్తరణ

- నగరంలో రివర్ ఇవి తొలి స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న విద్యుత్ స్కూటర్ల తయారీ కంపెనీ రివర్ హైదరాబాద్‌లో తన తొలి స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బుధవారం దీనిని ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి లాంచనంగా ప్రారంభించారు. కూకట్‌పల్లిలో శ్రీరాజరాజేశ్వర ఈవీ మొబిలిటీ సహకారంతో ఏర్పాటు చేసిన స్టోర్‌లో ఇండి స్కూటర్లు, యాక్సెసరీలు, మెర్చండైజ్ లాంటి సేవలన్ని లభిస్తాయన్నారు. ఇది తమకు మూడో స్టోర్ అని తెలిపారు. సెప్టెంబర్ కల్లా 10 స్టోర్లకు, 2025 మార్చి కల్లా దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో 35-40 అవుట్‌లెట్‌లు తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నెలలోనే చెన్నయ్‌లో కొత్త స్టోర్‌ను ప్రారంభించనున్నామన్నారు ఇండీ స్కూటర్ ఎక్స్‌షోరూం ధరను రూ.1,38,000గా నిర్ణయించామన్నారు.

అట్టహాసంగా సూత్రా ఎగ్జిబిషన్ ప్రారంభం



హైదరాబాద్ : వచ్చే రాఖీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని సూత్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రదర్శన బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణలో దీనిని మిస్ గ్రాండ్ ఇండియా 2022 ప్రాచీ నాగ పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయతలు, ఆధునిక ఫ్యాషన్లు ప్రతిబింబించు వస్త్రాలు, వివిధ ఉపకారణాలు ప్రదర్శిస్తునలో ఉంచడం అభినందనీయమన్నారు. రాఖీ తీజ్ కొరకు ప్రత్యేకమైన ఫ్యాషన్ దుస్తులు, ప్రత్యేక కలెక్షన్లు, ఆభరణాలు, ఉపకరణాలు వంటివి ఎన్నెన్నో అందుబాటులో ఉన్నాయని సూత్ర ఎగ్జిబిషన్ చైర్మెన్ ఉమేష్ తెలిపారు.

షెల్ ఇండియాతో ఎంజీ మోటార్ జట్టు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా విద్యుత్ వాహనాల కోసం పబ్లిక్ చార్జింగ్ మౌలికసదుపాయాలు పెంచడానికి షెల్ ఇండియా మార్కెట్స్‌తో ఒప్పందం కుదర్చుకున్నట్లు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు షెల్ ఇండియా స్టేషన్లలో సిసిఎస్ 50కెడబ్ల్యు, 60 కెడబ్ల్యు డిసి ఫాస్ట్ చార్జర్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొంది.

అభివృద్ధి పేరిట బతుకులు చిన్నాభిన్నం

- ప్రజ్ఞాపూర్ రహదారిపై రైతుల రాస్తారోకో
- ప్రాజెక్టుల పేరిట గత ప్రభుత్వం ప్రాణాలు తీస్తే.. మళ్లీ ట్రిబుల్ ఆర్ పేరుతో మా బతుకులు ఆగం
- అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు..
- భూమికి నష్టపరిహారం డబ్బు వద్దు..
- భూమికి భూమి ఇప్పించండి



నవతెలంగాణ- గజ్వేల్ రూరల్

"పదేండ్లుగా ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం రైతుల బతుకులు రోడ్డుపాలు చేసింది.. ప్రస్తుతం ప్రజల ప్రభుత్వం అని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. రైతుల బతుకుల్లో చీకటి నింపొద్దు.. ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి మేం వ్యతిరేకం కాదు.. పదేండ్లలో దగాపడ్డ జీవితాలు ఇప్పుడిప్పుడే దారికి వస్తున్నాయి.. అభివృద్ధి పేరిట మా బతుకులు చిన్నాభిన్నం చేయొద్దు" అంటూ గజ్వేల్ నియోజకవర్గ రైతులు ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం రాజీవ్ రహదారిపై మోకాళ్లపై భైటాయించి, సాష్టాంగ నమస్కారం చేస్తూ ధర్నా చేపట్టారు. ట్రిబుల్ ఆర్ నిర్మాణం వల్ల గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా 4750 ఎకరాల భూములను కోల్పోతున్నామని బాధితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట ఇప్పటికే మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు, ఔటర్ రింగ్ రోడ్డు పేరిట రైతుల భూములు ప్రభుత్వం గుంజుకుందని, ఉన్న కొద్దిపాటి భూములను ఇప్పుడు ట్రిబుల్ ఆర్ పేరిట ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు కోల్పోయిన రైతులు.. మనస్తాపం చెంది గుండెపోటుతో కొంతమంది, పురుగుల మందు తాగి కొంతమంది మృతిచెందారని గుర్తుచేశారు. భూమి ఉంటేనే గ్రామంలో అవసరాలకు షావుకారులు డబ్బులు ఇస్తారని, భూమి లేకుంటే ఆపద సమయంలో ఎవరూ ఆదుకోరని తెలిపారు.



ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడానికి వీలు కాకపోతే ప్రభుత్వం ఇచ్చే ఏ ప్యాకేజీలు తమకు వద్దన్నారు. రైతుల దగ్గర ఎంత భూమి తీసుకుంటే అంతే భూమి మరెక్కడైనా రైతులకు అందజేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తే.. తమ సమస్యను విన్నవించుకుంటామని తెలిపారు. దీనిలో ఎటువంటి రాజకీయ ఉద్దేశం లేదని, కేవలం రైతులమే ధర్నా చేస్తున్నామని స్పష్టంచేశారు. భూ నిర్వాసితుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని రైతుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ ధర్నాలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓయూలో జర్నలిస్టులపై దాడి అమానుషం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : బీఆర్‌ఎస్ నేతల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలో జీ న్యూస్ రిపోర్టర్ శ్రీచరణ్‌పై పోలీసుల దాడిని బీఆర్‌ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరసనలను కవర్ చేస్తున్న విలేకరుల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారని విమర్శించారు.

అరెస్ట్ అక్రమం: హరీశ్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీలో జీ న్యూస్ రిపోర్టర్, కెమెరామెన్ల అరెస్టు అక్రమం. ఈమేరకు ట్విట్టర్ ద్వారా హరీశ్‌రావు పోలీసుల తీరును ఖండించారు. "జర్నలిస్టులను అరెస్టు చేయడం, బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కును, స్వేచ్ఛను కాలరాయడమే. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.

దాడి హేయమైన చర్య: కేటీఆర్

"విధి నిర్వహణలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య. వార్తల కవరేజీకి వెళ్లడం నేరమా? నిన్న బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద మహిళా జర్నలిస్టులతో దురుసు ప్రవర్తన. నేడు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జీన్యూస్ రిపోర్టర్ అక్రమ అరెస్ట్. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా జర్నలిస్టులపై దాడిని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మీడియా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ తదితరులు తీవ్రంగా ఖండించారు.

అక్రమ అరెస్టుకు టీడబ్ల్యూజేఎఫ్ ఖండన

డీఎస్సీ వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగ యువకుల ఆందోళన కార్యక్రమ కవరేజీకి వెళ్లిన జీన్యూస్ రిపోర్టర్ శ్రీచరణ్‌పై పోలీసులు దాడి, అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను, తాము జర్నలిస్టులమని చెబుతున్నా పోలీసులు దురుసుగా వ్యవహరించడం సరి కాదన్నారు. శ్రీచరణ్‌ను సీఐ బలవంతంగా లాక్కొని పోలీస్ వాహనంలో ఎక్కించి పోలీసు స్టేషన్లో నిర్బంధించడం మీడియా భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని వ్యాఖ్యానించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను వెంటనే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జర్నలిస్టులపై పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సంఘటనకు బాధ్యులైన పోలీసులపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేటినుంచి ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 అభ్యర్థులకు రీలింక్విష్‌మెంట్

- టీజీపీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మెడికల్ ఎడ్యుకేషన్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు గురువారం నుంచి రీలింక్విష్‌మెంట్ (ఒక పోస్టును ఉంచుకుని మిగిలిన పోస్టులను వదులుకోవడం) సౌకర్యం ఇస్తున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ తెలిపారు. ఈనెల 14న సాయంత్రం ఐదు గంటల వరకు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు సంబంధించి www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో లింకు అందుబాటులో ఉందని వివరించారు.

200 ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి 2017, డిసెంబర్ 18న నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

తాకట్టులో ప్రభుత్వ భూములా?

- పరిశ్రమలకేమిస్తారు? యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి?: కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ భూములను ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలకు తాకట్టు పెడితే పరిశ్రమలకు భూములెలా కేటాయిస్తారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలకు భూములు కేటాయించకపోతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రేవంత్ సర్కారుకు రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేత కావడం లేదని విమర్శించారు. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖకు చెందిన రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూములను తనఖా పెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తున్నట్టు సమాచారం ఉందని చెప్పారు.. ఇందుకోసం మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను ఉపయోగించుకుని రూ.100 కోట్లు కమిషన్ ఇచ్చేందుకు సిద్ధపడిందని తెలిపారు. హస్తం నాయకుల మతిలేని చర్యల కారణంగా రాష్ట్ర ప్రగతి శాశ్వతంగా కుంటుపడుతుందని తెలిపారు. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా యువత ఉద్యోగావకాశాలు కోల్పేయే ప్రమాదముందని హెచ్చరించారు.

కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తుంటాయనీ కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి చోట 400 ఎకరాలు ప్రయివేటు సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆక్షేపించారు. గత ఏడు నెలలుగా పారిశ్రామిక రంగం స్తబ్దుగా మారి, పెట్టుబడులు రాక, సరైన ప్రోత్సాహం లేక కంపెనీలు కూడా పక్కచూపులు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెట్టడం తగదని కేటీఆర్ హితవు పలికారు.

సెర్ప్‌లో 100 శాతం బదిలీలు చేపట్టాలి

- మంత్రి సీతక్కకు సెర్ప్ ఉద్యోగ సంఘాల జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సెర్ప్‌లో 100 శాతం బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సెర్ప్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర జేఏసీ కోరింది. బుధవారం హైదరాబాద్‌లో ఈ మేరకు జేఏసీ నాయకులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)కు వినతిపత్రం అందజేశారు. సెర్ప్‌లో పదేండ్లుగా బదిలీలు చేయకపోవడంతో ఉద్యోగుల్లో నిస్తేజం నెలకొందనీ, సొంత జిల్లాల్లో కాకుండా సుదూర ప్రాంతాల్లో పనిచేయాల్సి వస్తున్నదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో స్కూల్ యూనిఫామ్‌లు కుట్టించడం, ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలివ్వాలనే టార్గెట్, ఇందిరా క్యాంటీన్, వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్న దృష్ట్యా సిబ్బందిలో నూతనోత్సాహం నింపేందుకు 40 శాతం కాకుండా వంద శాతం బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారని జేఏసీ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కుంట గంగాధర్, సుదర్శన్, మహేష్, గిరి, మధు, ఈశ్వర్, దుర్గాకృష్ణ, తదితరులున్నారు.

కురియన్ కమిటీ తొలుత

సునీల్ కానుగోలును కలవాలి

- సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇస్తే గెలిచేవాడిని : మాజీ ఎంపీ వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ఓటమిని పరిశీలించేందుకు తెలంగాణ పర్యటనకు వస్తున్న కురియన్ కమిటీ తొలుత ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలును కలవాలని మాజీ ఎంపీ వి. హనుమంతరావు సూచించారు. టికెట్ విషయం తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిదేండ్లలో తనకు ఒక్క పదవీ లేదన్నారు. తనకు రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే గెలిచేవాడినని వ్యాఖ్యానించారు. 'రుణమాఫీ చేస్తున్న రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు. జట్టు సభ్యుడైన హైదరాబాదీ సిరాజ్‌కు ఇంటి స్థలం, ఉద్యోగం ఇస్తామని ప్రకటించడం హర్షించదగిన పరిణామమన్నారు. దేశంలో క్రికెట్‌కు మంచి క్రేజ్ ఉందని చెప్పారు. తెలంగాణలో క్రీడలను సీఎం ప్రోత్సహించాలి. రాష్ట్రంలో హైదరాబాద్‌లో తప్ప ఎక్కడా క్రికెట్ స్టేడియం లేదు. ఏపీలో 12 ఉన్నాయి. తెలంగాణలోని ప్రతి జిల్లాలో స్టేడియం నిర్మాణానికి 12 ఎకరాల స్థలాన్ని సీఎం కేటాయించాలి. గతంలో క్రీడలను కేటీఆర్ ప్రోత్సహించలేదు. ఎకరం భూమి కూడా కేటాయించలేదు. అసెంబ్లీ సమావేశాల్లో క్రీడలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించాలి' అని ఆయన కోరారు.

ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ సమూల ప్రక్షాళన

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 17 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించినట్టు చెప్పారు. కొత్తగా 10 మొబైల్ ఫుడ్ ల్యాబ్‌లను త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు. మొబైల్ ల్యాబ్స్ ద్వారా ప్రతి రోజు 200 ఫుడ్ సేఫ్టీ టెస్టులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీధి వ్యాపారులకు సేఫ్టీ లైసెన్సులు తీసుకు నేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 387 హాస్టళ్లను తనిఖీ చేసి ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు విధిగా కలిగి ఉండాలని ఆదేశాలిచ్చినట్టు వెల్లడించారు.

మినిమమ్ వేజ్ బోర్డు చైర్మెన్‌గా జనక్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

- మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్‌గా బంద్రు శోభారాణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మినిమమ్ వేజ్ బోర్డు చైర్మెన్‌గా సింగరేణి కార్మిక నాయకులు జనక్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి వచ్చిన జనక్ ప్రసాద్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బంద్రు శోభారాణి, ఎస్టీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా బెల్లయ్య నాయక్ బాధ్యతలు స్వీకరించారు. వారిద్దరికి మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. బంద్రు శోభారాణి మాట్లాడుతూ..మహిళల నైపుణ్య శిక్షణాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తమ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తున్నదని చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ వార్తలపై సంయమనం పాటించాలి

మీడియాకు హైకోర్టు సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన వార్తలపై మీడియా సంయమనం పాటించాలని హైకోర్టు సూచించింది. ఆ వ్యవహారంలో జడ్జీలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు మీడియాలో ప్రసారం చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కొన్ని పత్రికల్లో న్యాయమూర్తి పేరు, మొబైల్ నంబర్ ప్రచురించినట్టు ప్రస్తావించింది. ఇలాంటి సున్నితమైన కేసుల్లో ఫోన్ నంబర్లు ప్రచురించొద్దని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ వినోద్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ సూచనలు చేసింది. వార్తలు రాసేటప్పుడు మీడియా జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. ఇప్పటికే ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేశారని పేర్కొంది. అందుకే ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలనుకోవడం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత పాలనలో హైకోర్టు న్యాయమూర్తి ఫోన్‌ట్యాప్ అయిందనీ, జడ్జీల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు (సస్పెన్షన్) ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొనడాన్ని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. వీటిని హైకోర్టు సుమోటో పిటిషన్‌గా తీసుకుని విచారణ చేపట్టింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. కేంద్ర ప్రభుత్వం కౌంటర్ వేసేందుకు గడువు కోరింది. దీంతో పైవిధంగా సూచనలు చేసిన కోర్టు విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.



వీధికుక్కల నియంత్రణకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయండి : రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

వీధికుక్కల నియంత్రణపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది. వాటి నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిల్లలతో పాటు పెద్దలపై కూడా కుక్కల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇకపై మరణాలు జరగకుండా కుక్కల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం సూచించింది. చర్యలు తీసుకుంటున్నామంటూ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే చూస్తూ కూర్చోబోమని హెచ్చరించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తే చాలదనీ, పేదలుండే మురికివాడల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించింది. కుక్కలు, పిల్లలను కాటు వేసేది ఎక్కువగా మురికివాడల్లోనేని గుర్తు చేసింది. పరిహారం ఇచ్చామని అధికారులు చేతులు దులుపుకోడానికి వీల్లేదని హెచ్చరించింది. తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నిపుణుల కమిటీని వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలన్న కోర్టు విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

బోడుప్పల్ మేయర్ అప్పీల్ డిస్మిస్

మేడ్చల్ మల్కాజిగిరిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మాన నోటీసులను సమర్థిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ బుధవారం సమర్థించింది. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని వెల్లడించింది. ఆ తీర్మానాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జారీ చేసిన నోటీసులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్‌లు వేర్వేరుగా సవాల్ చేశారు. వీటిని చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాథే, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం డిస్మిస్ చేస్తూ తీర్పు వెలువరించింది. జూన్ 21న కలెక్టర్ ఇచ్చిన నోటీసులు సమర్ధనీయమేనని వెల్లడించింది.

ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌కు నోటీసులు

రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా జి.వైజయంతి నియామకం, కొనసాగింపును సవాలు చేసిన కేసులో ఆమెతోపాటు ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమె నియామకం నిబంధనలకు వ్యతిరేకమంటూ లాయర్లు శశికాంత్, శ్రీనివాసులు వేసిన పిటిషన్లను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. హైకోర్ట్ సీజే అనుమతితో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లేదా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పదవికి అర్హులనీ, పదేండ్ల పాటు ప్రాక్టీస్ చేయాలనే నిబంధన కూడా ఉందని వారు పిటిషనర్లు పేర్కొన్నారు. వైజయంతి నియామకానికి సంబంధించి 2021, మార్చి 16న ఇచ్చిజీవోను రద్దు చేయాలని కోరారు.

విరించి ఆస్పత్రికి హైకోర్టు నోటీసులు

వ్యర్థ పదార్థాలను తమ నివాస ప్రాంగణం వద్ద డంప్ చేస్తున్నారంటూ దాఖలైన కేసులో హైదరాబాద్‌లోని విరించి ఆస్పత్రికి హైకోర్ట్ నోటీసులు జారీ చేసింది. తన ఇంటి వద్ద భూమి తవ్వి ఆ కందకంలో వ్యర్థ పదార్థాలను డంప్ చేస్తున్నారనీ, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటూ ఖైరతాబాద్‌కు చెందిన రిజ్వాన్ ఖాన్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. కౌంటర్ వేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్‌మెంట్ సెక్రటరీ, జీహెచ్ఎంసీ కమిషనర్‌లకు కూడా నోటీసులు ఇచ్చింది.

పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు రూ.25లక్షలు అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం నుంచి ఈ ఏడాది పద్మశ్రీ అవార్డు పొందిన వారికి రూ.25లక్షల చొప్పున ఒక్కొక్కరికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించారు. బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందచారి, కూరేళ్ల విఠలాచార్య కేతావత్ సోంలాల్‌కు ఆయన చెక్కులను అందించారు. అనంతరం సీఎం వారిని ఘనంగా సన్మానించారు. సందర్భంగా ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్యాటక. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, డైరెక్టర్ మామిడి హరికష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కతో మహిళా ఎన్జీఓ ప్రతినిధుల భేటీ

మహిళా సంరక్షణ, సాధికారత పై చర్చ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)తో మహిళలు చిన్నారుల సంరక్షణ కోసం పనిచేసే పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి మంజూల కృష్ణన్(కాలిఫోర్నియా), అంకురం ఎన్జీవో ప్రతినిధులు సుమిత్ర, విజయ ఉన్నారు. మహిళల సంరక్షణ, సాధికారతపై మంత్రి సీతక్కతో వారు చర్చించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తమ సంసిద్ధతను వ్యక్త పరిచారు. సామాజిక ఉద్యమాల్లో, సేవా కార్యక్రమాల్లో విశేష అనుభవం ఉన్న సీతక్క మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉండటం తెలంగాణ చేసుకున్న అదృష్టమని కొనియాడారు. రాష్ట్రంలో ఉమెన్ ప్రొటెక్షన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. గ్రామీణ మహిళల నైపుణ్యాన్ని పెంచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసే చేయాలని మంత్రి సీతక్క కోరగా ఎన్జీఓ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.

డిజిటల్ పురోగతికి అండగా ఉంటాం

- ఫోన్‌పే ప్రతినిధి అంకిత్ గౌర్

హైదరాబాద్ : దేశంలో డిజిటల్ పురోగతికి అండగా నిలుస్తామని ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే అండ్ ఆన్‌లైన్ మర్చంట్స్ విభాగం హెడ్ అంకిత్ గౌర్ అన్నారు. హైదరాబాద్‌లో కాన్ఫ్లుయెన్స్, కనెక్ట్ 2024 పేర్లతో పేమెంట్ గేట్‌వే సదస్సును విజయవంతంగా నిర్వహించినట్లు ఫోన్‌పే తెలిపింది. తమ భాగస్వాములను శక్తివంతం చేసే దిశగా ఈ అవగాహన, నెట్‌వర్కింగ్ సదస్సును ఏర్పాటు చేసినట్లు అంకిత్ గౌర్ పేర్కొన్నారు. తమ భాగస్వాములు, మర్చంట్‌ల అవసరాలను పరిష్కరించేలా ఒక ప్రత్యేక వేదికను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమానికి హెరిటేజ్ ఫుడ్స్ సిఇఒ శ్రీదీప్ కేశన్ సహా సహా 50 మంది ఇ-కామర్స్, డి2సి బ్రాండ్ ప్రతినిధులు హాజరయ్యారని ఆ సంస్థ తెలిపింది

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ల మాఫియా ఉందంటూ చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ0 రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వాటిని నియంత్రించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే అవి నిర్వహించేలా సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా వేల రూపాయల ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయని విమర్శించారు. కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి తగిన మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు.

ఎంఎల్‌టీ గ్రేడ్-2 సీనియార్టీ లిస్టు తప్పులతడక?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 సీనియార్టీ లిస్టు తప్పులతడకగా ఉండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం ఆ జాబితాను ప్రకటించింది. జిల్లా వైద్యారోగ్య అధికారుల నుంచి వచ్చిన జాబితాల ఆధారంగా కాకుండా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ నుంచి సమాచారం తీసుకోవడమే ఈ పొరపాట్లకు కారణంగా తెలుస్తున్నది. లిస్టులో జోనల్ల వారీగా ప్రకటించకుండా ఒకే జాబితా తయారు చేయడంతో టెర్మినేట్ అయిన వారితో పాటు పదవీ విరమణ చేసిన వారి పేర్లు ఉన్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. స్టేషన్ సీనియార్టీలో అపాయింట్మెంట్ సీనియార్టీని చూపించడాన్ని వారు తప్పు పడుతున్నారు. గ్రేడ్-1 టెక్నీషియన్లు ప్రస్తుతం 20 మంది మాత్రమే పని చేస్తుండగా ఆ లిస్టులో దాదాపు 150 మందిని చూపించారంటే ఎంత నిర్లక్ష్యంగా జాబితా తయారు చేశారో విదితమవుతున్నది. ఈనెల 8వ తేదీనే జాబితా విడుదల చేయాల్సి ఉండగా... అందుకు భిన్నంగా రెండు రోజులు ఆలస్యంగా బుధవారం విడుదల చేశారు. ఈ అంశంపై సంబంధిత అధికారులను సంప్రదిస్తే జిల్లా వైద్యారోగ్య అధికారుల నుంచి సవరణ చేసి పంపించాలని చెబుతున్నట్టు ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర కార్యాలయాల్లో జరిగే తప్పులకు దూర ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు వ్యయ ప్రయాసాలకోర్చి హైదరాబాద్‌కు రావాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మాసిస్టుల జాబితాలోనూ..

ఫార్మాసిస్టుల జాబితాలోనూ అనేక తప్పులు చోటు చేసుకున్నట్టు ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికీ ఫోకల్, నాన్ ఫోకల్ జాబితాలు ఇవ్వకపోవడంతో పాటు వాటి స్థానంలో వేకెన్సీ, లాంగ్ స్టాండింగ్ జాబితా మాత్రమే ఇవ్వడంతో ఉద్యోగుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

రష్యాతో బంధంపై ఆందోళనలు వున్నా..

- భారత్ వ్యూహాత్మక భాగస్వామిగా కొనసాగుతుంది : అమెరికా

వాషింగ్టన్ : రష్యాతో గల బంధంపై అమెరికాకు ఆందోళనలు వున్నప్పటికీ భారత్ వ్యూహాత్మక భాగస్వామిగానే కొనసాగుతుందని బైడెన్ ప్రభుత్వం ప్రకటించింది. ఉక్రెయిన్‌లో యుద్ధం చెలరేగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ రష్యాలో రెండు రోజుల పర్యటనను అమెరికా నిశితంగా పరిశీలించింది. బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు ఫలించవని, యుద్ధ రంగంలో ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం లభించదని మంగళవారం మోడీ, పుతిన్‌కు స్పష్టం చేశారు. రష్యాతో భారత్ సంబంధాలపై అడిగిన ప్రశ్నలకు పెంటగన్ ప్రతినిధి, విదేశాంగ శాఖ ప్రతినిధి వేర్వేరుగా స్పందించారు. 'భారత్, రష్యాల మధ్య దీర్ఘకాలంగా సంబంధాలు వున్నాయి.

అమెరికా కోణం నుండి చూసినట్లైతే భారత్ ఎప్పటికీ వ్యూహాత్మక భాగస్వామిగానే వుంటుంది. రష్యాతో భారత్ సంబంధాలతో సహా ప్రతి అంశంపైనా పూర్తి స్థాయిలో, నిష్కపటమైన రీతిలో చర్చలు కొనసాగిస్తాం." అని పెంటగన్ పత్రికా కార్యదర్శి మేజర్ జనరల్ పాట్ రియాదర్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ విలేకర్లతో మాట్లాడుతూ, రష్యాతో భారత్ సంబంధాలపై తమ ఆందోళనల గురించి అమెరికా చాలా స్పష్టంగా వుందన్నారు. వాటిని భారత ప్రభుత్వానికి ప్రైవేటుగా తెలియచేస్తాం. భారత్‌తో సంబంధాల విషయంలో ఎలాంటి మార్పు వుండదని స్పష్టం చేశారు. మోడీ పర్యటనతో తాము ఏకాకులం కాలేదని పుతిన్ ఈ ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రయత్నిస్తున్నారనడంలో ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదని రియాదర్ వ్యాఖ్యానించారు.

ఎంఎస్ఎం ఈలలో అధికం అసంఘటిత కార్మికులే

అందులోనూ కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యా సంఖ్యా ఎక్కువే



న్యూఢిల్లీ : 2023 జనవరిలో అప్పటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) మంత్రి నారాయణ్ రాణే ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) భాగస్వామిగా ఉంది. జీఎస్టీ అధికారుల వద్ద నమోదు కాని అనధికారిక సూక్ష్మ తరహా పరిశ్రమలకు ఉద్యం రిజిస్ట్రేషన్‌ను కల్పించడమే ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ఉద్దేశమని ఎస్ఐడీబీఐ తెలిపింది. ఉద్యం వేదిక కానీ, జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ కానీ అసలు సమస్యే కాదు. అయితే అనధికారిక, అధికారిక పరిశ్రమల రోజువారీ పనితీరుపై అవగాహన కోసం ఇవి ఉపయోగపడతాయి. ఇటీవలి కాలంలో ఎంఎస్ఎంఈలు రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాయి. ఎంఎస్ఎంఈలకు సంబంధించి ప్రభుత్వం అందించే సమాచారం ఉద్యం, జీఎస్టీపై ఆధారపడి ఉంటుంది. అసలు రిజిస్ట్రేషన్ల కారణంగా ఎవరు, ఎలా ప్రయోజనం పొందుతారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సంబంధించిన వివరాలు ఈ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలుస్తాయి.

చట్టప్రకారం ఏర్పడని సంస్థలపై 2016లో ఎన్ఎస్ఎస్ ఓ సర్వే నిర్వహించింది. దీని ప్రకారం సంవత్సరానికి రూ.25-50 లక్షల ఆదాయం ఉన్న పరిశ్రమల యజమానుల్లో 45% మంది వస్తు సేవల (జీఎస్టీ) వ్యవస్థలో నమోదయ్యారు. అయితే వారి ఉద్యోగుల్లో 65 శాతం మంది అనధికారికంగా పని చేస్తున్న వారే. వీరిలో 1.54 శాతం మందికి మాత్రమే పీఎఫ్ చట్టం వర్తిస్తోంది. మూడు నుండి ఐదు కోట్ల రూపాయల వార్షిక ఆదాయం పొందుతున్న సంస్థల్లో 73 శాతం వ్యాట్ కింద నమోదయ్యాయి. కానీ ఆ సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం కార్మికుల్లో 70 శాతం మంది అనధికారికంగా ఉంటున్న వారే. వీరిలో 42 శాతం మంది అధికారికంగా రుణాలు తీసుకుంటే 9 శాతం కంటే తక్కువ మందికి మాత్రమే పీఎఫ్ చట్టం వర్తిస్తోంది.

మూడు నుంచి ఐదు కోట్ల రూపాయల వార్షిక ఆదాయం పొందిన వారి కంటే 12 లక్షల రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారిలో అధికారిక వనరుల నుండి రుణం తీసుకున్న వారి సంఖ్య నాలుగు రెట్లు అధికంగా ఉంది. అనధికారికంగా ఉపాధి పొందుతున్న వారి దామాషా 46 శాతం నుంచి 59 శాతానికి పెరిగింది. సంవత్సరానికి రూ.12 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన సంస్థలతో పోలిస్తే మూలధనాన్ని రుణంగా పొందే సంస్థల సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది.

సంవత్సరానికి రూ.12 లక్షల కంటే తక్కువ ఆదాయాన్ని పొందుతున్న సూక్ష్మ తరహా పరిశ్రమల్లో 56 శాతం మంది కార్మికులు అనధికారికంగానే పనిచేస్తున్నారు. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఆదాయాన్ని కలిగిన పరిశ్రమల్లో 65 శాతం మంది అనధికారికంగా పనిచేస్తున్నారు. కోటి రూపాయల నుంచి ఐదు కోట్ల రూపాయల వరకూ ఆదాయాన్ని పొందుతున్న పరిశ్రమల్లో సుమారు 68 శాతం మంది అనధికారిక ఉద్యోగులే. రూ.12 లక్షల లోపు ఆదాయాన్ని కలిగి, ఫ్యాక్టరీల చట్టం కింద నమోదు చేయబడిన పరిశ్రమల్లో 58 శాతం మంది కార్మికులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. సంవత్సరానికి రూ.25 లక్షల నుండి రూ.50 లక్షల వరకూ ఆదాయం కలిగిన సంస్థల విషయానికి వస్తే కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 50 శాతంగా ఉంటోంది. కోటి రూపాయల నుంచి ఐదు కోట్ల రూపాయల వరకూ ఆదాయాన్ని పొందుతున్న పరిశ్రమల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య సుమారు 45 శాతంగా ఉంది.

13న జేఎన్టీయూహెచ్‌కు సీఎం

- గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 13న సందర్శించనున్నారు. వర్సిటీలో నిర్మాణం చేసిన నూతన గోల్డెన్ జూబ్లీ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి ఆ వర్సిటీ ఇన్‌చార్జీ వీసీ బుర్రా వెంకటేశం, రెక్టార్ కె విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు తగిన ఏర్పాట్లు చేశారు. నూతన భవన ప్రారంభోత్సవ అనంతరం జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించే సభలో సీఎం పాల్గొంటారు. ఇందులో మొదట రాష్ట్రంలోని పలు ప్రయివేట్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలతో, ప్రిన్సిపాళ్లతో సాంకేతిక విద్య, పలు అంశాలతోపాటు విధి విధానాలను గురించి మాట్లాడతారని వీసీ బుర్రా వెంకటేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో సీఎం ఉన్నారని వివరించారు. ముఖ్యమంత్రి బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. వివిధ ఉద్యోగాల కోసం నైపుణ్యం పెంపొందించే జేఎన్టీయూ స్థాపించే లక్ష్యంతో వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి బీఎఫ్ఎస్ఐ పరిశ్రమలోని ప్రముఖ సంస్థలను సమావేశపరిచే లక్ష్యంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు శిక్షణనిచ్చి ఉపాధి సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆ తర్వాత రాష్ట్రంలోని వివిధ కాలేజ్ ఎన్ఎస్ఎస్ అధికారులు, కోఆర్డినేటర్లు, వాలంటీర్లతో సీఎం సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లో విద్యార్థులు డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టంపై పోలీస్ అధికారులతో ముఖ్యమంత్రి చర్చిస్తారని పేర్కొన్నారు.

నేటినుంచి డీఎస్సీ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ రాతపరీక్షలు షెడ్యూల్ ప్రకారమే ఈనెల 18 నుంచి యథాతథంగా జరుగుతాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు గురువారం నుంచి హాల్‌టికెట్లను www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి నాలుగు నుంచి గతనెల 20 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీఎస్సీకి 2,79,966 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే.

ఉక్రెయిన్‌లో నాటో కార్యాలయం ఏర్పాటు ?

- మరింత సాయానికి సిద్ధపడ్డ కూటమి
- వాషింగ్టన్‌లో నాటో సదస్సు ప్రారంభం

వాషింగ్టన్ : యుద్ధంతో అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌కు కొత్తగా సాయం చేయడానికి నాటో దేశాలు సిద్ధమయ్యాయి. ఉక్రెయిన్‌లో నాటో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంపై ఈ సదస్సులో ప్రకటన వెలువడే అవకాశం వుంది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ మంగళవారం అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ విషయం వెల్లడించారు. నాటో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమంటే దానితో పాటు ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని పర్యవేక్షించే నాటో కమాండ్ కూడా ఏర్పడుతుంది. అమెరికా నేతృత్వంలో తాత్కాలికంగా ఏర్పాటైన గ్రూపు పర్యవేక్షణలో ఇప్పటివరకు వున్న ఆయుధాలు, ఇతర రవాణా పర్యవేక్షణ బాధ్యతలను నాటో కూటమికి మార్చడం జరుగుతుంది.

బుధవారం నుండి మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులోని ప్రధాన ఎజెండాలో గల అంశాలేమిటో దీనితో స్పష్టమవుతోంది. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉక్రెయిన్ జరిపే యుద్ధం మరింత పెచ్చరిల్లే అవకాశాలు వుంటాయని భావిస్తున్నారు. నాటో సెక్రటరీ జనరల్ స్టోలెన్‌బర్గ్ కీవ్‌లో కొత్తగా నాటో సీనియర్ ప్రతినిధిని నియమిస్తారని, దీనిపై నాటో సదస్సులో ప్రకటన వెలువడుతుందని సులివాన్ తెలిపారు. నాటో కూటమితో ఉక్రెయిన్ వ్యవస్థాగత సంబంధాలను మరింత బలపరుచుకునే దిశగా ఈ చర్యలు వుంటాయన్నారు. అలాగే జర్మనీలో కొత్త నాటో మిలటరీ కమాండ్‌ను ఏర్పాటు చేస్తారు. ఉక్రెయిన్ బలగాలకు శిక్షణ, సాధనా సంపత్తిని సమకూర్చడం వంటి కార్యక్రమాలను ఈ కమాండ్ చేపడుతుంది. ఈ ఏడాది 4వేల కోట్ల యూరోల విలువైన భద్రతా సాయాన్ని ఉక్రెయిన్‌కు సామూహికంగా అందచేసేందుకు మిత్రపక్షాల నుండి హామీని అమెరికా పొందిందని సులివాన్ చెప్పారు.

వాషింగ్టన్‌లో బుధవారం ప్రారంభమైన వార్షిక సదస్సుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా ఇతర నాటో సభ్య దేశాల నేతలు హాజరయ్యారు. నాటో గతంలో కన్నా చాలా పటిష్టమైనదిగా తయారైందని బైడెన్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా, పశ్చిమ దేశాల మధ్య రెండేళ్ళకు పైగా నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో ప్రధానంగా ఈ అంశంతో పాటూ ఇతర భద్రతా సమస్యలను కూడా ఈ సదస్సులో చర్చిస్తున్నారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న భీకరమైన దాడులు, రష్యా, ఇరాన్, చైనా, ఉత్తర కొరియా మధ్య పెరుగుతున్న బంధంపై కూడా చర్చ జరగనుంది.

బీపీసీఎల్‌తో భారీ పెట్టుబడులు

- కంపెనీ ప్రతినిధులతో ఏపీ సీఎం భేటీ
- అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ
- 5వేల ఎకరాలు ఇవ్వడానికి సుముఖత



అమరావతి : భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆ సంస్థ ఛైర్మన్, ఎండి కృష్ణకుమార్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ఆయన సచివాలయంలో బుధవారం సమావేశమ య్యారు. రాష్ట్రంలో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించి వారితో చర్చించారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించిన చంద్రబాబు చర్చలు సాకారమైతే 60 వేల కోట్ల రూపాయల దాకా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుందని పేర్కొన్నారు. టీవల కేంద్ర మంత్రులను కలిసి తమరాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని వినతిపత్రం సమర్పించిన నేపథ్యంలో బిపిసిఎల్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చి సిఎంను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్థ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను 90 రోజుల్లో సమర్పించాలని వారికి సూచించారు. ఆ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పెట్రో కెమికల్, రీ ఫైనరీ ఏర్పాటుకు తమకు కనీసం 4నుండి 5వేల ఎకరాల భూమి అవసరమౌతుందని కంపెనీ ప్రతినిధులు సిఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సముద్రతీరంలో గణనీయంగా పెట్రోలియం ఉత్పత్తులు ఉన్నాయని, వెంటనే కంపెనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్స్ వేదికలో ఇదే విషయాన్న పేర్కొన్న సిఎం పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటులో ఇది తొలి అడుగని తెలిపారు. చర్చల అనంతరం బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి మీడియాతో మాట్లాడారు. బందరు పరిధిలో ఏర్పాటు చేసే సదుపాయాలకు సంబంధించిన అంశాలు కంపెనీకి వివరించామని, వారు కూడా త్వరలోనే డిపిఆర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన హామీల్లో పెట్రోలియం రిఫైనరీ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారని, దాని మేరకు కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఇక్కడ రిఫైనరీ వస్తే రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 25 వేలమందికి ఉపాధి దొరుతుందని తెలిపారు. అంతకుముందు మచిలీపట్నం ఎంపి బాలశౌరి, బిపిసిఎల్ ఎమ్‌డి కృష్ణకుమార్, బోర్డు సభ్యులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

సిఎంను కలిసిన విన్‌ఫాస్ట్ ప్రతినిధులు

వియత్నాంకు చెందిన ఆటోమొబైల్ రంగ సంస్థ విన్‌ఫాస్ట్ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిశారు. ఈ సంస్థ ఎలక్ట్రిక్ బ్యాటరీలు, వాహనాలు తయారు చేయడంలో పేరుగాంచింది. సంస్థ సిఇఓ ఫామ్ సాన్‌చౌ తన ఆహ్వానం మేరకు వచ్చారని సిఎం ఎక్స్ వేదికగా తెలిపారు. అలాగే సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించాలని పరిశ్రమలశాఖను సిఎం ఆదేశించారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై టీడీపీ వైఖరేంటీ?

- నేడు స్టీల్‌ప్లాంట్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి హాజరు
- సెయిల్‌లో విలీనం చేయాలి : సీఐటీయూ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఒకపక్క రాష్ట్రం నుంచే బీజేపీ తరఫున ఎంపీ అయిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ పాలసీనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వర్తిస్తుందని తెలిపారు. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ. 2,859 కోట్ల నష్టాన్ని చవిచూసిందని, దాని సామర్థ్యం 7 మిలియన్ టన్నుల (ఎంటి) సామర్థ్యం కంటే చాలా తక్కువగా ఉందని అన్నారు. ఏటా కంపెనీ భారీ నష్టాలను చవిచూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణకు పూనుకుంటుందని ఆయన ఉద్ఘాటించారు. అయితే ఈ ప్రకటనపై రాష్ట్రంలోని టీడీపీ, జనసేన ఎంపీలు ఎవ్వరూ స్పందించలేదు. ఇటీవల ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన చేసిన సందర్భంలో దాదాపు పది మంది కేంద్ర మంత్రులను కలిశారు. ఆ సమయంలో రాష్ట్ర ప్రజలు, కార్మిక సంఘాలు కేంద్ర ఉక్కు మంత్రిని కలిసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని అభ్యర్థిస్తారని భావించారు. కానీ చంద్రబాబు, కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలవనే లేదు. అలాగే ప్రధాని మోడీని కూడా ఆయన విజ్ఞప్తి చేయలేదు. దీంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై టీడీపీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ గురించి మాట్లాడేది. ఆ పార్టీ ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఏకంగా ఆన్‌లైన్‌లో సంతకాల సేకరణ చేశారు. కానీ టీడీపీ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ ఏం మాట్లాడటం లేదు. మరోవైపు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, సీఐటీయూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌ను కూడా టీడీపీ లేవనెత్తడం లేదు.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలనే ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో స్పష్టం చేసింది. అయితే ఇటీవల టీడీపీ, బీజేపీల మధ్య సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గురువారం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి విశాఖపట్నంలో పర్యటించడంపై సర్వత్రా ఆసక్తి, ఊహాగానాలు మొదలయ్యాయి. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి జూలై 10 (బుధవారం)న విశాఖపట్నం చేరుకుంటారు. రాత్రికి ప్రతిష్టాత్మకమైన ఆర్ఐఎన్ఎల్ అతిథి గృహంలో అతనికి బస చేస్తారు. గురువారం (నేడు) ఉదయం 11:30 గంటలకు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సమావేశ అనంతరం మంత్రి ఎన్ఎండీసీ అధికారులతో సమావేశం కోసం మధ్యాహ్నం 1:30కు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

"మేము వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం నిర్ణయానికి మద్దతిస్తాం. మాకు ఇబ్బంది లేదు" అని టీడీపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. కేంద్రం ప్రయివేటీకరణ విధానంపై టీడీపీ వైఖరి గురించి అడిగినప్పుడు, దాని వల్ల వృద్ధి, పెట్టుబడులు వస్తాయని దానితో తనకు ఇబ్బంది లేదని చెప్పారు. జనవరి 2022లో టాటా గ్రూప్ కొనుగోలు చేసిన నీలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఎన్ఐఎన్ఎల్)లా, ప్లాంట్ పునరుద్ధరించడానికి, ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించడానికి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చాలా కీలకమని ఆయన అన్నారు. "ప్రస్తుతం, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ 7 మిలియన్ టన్నుల (ఎంటీ) సామర్థ్యాన్ని కలిగి ఉంది. తాజా పెట్టుబడిని పంపిస్తే 17 ఎంటీ వరకు విస్తరించవచ్చు. 2022 జనవరిలో టాటా గ్రూప్ నాలుగు కేంద్ర పీఎస్‌యూలు, రెండు ఒడిశా ప్రభుత్వ పీఎస్‌యూల సంయుక్తంగా యాజమాన్యంలోని ఎన్ఐఎన్ఎల్‌ను రూ.12,100 కోట్లకు కొనుగోలు చేసింది. ప్లాంట్‌ను పునరుద్ధరించడం, సిబ్బంది ఉద్యోగాలను కాపాడటంతోపాటు , టాటా భారీ పెట్టుబడులతో ప్లాంట్ సామర్థ్యాన్ని విస్తరించింది" అని తెలిపారు. అయితే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 8,000 కోట్లను డిమాండ్ చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు వెల్లడించారు.

> ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ టీడీపీ భాగస్వామ్యమున్న ప్రభుత్వాలు ఏర్పడటంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై టీడీపీ వైఖరిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కేంద్రంలోని బీజేపీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించేందుకు కృతనిశ్చయంతో ఉంది. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయానికి, రాష్ట్రంలోని అధికారంలో ఉన్న టీడీపీ మద్దతు ఇస్తుందా? లేక వ్యతిరేకించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటుందా? అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. అయితే టీడీపీ వైఖరి చూస్తే ప్రయివేటీకరణకు మద్దతు తెలిపేటట్లే కనిపిస్తోంది.

కేంద్రం తాజా ప్రణాళిక

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా ఒక ప్రణాళికను రూపొందిస్తోంది. దీనికింద కాబోయే ప్లాంట్ కొనుగోలుదారు దాని సామర్థ్యం 7 మిలియన్ టన్నులకు విస్తరించేందుకు కట్టుబడి ఉండాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ దాదాపు 19 వేల ఎకరాల భూమిని కలిగి ఉంది. ఇందులో ఆరు వేల ఎకరాల గ్రీన్ బెల్ట్ ఉంది. కాబోయే కొనుగోలుదారులు కొత్త గ్రీన్‌బెల్ట్‌ను ఏర్పాటు చేయడం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొననుంది. ఇప్పటికే ఈ భూములన్నీ నేరుగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయి.